బుధవారం
2•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 188
• పేజీలు: 16 + 16 + 12 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

ఎన్నాళ్లో వేచిన ఉదయం..



మంగళ వారం రాజ్‌భవన్‌లో తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా రాధాకృష్ణన్‌తో గవర్నర్ నరసింహన్ ప్రమాణం చేయించిన తర్వాత ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

కొలువుదీరిన మన హైకోర్టు

సీజేగా జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం

- రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ నరసింహన్
- హైకోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం
- ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం కేసీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియామకమైన తొట్టతిల్ భాస్కరన్ నాయర్ రాధాకృష్ణన్ మంగళవారం రాజ్‌భవన్‌లో ప్రమాణం స్వీకరించారు. అనంతరం హైకోర్టులో 12 మంది జడ్జీలు ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో ఉదయం 8.30 గంటలకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణన్‌తో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జనవరి ఒకటో తేదీనుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు ఉనికిలోకొచ్చాయి. గవర్నర్ నరసింహన్ మంగళవారం ఉదయం తొలుత రాజ్‌భవన్‌లో తెలంగాణ ప్రధాన న్యాయమూర్తితో ప్రమాణం చేయించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళి విజయవాడలో ఆ రాష్ట్ర చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణం చేయించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో చీఫ్ జస్టిస్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి, మాజీ న్యాయమూర్తి జస్టిస్ వెంకట్రాంరెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు, శాసనమండలి చైర్మన్

మిగతా 3వ పేజీలో

పంచాయతీకి చాటింపు



మూడు విడుతల్లో ఎన్నికలు

I. జనవరి 7 నుంచి 21 వరకు
II. జనవరి 11 నుంచి 25 వరకు
III. జనవరి 16 నుంచి 30 వరకు



రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి

- పంచాయతీ పోరుకు నోటిఫికేషన్
- పోలింగ్ రోజే కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నిక

మొత్తం గ్రామాలు: 12,751
ఎన్నికలు జరుగనున్న గ్రామాలు 12,732
వార్డులు: 1,13,170
మొత్తం పోలింగ్ కేంద్రాలు: 1,13,190

విడుత	గ్రామాలు	వార్డులు
మొదటి	4,480	39,832
రెండో	4,137	36,620
మూడో	4,115	36,718

మొత్తం ఓటర్లు : 1,49,52,058
మే నెల జాబితా: 1,37,17,469
సప్లిమెంటరీ జాబితా-1: 12,34,589

రిటర్నింగ్ ఆఫీసర్లు
స్టేజ్-1: 5097 స్టేజ్-2, 3: 13,965
పోలింగ్ సిబ్బంది: 1,48,033
పోలీస్ సిబ్బంది : 26,340
సాధారణ పరిశీలకులు: 26
ఎన్నికల వ్యయ పరిశీలకులు: 39
ఒక్కో విడుతలో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మొత్తం మూడు విడుతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి ప్రకటించారు. మొత్తం 12,732 గ్రామాలు, 1,13,170 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,13,190 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో విడుత ఎన్నికలను 14 రోజుల్లో పూర్తిచేస్తామని చెప్పారు. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిందని ప్రకటించారు. ప్రభుత్వం కొత్తగా ఎలాంటి ప్రజాకర్షక పథకాలు ప్రకటించరాదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలచేశారు. రాష్ట్రంలో మొత్తం 12,751 పంచాయతీలు ఉండగా 17 గ్రామాలకు పదవీకాలం పూర్తికాలేదని, మరో 2 గ్రామాలకు సంబంధించిన కోర్టు కేసులు ఉన్నాయని తెలిపారు. దీంతో ఈ 19 గ్రామాలను మినహాయించి 12,732 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు వివిధ శాఖల సమన్వయంతో పటిష్ఠమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ నెల 7వ తేదీ నుంచి మొదటి విడుత ఎన్నికలు ప్రారంభం అవుతాయన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఓటరు జాబితాలో వరుస సంఖ్య, ఎపిక్ కార్డుతోపాటు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. ముందుగా వార్డుస్థానాల ఓట్లు లెక్కిస్తామని, ఆ తర్వాత సర్పంచ్ అభ్యర్థుల ఓట్లు లెక్కిస్తామని చెప్పారు. ఉప సర్పంచ్ ఎన్నిక సైతం అదేరోజు ఉంటుందని, చేతులు ఎత్తే పద్ధతిలో

మిగతా 8వ పేజీలో



మంగళ వారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మేడిగడ్డ బరాజ్ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

మార్చి 31 డెడ్‌లైన్

ఎట్టి పరిస్థితుల్లో జూన్‌లో కాళేశ్వరం నీళ్లు అందాలి: సీఎం కేసీఆర్

- ఏప్రిల్‌లో ట్రయల్ రన్‌కు కాఫర్ డ్యామ్
- వర్షాకాలంలో మిడ్‌మానేరుకు గోదావరి నీరు
- సాగునీటి కోసం ఆశగా చూస్తున్న రైతులు
- యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తిచేయాలి
- ఇంజినీర్లు, వర్క్ ఏజెన్సీలకు సీఎం కేసీఆర్ ఆదేశం
- ప్రాజెక్టులు పూర్తిచేసి చిత్తశుద్ధి చాటుకుంటామని వ్యాఖ్య



మంగళవారం కన్నెపల్లి పంప్‌హౌజ్ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- ప్రాజెక్టుల యాత్రలో తొలిరోజు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన
- మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌజ్ పనుల పరిశీలన
- నేడు జగిత్యాల జిల్లాలో ఎస్సారెస్పీ రివర్స్ పంపింగ్ పనుల సందర్శన

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పరిధిలోని బరాజ్‌లు, పంపుహౌజ్‌ల నిర్మాణపనులన్నీ మార్చి చివరినాటికే పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సాగునీటిశాఖ అధికారులు, వర్క్ఏజెన్సీలను ఆదేశించారు. గోదావరిలో కాఫర్‌డ్యామ్ ఏర్పాటుచేసుకొని ఏప్రిల్ నెలలో ప్రాజెక్టు ట్రయల్‌రన్ నిర్వహించాలని చెప్పారు. ఈ వర్షాకాలంలో జూన్ నుంచి గోదావరి నీటిని కరీంనగర్‌లోని మిడ్‌మానేరు వరకు ఎత్తిపోసేలా ప్రణాళిక రూపొందించుకొని అమలుచేయాలని సూచించారు. రైతులు సాగునీటి కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా సీఎం కేసీఆర్ మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌజ్‌ను సందర్శించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించారు. అక్కడికక్కడే సాగునీటి శాఖ ఇంజినీర్లు, వర్క్ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌లతోపాటు పంపుహౌజ్‌ల

మిగతా 2వ పేజీలో

ఫిబ్రవరి ఒకటి నుంచి

ఇంటర్ ప్రాక్టికల్స్

- ఆన్‌లైన్ ద్వారా ప్రశ్నపత్రం డౌన్‌లోడ్
- పరీక్ష రోజే వైబ్‌సైట్‌లో మార్కుల అప్‌లోడ్
- హాజరుకానున్న రెండులక్షలకుపైగా విద్యార్థులు
- హాల్‌టికెట్లు నిలిపివేస్తే యాజమాన్యాలపై కఠినచర్యలు: ఇంటర్‌బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి ఒకటినుంచి 20 వరకు జరుగనున్నాయి. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్‌బోర్డు ఏర్పాట్లుచేస్తున్నది. రెండు లక్షల పైచిలుకు మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్నారు. ఇంటర్‌బోర్డు నిర్దేశించిన సమయంలోనే ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. ప్రాక్టికల్ ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొనేందుకు ఇంటర్‌బోర్డు అవకాశం కల్పించింది. పరీక్షలు నిర్వహించిన రోజే మార్కులను వైబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత అప్‌లోడ్ చేసేందుకు

మిగతా 2వ పేజీలో

పెట్రోల్ కంటే విమాన ఇంధనం చౌక

కిలో లీటరు ఇంధనంపై 14.7 శాతం తగ్గుదల

5

లింగ సమానత్వం కోసం.. మహిళాహారం

కేరళలో 620 కిలోమీటర్ల పొడవున అతిపెద్ద 'ఉమెన్ వాల్'

శబరిమలలో ప్రవేశం కోసం నినదించిన మహిళలు



మంగళవారం సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో చలిమంటవేసుకుంటున్న స్థానికులు

గజగజలాడిస్తున్న చలి

- ఉత్తర, ఈశాన్య దిశలనుంచి వీస్తున్న శీతగాలులు
- సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 2.9 డిగ్రీలు
- ఆదిలాబాద్ అర్లి(టీ)లో 3.2, హైదరాబాద్‌లో 9గా నమోదు
- మరో నాలుగురోజులు ఇదే పరిస్థితి!

4



సుప్రీం తీర్పు తర్వాతే ఆర్డినెన్స్‌పై ఆలోచన

- రామ మందిర నిర్మాణంపై ప్రధాని మోదీ
- ఒక్క యుద్ధంతో పాక్ తీరు మారదు
- వ్యక్తిగత కారణాలతోనే ఉర్జిత్‌పటేల్ నిష్క్రమణ
- ఏఎన్‌ఐ ఇంటర్వ్యూలో ప్రధాని వివరణ
- రామాలయాన్ని ప్రస్తుత హయాంలోనే నిర్మించాలి: ఆరెస్సెస్

5



బాలీవుడ్ దిగ్గజం ఖాదర్ ఖాన్ కన్నుమూత

- దీర్ఘకాల అస్వస్థతతో కెనడాలో తుదిశ్వాస
- నటనతోపాటు రచనా రంగంలోనూ బలమైన ముద్రవేసిన ఖాన్

4

అంధవిద్యార్థులతో కేటీఆర్ న్యూఇయర్



మంగళవారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న అంధ విద్యార్థులు. చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులు



తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన సినీ సంగీత దర్శకుడు కోటి, గాయకురాలు బేబీ తదితరులు

- తెలంగాణభవన్‌లో కొత్త సంవత్సరం వేడుకలు
- అంధ విద్యార్థులు, నేతలు, కార్యకర్తల మధ్య కేక్ కట్‌చేసిన కేటీఆర్
- శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేలు
- ప్రతి ఒక్కరినీ పలుకరించిన టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణభవన్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అంధవిద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేసి న్యూఇయర్ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తెలంగాణభవన్‌కు తరలివచ్చారు. కేటీఆర్ ప్రతిఒక్కరినీ పలుకరిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సైతం శుభాకాంక్షలు చెప్పేందుకు తెలంగాణభవన్‌కు వచ్చారు. కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపినవారిలో ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ,ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ సలీం, ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, మాగంటి గోపీనాథ్, శ్రీనివాస్‌గౌడ్, టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, టీజీవో అధ్యక్షురాలు మమత, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, టీఆర్ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌పై ప్రత్యేకంగా పాట..

సినీ సంగీత దర్శకుడు కోటి, గాయకురాలు బేబీ.. కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్‌పై రచయిత రామలింగం రాసిన పాటను కోటి ఆవిష్కరించగా, బేబీ పాడి వినిపించారు.

టీఆర్ఎస్కేవీ ఆధ్వర్యంలో వేడుకలు..

తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్కేవీ ఆధ్వర్యంలో న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి పీ నారాయణ, శారద, మారయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటర్ అఫిలియేషన్ నోటిఫికేషన్

- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, అఫిలియేషన్ ప్రక్రియ
- 45 రోజుల గడువు ఇచ్చే అవకాశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో 2019-20 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రైవేటు జూనియర్ కాలేజీల అఫిలియేషన్ (అనుబంధ గుర్తింపు) ప్రక్రియను ఇంటర్ బోర్డు అధికారులు ప్రారంభించారు. వారంరోజుల్లో అఫిలియేషన్ నోటిఫికేషన్ జారీచేయాలని ఇటీవల జరిగిన బోర్డు పాలకమండలి సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకొన్నారు. పొరపాట్లకు, ఆలస్యానికి తావులేకుండా ఉండేందుకు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అఫిలియేషన్ పూర్తిచేయనున్నారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను స్వీకరించి అనుబంధ గుర్తింపు విచారణ పూర్తిచేయనున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఈ ప్రక్రియను చేపట్టి 1,600 ప్రైవేటు జూనియర్ కాలేజీలకుగాను విద్యాప్రమాణాలు కలిగివున్న 1,300 కాలేజీలకు అఫిలియేషన్లు ఇచ్చినట్లు బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. ఆన్‌లైన్‌లో అఫిలియేషన్ దరఖాస్తుల స్వీకరణకు 45 రోజుల గడువు విధించే అవకాశాలను ఇంటర్ బోర్డు అధికారులు పరిశీలిస్తున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్

మొదటిపేజీ తరువాయి...

వెబ్‌సైట్ సహకరించదు. పారదర్శకంగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని కళాశాలల యాజమాన్యాలకు ఇంటర్‌బోర్డు అధికారులు సూచించారు. ట్యూషన్ ఫీజులు చెల్లించకపోవడం వంటి కారణాలతో విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా నిలిపివేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇంటర్‌బోర్డు కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించింది. ఇంటర్‌బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.50 గంటలకు



సూర్యాస్తమయం: 5.50 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం, ద్వాదశి, నక్షత్రం: విశాఖ ఉదయం 9.40 వరకు, తదుపరి అనురాధ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం మధ్యాహ్నం 12.20 నుంచి 1.43 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.58 నుంచి మధ్యాహ్నం 12.42 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 1.54 నుంచి 3.56 వరకు.

లోకం పోకడ





మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మేడిగడ్డ బరాజ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్



మార్చి 31 డెడ్‌లైన్

మొదటిపేజీ తరువాయి...

నిర్మాణ పనులు, మోటర్ల ఏర్పాటు పనులన్నీ సమాంతరంగా పూర్తికావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మార్చి 31వ తేదీ వరకు ప్రధానమైన ప్రాజెక్టు పనులన్నీ పూర్తిచేసి ఏప్రిల్, మే నెలల్లో ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్‌లో ఈ ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు అందించడానికి సిద్ధంకావాలని స్పష్టంచేశారు. గోదావరినదిలో తెలంగాణ వాటా నీళ్లను వీలైనంత త్వరగా ఉపయోగించుకోవాలంటే ఈ ప్రాజెక్టులో పంపుహౌస్‌ల నిర్మాణం, మోటర్ల బిగింపు పనుల ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. గోదావరికి రెండువైపుల ఉండే ఫ్లడ్ బ్యాంక్స్ పనులను పరిశీలించిన సీఎం కేసీఆర్ మట్టిపని, రివిట్‌మెంట్ పనులను జలాశయం మట్టం దాకా పూర్తిచేయాలని సూచించారు. మేడిగడ్డ బరాజ్ గేట్ల ఏర్పాటు పనులను, గేట్లను ఆపరేట్‌చేసే విధానాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించిన రాఫ్ట్ ఫౌండేషన్ పనులను జనవరి నెలాఖరులోగా పూర్తిచేయాలని అన్నారు. ఈ బరాజ్ కాంక్రీట్ వర్క్ రోజుకు పదివేల క్యూబిక్ మీటర్లకు తగ్గకుండా చేయాలని వర్క్ ఏజెన్సీని ఆదేశించారు. కన్నెపల్లి పంపుహౌస్ ఫోర్‌బే, హెడ్ రెగ్యులేటర్ పనులను పరిశీలించిన సమయంలో హెడ్ రెగ్యులేటర్ పనుల్లో ఉన్న సాంకేతిక లోపాలను సవరించాలని అధికారులకు సూచించారు. కన్నెపల్లి పంపుహౌస్ పనులను, ఇక్కడ పదకొండు పంపులు బిగించే ప్రక్రియను మార్చి 31వ తేదీలోగా పూర్తిచేయాలని అన్నారు. సముద్రమార్గంలో చెన్నై దాకా చేరుకొని పోర్టులో ఉన్న మోటర్లను వెంటనే తెప్పించాలని అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు. నిధులపరంగా ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తిచేసే విషయంలో ఏమాత్రం రాజీ పడవద్దని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ టీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రభుత్వం కూడా చిత్తశుద్ధి చాటుకుంటుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సీఎంవో సెక్రటరీ ప్రతి పదిరోజులకు ఒకసారి పర్యవేక్షిస్తారని కేసీఆర్ తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణపనులను పూర్తిచేయాలని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును ముఖ్యమంత్రి ఫోన్‌లో ఆదేశించారు. సీఎం కేసీఆర్ వెంట ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, దివాకర్‌రావు, శ్రీధర్‌బాబు, టీఎస్ ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్, సీఎం సెక్రటరీ స్మితా సబర్వాల్, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌రావు, ప్రాజెక్టు సీఈ వెంకటేశ్వర్లు, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, లిఫ్ట్ సలహాదారు పెంటారెడ్డి, ఎల్‌అండ్‌టీ సీఎండీ సుబ్రమణ్యన్, మెగా ఎండీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్ల ద్వారా మేడిగడ్డ బరాజ్ వద్దకు చేరుకున్న సీఎం కేసీఆర్‌కు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఎస్పీ ఆర్ భాస్కరన్, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ సుధాకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. సాయంత్రం 5.30 గంటలకు కన్నెపల్లి పంపుహౌస్ వద్ద తన తొలిరోజు పర్యటన ముగించుకొని సీఎం కేసీఆర్ కరీంనగర్ చేరుకున్నారు. మళ్లీ బుధవారం ఉదయం రెండోరోజు ముఖ్యమంత్రి పర్యటన కన్నెపల్లి పంపుహౌస్ గ్రావిటీ కెనాల్ నుంచి ప్రారంభం అవుతుందని కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ వెంకటేశ్వర్లు మీడియాకు తెలిపారు.



కన్నెపల్లి పంపుహౌస్ వద్ద పనుల పురోగతిపై ఆరాతీస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో టీఎస్ ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంపుహౌస్ పనులపై అధికారులకు సూచనలిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్, ఎమ్మెల్యే దివాకర్‌రావు తదితరులు కూడా ఉన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

మల్యాల/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లాలో నిర్మిస్తున్న ఎస్సారెస్పీ రివర్స్ పంపింగ్ పనుల పరిశీలనకు ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం వస్తున్నందున ఏర్పాట్లను కలెక్టర్ శరత్, ఎస్పీ సింధూశర్మ మంగళవారం పరిశీలించారు. మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌస్, ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్ వద్ద హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ.. వ్యూ పాయింట్, ఫొటో గ్యాలరీ, పాత్రికేయుల అనుమతి, రివ్యూ రిపోర్టు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్ వద్ద పనులను కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పరిశీలించి మాట్లాడారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో వరద కాల్వ నిరంతరం జలకళ సంతరించుకొని జగిత్యాల జిల్లా సస్యశ్యామలం కానున్నదన్నారు. అధికారుల వెంట జేసీ బేతి రాజేశం, ఆర్డీవో డాక్టర్ ఘంటా నరేందర్, అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీ వెంకటరమణ, వరద కాల్వ ఈఈ సుధాకిరణ్, డీఈ రాంప్రదీప్ తదితరులున్నారు.



మేడిగడ్డ బరాజ్ వద్ద పనుల పురోగతిని సీఎం కేసీఆర్‌కు వివరిస్తున్న అధికారులు. చిత్రంలో నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, సీఎస్ ఎస్కే జోషి, సీఎం సెక్రటరీ స్మితా సబర్వాల్ తదితరులు కూడా ఉన్నారు.

ప్రజల రుణం తీర్చుకోవాలి

- ప్రతి నిముషం పనిచేయాలి
- ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు మన వెంటే ఉన్నారు
- వచ్చే ప్రతి ఎన్నికల్లోనూ గెలుపు మనదే
- ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి కేసీఆర్

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ముందునుంచి ప్రజలు మన పక్షానే ఉన్నారని చెప్తూ వచ్చామని, ఎంతోమంది ఎన్నోరకాల కుట్రలు, కుతంత్రాలు చేసినా మనపై నమ్మకం పెట్టి అఖండ మెజార్టీనిచ్చి పట్టం కట్టారని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రజల రుణం తీర్చుకోవడానికి ప్రతి నిముషం కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. మంగళవారం ప్రాజెక్టుల పరిశీలన కార్యక్రమాన్ని పూర్తిచేసుకొని.. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లె వద్ద ఉన్న కేసీఆర్ భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి.. అక్కడికి వచ్చిన పార్టీ శ్రేణులను, అధికారులను కలుసుకున్న తదుపరి ఉమ్మడి జిల్లా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సుమారు రెండుగంటలకు పైగా జరిగిన సమావేశంలో ఒక్కో నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు చేయాల్సిన పనులు, కష్టపడాల్సిన తీరు వంటి అంశాలపై నిశితంగా వివరించారు. ప్రతి నిముషం ప్రజల బాగుకోసం, నియోజకవర్గ అభివృద్ధికోసం పాటుపడాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలపై ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. 'మనం ఎంతచేసినా ప్రజల రుణం తీర్చుకోలేం. ఉద్యమంలో మన వెంట నడిచారు. ప్రస్తుతం ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారు. మనం చేస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తిస్తున్న విషయాన్ని ప్రతి ఎమ్మెల్యే గమనించాలి. ఈ సంక్షేమ కార్యక్రమాలను నిజమైన అర్హులకు చేరేలా చర్యలు తీసుకోవడమే కాదు.. ఇంకా ప్రజలకు మేలుచేసే కార్యక్రమాలను చేయాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 110 సీట్లు గెలిచేలా పనిచేయాలి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో 110 సీట్లు గెలిచే విధంగా మన పనితీరు ఉండాలని సీఎం కేసీఆర్ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. రాబోయే ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు టీఆర్ఎస్ పక్షానే నిలుస్తారని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అన్నిచోట్ల గులాబీ జెండా ఎగురుతుందన్న సీఎం.. ప్రతి పల్లెకు మన ప్రభుత్వ పథకాలు చేరాలని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని, ఈ దిశగా అందరూ ఎమ్మెల్యేలు కలసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఈ నెల ఐదున ఎస్సారెస్పీ, వరదకాల్వ అధికారులతో సమావేశమై.. ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, కే విద్యాసాగర్‌రావు, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, సుంకె రవిశంకర్, కోరుకంటి చందర్, వొడితెల సతీశ్‌కుమార్, సంజయ్‌కుమార్‌లతోపాటు మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, సోమారపు సత్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు కేసీఆర్ భవన్ వద్ద ముఖ్యమంత్రికి పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు, టీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసి వారిలో ఉమ్మడి జిల్లా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, పాతూరి సుధాకర్‌రెడ్డి, జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్‌అహ్మద్, పోలీసు కమిషనర్ కమలాసన్‌రెడ్డి, జేసీ శ్యాం ప్రసాద్‌లాల్ తదితరులున్నారు. ముఖ్యమంత్రి వెంట సీఎం కార్యదర్శి స్మితాసబర్వాల్, ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషి తదితర అధికారులున్నారు.



మంగళవారం కరీంనగర్‌లోని కేసీఆర్ భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు

దేవాదుల పనులనూ పరిశీలించండి

- విశ్రాంత ఇంజినీర్లకు సీఎం కేసీఆర్ సూచన
- రేపు సందర్శనకు వెళ్లనున్న ట్రీ బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించి రావాలని విశ్రాంత ఇంజినీర్ల బృందాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కోరారు. దేవాదుల పనులు ఆశించినస్థాయిలో పూర్తికావడంలేదని భావిస్తున్న సీఎం.. అందుకుగల కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలన జరుపాలని విశ్రాంత ఇంజినీర్లను కోరినట్టు సమాచారం. సీఎం సూచన మేరకు దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం (ట్రీ) బృందం గురువారం సందర్శించే అవకాశం ఉంది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో మరింత వేగాన్ని పెంచేందుకు సంకల్పించిన ముఖ్యమంత్రి.. వివిధమార్గాల్లో ఫీడ్‌బ్యాక్ తెప్పించుకుంటున్నారు. ఇందుకు ట్రీ సహకారం అందిస్తున్నది. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు ఒకరోజు ముందు.. అంటే సోమవారం ట్రీ బృందం ప్రాజెక్టు పనులను పరిశీలించి వచ్చింది. అనంతరం సోమవారం రాత్రి సీఎంకు తమ పరిశీలన అంశాల్ని వివరించింది. విశ్రాంత ఇంజినీర్లతో దాదాపు రెండున్నర గంటలపాటు చర్చించిన సీఎం.. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్ని మార్చి చివరినాటికి పూర్తిచేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఎక్కడెక్కడ లోపాలు, ఇబ్బందులున్నాయి? ప్రధానంగా పనుల్లో వేగం పుంజుకోకపోవడానికి గల కారణాలు? ఇలా అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం సూచన మేరకు మంగళవారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను కూడా ట్రీ బృందం పరిశీలించింది. బుధవారం సీతారామ ప్రాజెక్టు పనులను కూడా బృందం సభ్యులు పరిశీలించనున్నారు. అయితే సోమవారం రాత్రి విశ్రాంత ఇంజినీర్లతో మాట్లాడుతున్న సందర్భంలో దేవాదుల ఎత్తిపోతల పథకం పనులు కూడా పరిశీలించాలని సూచించినట్టు తెలిసింది. విశ్రాంత ఇంజినీర్ల సూచనలు, తన క్షేత్రస్థాయి పర్యటనలో పరిశీలించిన అంశాల ఆధారంగా సాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం లేదా ఆ తర్వాత ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించే సూచనలు కనిపిస్తున్నాయి.

బుల్లెట్ రైళ్లకు ప్రాధాన్యం

- ముఖ్య పట్టణాల్లో హైస్పీడ్ రైళ్లు
- ప్రయాణికుల భద్రతకు పెద్దపీట
- రైల్వే బోర్డు నూతన చైర్మన్ వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బుల్లెట్ రైళ్లకు ప్రాధాన్యమిస్తూ హైస్పీడ్ ప్రయాణానికి ప్రాజెక్టుల రూపకల్పన చేస్తామని రైల్వే బోర్డు నూతన చైర్మన్ వినోద్‌కుమార్ తెలిపారు. హైస్పీడ్ రైళ్లను ముఖ్యపట్టణాల్లో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. వినోద్‌కుమార్ యాదవ్ మంగళవారం రైల్ నిలయంలో రైల్వే బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో భద్రతకు ప్రాధాన్యమిచ్చి, ప్రయాణికులకు వసతులు కల్పిస్తామని చెప్పారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృక్కోణమైన 'నవ భారతం-కొత్త రైల్వే' సాధన కోసం కృషిచేస్తామని చెప్పారు. రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆధ్వర్యంలో రైల్వే ప్రగతి కొత్తపుంతలు తొక్కిందని.. కొత్త రైల్వేలైన్లు.. డబ్లింగ్, ట్రిపులింగ్‌కు ప్రాధాన్యమిస్తామని వినోద్‌కుమార్ తెలిపారు. సికింద్రాబాద్ జోన్‌ను ప్రథమస్థానంలో నిలుపడంలో ఉద్యోగులు చూపిన చొరువను కొనియాడారు. దక్షిణ మధ్యరైల్వే జోన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, గుంతకల్ డివిజన్ల మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంకితభావంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు.

వినోద్‌కుమార్‌కు ఘనంగా సన్మానం

దక్షిణమధ్యరైల్వే జీఎంగా ఉన్న వినోద్‌కుమార్ భారతీయ రైల్వేబోర్డు చైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా సికింద్రాబాద్ జోన్ రైల్వే ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆల్‌ఇండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దీకొండ పద్మనాభం చైర్మన్ వినోద్‌కుమార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నాయకులు భాస్కర్, అశోక్, అంజయ్య పాల్గొన్నారు.

రైల్వే బోర్డు చైర్మన్‌కు ఎంపీ వినోద్ అభినందనలు



రైల్వేబోర్డు చైర్మన్‌గా నియమితులైన వినోద్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎంపీ వినోద్‌కుమార్

పెండింగ్ ప్రాజెక్టులను పరిష్కరించాలని వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్షిణ మధ్య రైల్వే జీఎంగా పని చేసి రైల్వే బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వినోద్‌కుమార్ యాదవ్‌కు కరీంగనర్ ఎంపీ వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు, పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పరిష్కరించాలని కోరారు. మంగళవారం రైల్ నిలయంలో రైల్వే బోర్డు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులతో పాటు ఆర్‌యూబీలు, ఆర్వోబీలు, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పలు స్టేషన్లలో నిలుపుదల వంటి కార్యక్రమాలను పూర్తిచేయాలని కోరినట్లు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి వాటిని పరిష్కరించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్టు ఎంపీ వినోద్‌కుమార్ తెలిపారు.



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్‌కు దుప్పట్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, ఇతర ప్రతినిధులు

కొలువుదీరిన మన హైకోర్టు

మొదటిపేజీ తరువాయి...

స్వామిగౌడ్, అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, హోంమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు గుత్తా సుఖేందర్ రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ప్రశాంత్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు శేరి సుభాష్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, డీజీపీ మహేందర్‌రెడ్డి, టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, నల్సార్ యూనివర్సిటీ అధికారులు తదితరులు హాజరయ్యారు.



తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీ రాధాకృష్ణన్‌తో న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం చేసిన 12 మంది జడ్జీల గ్రూప్ ఫొటో

హైకోర్టులో 12 మంది జడ్జీల ప్రమాణం

రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం అనంతరం హైకోర్టు ప్రాంగణానికి చేరుకున్న చీఫ్ జస్టిస్ తొట్టథిల్ బీ రాధాకృష్ణన్.. అక్కడ 12 మంది హైకోర్టు న్యాయమూర్తులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా హాజరయ్యారు. రాజ్యాంగం ప్రకారం తమకు కేటాయించిన విధులను భయం, పక్షపాతం లేకుండా నిర్వహిస్తామని జస్టిస్‌లు రాఘువేంద్రసింగ్ చౌహాన్, వీ రామసుబ్రమణియన్, పులిగోరు వెంకట సంజయ్‌కుమార్, ఎంఎస్‌ఆర్‌ఎస్ రామచంద్రారావు, ఎడవల్లి రాజశేఖర్‌రెడ్డి, పొనుగంటి నవీన్‌రావు, చల్లా కోదండరాంచౌదరి, బులుసు శివశంకరరావు, డాక్టర్ షమీమ్ అక్తర్, పొట్లపల్లి కేశవరావు, అభినందన్‌కుమార్ షావిలి, తొడుపునూరి అమర్‌నాథ్‌గౌడ్ ప్రమాణం చేశారు. న్యాయమూర్తుల ప్రమాణం అనంతరం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి తదితరులు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత న్యాయమూర్తుల చాంబర్లను సీఎం సందర్శించారు. హైకోర్టులో జరిగిన న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, ఏఏజీ రామచంద్రారావు, అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ లక్ష్మణ్, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ న్యాయవాదులు, తెలంగాణ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు సునీల్‌గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు గండ్ర మోహన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంకే ముకీద్, మధుసూదన్‌రావు, జయకర్, లక్ష్మణ్‌కుమార్, అనంతసేనారెడ్డి, జితేందర్‌రెడ్డి, తెలంగాణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు హరిప్రీత్, ప్రధాన కార్యదర్శులు కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, సుంకరి జనార్దన్‌గౌడ్, అడ్వకేట్ జేఏసీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కల్యాణ్‌రావు, బాల్‌రాజ్, శ్రీనివాస్, భారీ సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.



తెలంగాణ హైకోర్టు ప్రధాన భవనం ఎదుట ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

సీఎం కేసీఆర్‌కు న్యాయవాదుల స్వాగతం

న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హైకోర్టుకు వచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు తెలంగాణ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘనస్వాగతం పలికారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డికి తెలంగాణ న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.



ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న తెలంగాణ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

ఆదిలాబాద్ కలెక్టర్ పిలుపునకు

భారీ స్పందన

- బొకేలకు బదులు దుప్పట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చే వారు బొకేలు, మిఠాయిలకు బదులుగా దుప్పట్లు, శాలువాలు తీసుకురావాలని ఆదిలాబాద్ కలెక్టర్ దివ్యదేవరాజన్ సూచించారు. జిల్లాలో వారం రోజులుగా 4 నుంచి 5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఈ మేరకు పిలుపునిచ్చారు. అందుకనుగుణంగా అధికారులు, సిబ్బంది, ఎన్జీవోలు, ఇతరులు దుప్పట్లు, రగ్గులు అందజేసి కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తన సూచనకు స్పందించిన వారికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ దుప్పట్లను పేదలు, గిరిజన గ్రామాల ప్రజలతోపాటు వసతి గృహాల్లోని విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు చైర్మన్‌గా సౌరభ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు చైర్మన్‌గా సౌరభ్‌కుమార్ నియమితులయ్యారు. మంగళవారం కోల్‌కతాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు కార్యాలయంలో ప్రస్తుత చైర్మన్ పీకే శ్రీవాస్తవ నుంచి సౌరభ్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఐఐటీ కాన్పూర్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో సౌరభ్‌కుమార్ ఎంటెక్ పూర్తి చేశారు.

న్యాయమూర్తులకు అంశాల కేటాయింపు

మూడు డివిజన్ బెంచ్‌ల ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఏర్పడిన నేపథ్యంలో కొత్తగా న్యాయమూర్తులవారీగా వివిధ అంశాలను కేటాయించారు. మూడు ద్విసభ్య ధర్మాసనాలను (డివిజన్ బెంచ్‌లను) ఏర్పాటు చేశారు. మొదటి డివిజన్ బెంచ్‌లో చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్, జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి సభ్యులుగా ఉంటారు. రెండో డివిజన్ బెంచ్‌లో రాఘువేంద్ర ఎస్ చౌహాన్, టీ అమర్‌నాథ్‌గౌడ్, మూడో డివిజన్ బెంచ్‌లో వీ రామసుబ్రమణియన్, పీ కేశవరావులు సభ్యులుగా ఉంటారు. మొదటి ధర్మాసనం అన్ని రిట్ అప్పీళ్లు, ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్), ధిక్కరణ అప్పీళ్లు, క్రిమినల్ ధిక్కరణ అప్పీళ్లు, హెబియస్‌కార్పస్ కేసులు, సుమోటో రిట్ పిటిషన్లు, హైకోర్టు, జుడిషియల్ సర్వీసెస్, జిల్లా కోర్టులకు సంబంధించిన అంశాలు, వాతావరణం-కాలుష్యం, లోకాయుక్త- ఉపలోకాయుక్త, లీగల్ సర్వీసెస్ అథారిటీ, వినియోగదారుల చట్టం, ఆర్బిట్రేషన్ తదితర అంశాలను విచారిస్తుంది. రెండో ధర్మాసనం అన్ని క్రిమినల్ అప్పీళ్లు, కన్ఫర్మేషన్స్, భూసేకరణ, సిటీ సివిల్ కోర్టు అప్పీళ్లు, సివిల్ రివిజన్ పిటిషన్లు తదితర అంశాలను విచారిస్తుంది. మూడో ధర్మాసనం ఆదాయం పన్ను ట్రిబ్యునల్ అప్పీళ్లు, కేసులు, గిఫ్ట్, సెంట్రల్ ఎక్సైజ్, సంపద పన్ను, మనీలాండరింగ్ అప్పీళ్లు తదితర అంశాలను విచారిస్తుంది.

న్యాయమూర్తులకు జిల్లా పాలనాపరమైన అంశాల బాధ్యతలు

రాష్ట్రంలోని ఆయా ఉమ్మడి జిల్లాలకు సంబంధించి పాలనాపరమైన అంశాలను పరిశీలించే బాధ్యతలను హైకోర్టు న్యాయమూర్తులకు కేటాయించారు. వీరిని అడ్మినిస్ట్రేటివ్ జడ్జీలుగా వ్యవహరిస్తారు. జిల్లాలవారీగా ఈ బాధ్యతలను నిర్వహించే న్యాయమూర్తుల వివరాలు: జస్టిస్ ఆర్‌ఎస్ చౌహాన్- హైదరాబాద్ బాధ్యతలు, జస్టిస్ వీ రామసుబ్రమణియన్- రంగారెడ్డి బాధ్యతలు, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్- వరంగల్, జస్టిస్ ఎంఎస్ రామచంద్రారావు- కరీంనగర్, జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి- నల్లగొండ, జస్టిస్ నవీన్‌రావు- మహబూబ్‌నగర్, జస్టిస్ చల్లా కోదండరాం- ఖమ్మం, జస్టిస్ శివశంకర్‌రావు- మెదక్, జస్టిస్ షమీమ్ అక్తర్- ఆదిలాబాద్, జస్టిస్ పీ కేశవరావు- నిజామాబాద్.

జుడిషియల్ ఉద్యోగులకు అంతర్రాష్ట్ర బదిలీలు

అంతర్రాష్ట్ర బదిలీలను కోరుతూ వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్న 47 మంది జుడిషియల్ ఉద్యోగులను వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీచేస్తూ ఉమ్మడి హైకోర్టు సోమవారం ఉత్తర్వులిచ్చింది. మరో ఇద్దరిని పరస్పర అంగీకారంతో బదిలీచేసింది. తెలంగాణలోని వివిధ జిల్లా కోర్టులు, యూనిట్లలో పనిచేస్తున్న 29 మంది ఉద్యోగులు ఏపీకి బదిలీ కాగా.. ఏపీలోని వివిధ జిల్లా కోర్టులు, యూనిట్లలోని 18 మంది తెలంగాణకు బదిలీ అయ్యారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

తెలంగాణ, ఏపీలోని వివిధ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో కాంట్రాక్ పద్ధతిలో నియామకమైన హెడ్ క్లర్కులు, స్టెనోగ్రాఫర్లు, జూనియర్ అసిస్టెంట్- టైపిస్టులు, అటెండర్లను క్రమబద్ధీకరిస్తూ ఉమ్మడి హైకోర్టు సోమవారం ఉత్తర్వులిచ్చింది.

న్యాయమూర్తులవారీగా అంశాలు

జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్: రెవెన్యూ, అర్బన్ లాండ్ సీలింగ్, భూసంస్కరణ కేసులు, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి, స్టాంపులు- రిజిస్ట్రేషన్లు, ఆర్టీఐ, నీటి పారుదల- ఆయకట్టు ప్రాంత అభివృద్ధి, హౌసింగ్ తదితర అంశాలు

జస్టిస్ ఎంఎస్ రామచంద్రారావు: సివిల్ రివిజన్ పిటిషన్లు, మోటర్ యాక్సిడెంట్, అన్ని సివిల్ అంశాలు

జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి: మోటర్ యాక్సిడెంట్ సివిల్ అప్పీళ్లు, 2005, 2010 సంవత్సరాలకు సంబంధించిన కేసులు

జస్టిస్ పీ నవీన్‌రావు: నాన్ సర్వీస్ రిట్ పిటిషన్లు, హోం, సహకారసంఘాలు, విద్య, యూనివర్సిటీలు, కేంద్ర ప్రభుత్వ శాఖలు- కార్పొరేషన్లు, రాష్ట్ర కార్పొరేషన్లు, ఖాదీ, వక్ఫ్ బోర్డులు, ఫ్యాక్టరీలు- లేబర్ అంశాలు, సామాజిక సంక్షేమం- గిరిజన సంక్షేమం, బీసీ- మైనార్టీ సంక్షేమం, ఆరోగ్యం- వైద్యం- కుటుంబసంక్షేమం, ఉద్యోగ కల్పన- శిక్షణ- యువజన, క్రీడల అంశాలు, మహిళా- శిశు అంశాలు.

జస్టిస్ చల్లా కోదండరాం: మున్సిపాల్టీలు- పట్టణాభివృద్ధి, భూసేకరణ, పౌరసరఫరాలు- నిత్యావసరాలు, ఆహారం- వ్యవసాయం- మార్కెట్ కమిటీలు, గనులు- పరిశ్రమలు- వాణిజ్యం, రవాణా- రోడ్లు- భవనాలు, దేవాదాయం, ఎక్సైజ్, సాధారణ పరిపాలన, న్యా యం- లెజిస్లేటివ్ శాఖలు, ఆర్థిక- ప్రణాళికలు, అడవులు- ఫిషరీస్- పశుసంవర్ధక- విద్యుత్- పర్యావరణ- శాస్త్ర సాంకేతికత అంశాలు

జస్టిస్ బీ శివశంకర్‌రావు: క్రిమినల్ రివిజన్స్, క్రిమినల్ పిటిషన్లు, నాన్ సర్వీస్ రిట్ పిటిషన్లు, సెకండ్ అప్పీళ్లు

జస్టిస్ షమీమ్ అక్తర్: బెయిల్ పిటిషన్లు, క్రిమినల్ అప్పీళ్లు, ఫస్ట్ అప్పీళ్లు, సిటీ సివిల్ అప్పీళ్లు

జస్టిస్ కేశవరావు: మోటర్ యాక్సిడెంట్ సివిల్ అంశాలు, 2011 నుంచి 2013 వరకు ఉన్న కేసులు

జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి: సర్వీస్ రిట్ పిటిషన్లు, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ నుంచి వచ్చే రిట్ పిటిషన్లు

జస్టిస్ టీ అమర్‌నాథ్‌గౌడ్: మోటర్ యాక్సిడెంట్ సివిల్ తదితర అప్పీళ్లు, 2014, 2015 సంవత్సరాల కేసులు



మంగళవారం భువనగిరిలో పాస్‌పోర్టు సేవాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బూర నర్సయ్యగౌడ్. చిత్రంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పాస్‌పోర్టు పొందటం

ఇక సులువు

- భువనగిరిలో సేవా కేంద్రం ప్రారంభించిన ఎంపీ బూర నర్సయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: పాస్‌పోర్టు పొందటం ఇప్పుడు మరింత సులువని భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. భువనగిరి పోస్టాఫీసులో మంగళవారం పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్ తదితరులతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాస్‌పోర్టు సేవలను స్థానికులకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రతి రోజూ 40 దరఖాస్తులను మాత్రమే తీసుకుంటారని, తర్వాత డిమాండ్‌ను బట్టి ఆ పరిమితిని 80, 100 వరకు పెంచేందుకు కృషి చేస్తానని ఎంపీ బూర వివరించారు. భువనగిరిలో పాస్‌పోర్టు కార్యాలయ భవనం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఎంబీకి కలెక్టర్ స్థలం చూపిస్తే రాబోయే బడ్జెట్‌లో నిధులొచ్చేలా చొరువ తీసుకుంటానని వేదికపైనే ప్రకటించారు. యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయ నిర్మాణం పూర్తయితే ప్రతి రోజూ లక్షల్లో భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు. అనంతరం భువనగిరి పాసుపోర్టు సేవా కేంద్రం ఆధ్వర్యంలో మొదటి పాసుపోర్టును పోస్టల్ డిపార్టుమెంట్‌కు చెందిన ఉద్యోగి వేణుగోపాల్‌రెడ్డికి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అందించారు. రీజనల్ పాసుపోర్టు ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ఆకాశ్ దీప్ చక్రవర్తి, చీఫ్ పోస్టుమార్షల్ బ్రిగేడియర్ చంద్రశేఖర్, రీజనల్ పాసుపోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఆర్డీవో ఎం.వి.భూపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్-చైనా కవాతు




అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లా బుమ్లాలో సముద్రమట్టానికి 15వేల అడుగుల ఎత్తులో కదం తొక్కుతున్న భారత్, చైనా సైనిక దళాలు. ఉభయ దేశాల సైన్యాలు మంచు పర్వతాల మధ్య రక్తం గడ్డకట్టే చలిలో మంగళవారం కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నాయి. పరస్పరం అభినందనలు తెలుపుకున్న సైనికులు వాస్తవాధీన రేఖ వెంట శాంతి, సామరస్యాలను కాపాడేందుకు పునరంకితం కావాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశాయి. భారత దళాలకు కర్నల్ ప్రసన్‌జిత్ కరంద్, చైనా సైనికులకు కర్నల్ హుటాంగ్‌షెంగ్ నేతృత్వం వహించారు.

కేంద్ర ఉద్యోగులకు కొత్త ఏడాది కానుక

దాదాపు 4వేల మందికి పదోన్నతి

న్యూఢిల్లీ: నూతన సంవత్సరం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కార్ తీపి కబురు అందించింది. దాదాపు 4వేల మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పించింది. ఇందులో 1,756 మంది సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసు వాళ్లు కాగా.. 2,235 మంది సెంట్రల్ సెక్రటేరియట్ స్టెనోగ్రాఫర్ సర్వీసు వాళ్లు. పదోన్నతి కోసం వీరంతా దాదాపు 10 నుంచి 15 ఏండ్లుగా ఎదురుచూస్తున్నారు. శాఖాపరమైన సమస్యలు, పదోన్నతుల్లో ఇబ్బందులు తదితర కారణాలతో ప్రమోషన్లు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో వీరికి కొత్త ఏడాది కానుకగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయించిన కేంద్రం ఆ మేరకు చర్యలు తీసుకుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ 'పదోన్నతి పొందకుండానే చాలా మంది రిటైర్ అవుతున్నారు. ఈ పరిస్థితి చూస్తుంటే చాలా బాధగా ఉండేది. ప్రస్తుతం దాదాపు 4వేల మందికి పదోన్నతి లభించినందుకు ఆత్మ సంతృప్తి కలుగుతున్నది' అని చెప్పారు. డిసెంబర్ 31లోగా వీరికి ప్రమోషన్లు కల్పించడానికి తన శాఖ అధికారులు చాలా కష్టపడ్డారని, వారందరినీ అభినందిస్తున్నానని తెలిపారు.



అలహాబాద్ పేరు మార్పునకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 1: కుంభమేళా ప్రారంభం కావడానికి 15 రోజుల ముందు ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ నగరం పేరును 'ప్రయాగ్‌రాజ్'గా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. రెండు నెలల క్రితమే యూపీ ప్రభుత్వం అలహాబాద్ పేరును చరిత్రాత్మక 'ప్రయాగ్‌రాజ్'గా మార్చింది. తమ ప్రతిపాదనను ఆమోదించాలని కోరుతూ పది రోజుల క్రితం కేంద్ర హోంశాఖను యూపీ సర్కార్ కోరింది. దీనికి కేంద్రం ఆమోదం తెలిపింది ఈ నెల 15న మకర సంక్రాంతి రోజున ప్రయాగ్‌రాజ్‌లో మొదలయ్యే కుంభమేళా మార్చి నాలుగో తేదీన మహా శివరాత్రితో ముగుస్తుంది.

పొంచి ఉన్న సంక్లిష్టమైన భద్రతా సవాళ్లు

సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ వెల్లడి



న్యూఢిల్లీ: సరిహద్దుల్లో భారత్ సంక్లిష్టమైన భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నదని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ ఆందోళన వ్యక్తం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా సైనిక జవాన్లకు లేఖ రాసిన రావత్.. దేశ ప్రాదేశిక సమగ్రతకు, అంతర్గత స్థిరత్వానికి ముప్పు పొంచి ఉన్నదన్నారు. చైనాతో 4,000 కి.మీ పొడవునా, జమ్ముకశ్మీర్‌లో ఎల్వోసీ పరిధిలో ఈ పరిస్థితి ఎక్కడ ఉందో వివరించలేదు. అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తూ దేశ ప్రాదేశిక సమగ్రత పరిరక్షణకు సైన్యం కృషి చేస్తున్నదన్నారు. గతేడాది డోక్లాం ఘటన తర్వాత సరిహద్దుల్లో సైన్యం మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నదన్నారు.

విరిగిపడ్డ కొండ చరియలు

15 మంది మృతి, 20 మంది గల్లంతు ■ ఇండోనేషియాలో ఘటన



జకార్తా, జనవరి 1: ఇండోనేషియాలోని జావా దీవిలో సుకబుమి జిల్లా సిర్నారేష్మి గ్రామంపై విరిగి పడిన కొండ చరియల శిథిలాల కింద నుంచి మంగళవారం మరో ఆరు మృతదేహాలను వెలికితీశారు. దీంతో ఈ ఘటనలో మరణించిన వారి సంఖ్య 15కి చేరుకున్నదని అధికారులు తెలిపారు. 20 మంది వ్యక్తుల ఆచూకీ గల్లంతైంది. సోమవారం సాయంత్రం కొండ చరియలు విరిగి పడటంతో గ్రామంలోని 30 ఇండ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. వందల మంది పోలీసులు, సైనికులు, స్థానికులు కలిసి శిథిలాలను తొలగింపునకు పూనుకున్నారు.

మాంచెస్టర్‌లో యువకుడి దాడి

ముగ్గురికి గాయాలు


లండన్: బ్రిటన్‌లోని మాంచెస్టర్ నగర రైల్వే స్టేషన్ వద్ద నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నప్పుడు ఒక దుండగుడు సోమవారం ఒక పోలీసు అధికారితోపాటు ముగ్గురు వ్యక్తులపై కత్తితో దాడి చేశాడు. దీంతో వారు గాయపడ్డారని, కానీ వారి ప్రాణాలకు ముప్పు లేదని పోలీసులు తెలిపారు. అనుమానితుడ్ని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసును కౌంటర్ టెర్రరిజం పోలీసులు దర్యాప్తు చేస్తారని బ్రిటిష్ ట్రాన్స్‌పోర్ట్ పోలీస్ (బీటీపీ) తెలిపింది.

దళితులపై కేసులను పరిశీలిస్తాం

మాయావతి డిమాండ్‌పై రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ వ్యాఖ్య

జైపూర్, జనవరి 1: దళిత కార్యకర్తలకు వ్యతిరేకంగా నమోదైన అన్ని కేసులను తమ ప్రభుత్వం పరిశీలిస్తుందని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిరోధక చట్టాన్ని నీరుగారుస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా గతేడాది ఏప్రిల్ 2న భారత్ బంద్ జరిగింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆందోళనకు దిగిన దళిత కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను ఎత్తివేయకుంటే మద్దతు ఉపసంహరించుకుంటానని బీఎస్పీ అధినేత్రి మాయావతి రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలను హెచ్చరించారు. దీనిపై గెహ్లాట్ మీడియాతో మాట్లాడుతూ మాయావతి డిమాండ్‌ను తమ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నదన్న సంకేతమిచ్చారు.

బాలీవుడ్ దిగ్గజం ఖాదర్‌ఖాన్ కన్నుమూత



- దీర్ఘకాల అస్వస్థతతో కెనడాలో తుదిశ్వాస
- సంతాపం వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని, అమితాబ్, గోవింద తదితరులు
- నటనతోపాటు సినీ రచనా రంగంలోనూ బలమైన ముద్ర
- అనేక హిట్‌చిత్రాలకు స్క్రీన్‌ప్లే, మాటలు
- అమితాబ్ కెరీర్‌లో మైలురాళ్లగా నిలిచిన పలు సినిమాలకు కథ, మాటలు

టొరంటో/ముంబై, జనవరి 1: అటు నటనారంగం, ఇటు సాహితీ ప్రపంచంలో సమానస్థాయిలో రాణించిన అరుదైన బాలీవుడ్ నటుడు ఖాదర్‌ఖాన్ సోమవారం సాయంత్రం కెనడాలోని టొరంటో నగరంలో కన్నుమూశారు. ఆయన వయస్సు 81 సంవత్సరాలు. ఎనభై-90 దశకాల్లో కమర్షియల్ సినిమాపై తనదైన ముద్ర వేసిన ఖాదర్‌ఖాన్ అనారోగ్యంతో దాదాపు 17 వారాలుగా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు సర్ఫరాజ్, షానవాజ్ ఉన్నారు. 'మా నాన్న మమ్మల్ని వదిలి వెళ్లిపోయారు. దీర్ఘకాల అస్వస్థత అనంతరం కెనడా కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు' అని సర్ఫరాజ్ వెల్లడించారు. తమ కుటుంబమంతా కెనడాలోనే స్థిరపడిందని, అందువల్ల తమ తండ్రి అంత్యక్రియలు కూడా ఇక్కడే నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఖాదర్‌ఖాన్ మృతి పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు రాజకీయ, సినీరంగ ప్రముఖులు సంతాపం తెలిపారు. 'కమెడియన్‌గా, విలన్‌గా ఆయన పోషించిన పాత్రలు, ఆయన కలం నుంచి వెలువడిన పలు హిట్ చిత్రాల కథలు చిరకాలం గుర్తుంటాయి. ఆయన కుటుంబానికి, స్నేహితులకు, అభిమానులకు మా సంతాపం' అని రాష్ట్రపతి కార్యాలయం ట్వీట్ చేసింది. 'ఖాదర్‌ఖాన్‌జీ తన అద్భుతమైన నటనా కౌశలంతో వెండితెరకు మెరుపులద్దారు. ఆయన హాస్యచతురతకు ధన్యవాదాలు. ఆయన సక్సెస్‌ఫుల్ సినీ రచయిత, అనేక చిరస్మరణీయ సినిమాలలో పనిచేశారు. ఆయన కుటుంబానికి మా సంతాపం' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ముంబైలోని ఖాదర్‌ఖాన్ సహచరులు, హిందీ చిత్ర పరిశ్రమకు చెందిన శ్రేయోభిలాషులు ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

తీరనిలోటు

'ఖాదర్‌ఖాన్ మరణవార్త ఎంతో విచారకరం. ఆయన అద్భుతమైన రంగస్థల నటుడు, ఎన్నో విజయవంతమైన నా చిత్రాలకు రైటర్‌గా పనిచేశారు. ఆయనతో కలిసి పనిచేయడం ఆనందదాయకం' అని అమితాబ్ నివాళులర్పించారు. ఖాదర్‌ఖాన్ తన తండ్రివంటి వారని మరో నటుడు గోవిందా పేర్కొన్నారు. గోవిందా నటించిన 'షోలా ఔర్ షబ్నం', 'కూలీ నం.1' చిత్రాలకు కథ, మాటలు ఖాదరఖాన్ అందించారు. 'హీరో నం.1'లో ఆయన గోవిందాకు తండ్రిగా నటించారు. 'ఖాదర్‌ఖాన్ నాకు ఉస్తాద్ (గురువు) మాత్రమే కాదు, తండ్రి వంటివారు. ఆయన మరణం నా కుటుంబానికి కూడా తీరని లోటు. ఈ బాధ మాటలలో చెప్పలేనిది' అని గోవిందా పేర్కొన్నారు. 'ఖాదర్ భాయ్ ఖాన్ సాబ్! మా కపూర్లకు మీతో దీర్ఘకాల అనుబంధం ఉంది. మీతో కలిసి పనిచేయడం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నాము. మీకు స్వర్గం ప్రాప్తించును గాక' అని రిషీకపూర్ నివాళులర్పించారు. ప్రేమ్ చోప్రా, ఫరీదా జలాల్, అక్షయ్‌కుమార్, అనిల్‌కపూర్, అజయ్‌దేవగన్ తదితరులు ఖాన్ మృతిపట్ల తమ సంతాపం వ్యక్తం చేశారు.

డైలాగ్ కింగ్



గోవిందాతో ఖాదర్‌ఖాన్

ఆఫ్ఘనిస్థాన్‌లోని కాబూల్‌లో 1937లో జన్మించిన ఖాదర్‌ఖాన్ సినిమాల్లోకి రాకముందు ముంబైలోని ఓ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన తండ్రి ఆఫ్ఘన్‌కు చెందినవారు కాగా, తల్లి పిశిన్ (పాకిస్థాన్‌లోని బెలుచిస్థాన్)కు చెందినవారు. ఖాన్ విద్యాభ్యాసమంతా భారత్‌లోనే సాగింది. ఓ కళాశాల వార్షికోత్సవానికి అతిథిగా హాజరైన బాలీవుడ్ దిగ్గజం దిలీప్‌కుమార్ అక్కడ జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో ఖాదర్‌ఖాన్ నట ప్రావీణ్యాన్ని గుర్తించారు. అయితే ఖాన్ 1972లో జయ భాదురీ-రణధీర్‌కపూర్ నటించిన 'జవానీ దివానీ' చిత్రానికి మాటల రచయితగా బాలీవుడ్‌లో ప్రవేశించారు. ఆ మరుసటి సంవత్సమే యశ్‌చోప్రా రూపొందించిన 'దాగ్' సినిమాతో తెరంగేట్రం చేసిన ఖాదర్‌ఖాన్ 300కుపైగా చిత్రాల్లో నటించారు. 250కి పైగా సినిమాలకు స్క్రీన్‌ప్లే, మాటలు రాశారు. ధరమ్‌వీర్, దేశ్ ప్రేమీ, సుహాగ్, పర్వరిష్ వంటి ఆల్‌టైమ్ హిట్ చిత్రాలకు మాటలనందించారు. ఆయన రాసిన డైలాగులకు థియేటర్లలో ఈలలు వినిపించేవి. ముజ్‌సే షాదీ కరోగీ, అఖియోసే గోలీ మారే, జోరూకా గులామ్, హసీనా మాన్‌జాయేగీ, ఆంటీ నం.1, జుడ్వా, ఆంఖే వంటి ప్రజాదరణ పొందిన చిత్రాల్లో కమెడియన్‌గా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఖాన్ తనదైన ముద్ర వేశారు. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ సినీ జీవితం ఉచ్ఛస్థితికి చేరడం వెనుక ఖాదర్‌ఖాన్ కీలక పాత్ర పోషించారు. అమితాబ్ నటించిన సూపర్‌హిట్ చిత్రాలైన కూలీ, అమర్ అక్బర్ ఆంథోనీ, షరాబీ, లావారిస్, ముకద్దర్ కా సికందర్ తదితర చిత్రాలకు కథ, మాటలు అందించింది ఖాదర్‌ఖానే. రెండు సినిమాలకు ఉత్తమ సంభాషణల రచయితగా, ఒక సినిమాకు ఉత్తమ కమెడియన్‌గా ఖాదర్‌ఖాన్ ఫిలింఫేర్ అవార్డులను గెలుచుకున్నారు

ఆసరా అర్హులు ఎనిమిది లక్షలు!

- లబ్ధిదారుల వయస్సు తగ్గింపుపై అధికారుల కసరత్తు
- జాబితాలను సిద్ధం చేస్తున్న కలెక్టర్లు
- మూడు, నాలుగు జిల్లాల నుంచి అందిన జాబితాలు
- వారంరోజుల్లో అన్ని జిల్లాల జాబితాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆసరా పింఛన్లకు లబ్ధిదారుల అర్హత వయసు తగ్గింపుపై సర్కారు కసరత్తును వేగం చేసింది. వారంరోజుల్లో అర్హుల జాబితాను రూపొందించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి లబ్ధిదారుల జాబితాను మీ-సేవకు అప్పగించాలని ఇప్పటికే కలెక్టర్లను ఆదేశించారు. మూడు, నాలుగు జిల్లాల నుంచి జాబితాలు అందినట్టు అధికారులు చెప్తున్నారు. వారంరోజుల్లో అన్ని జిల్లాల జాబితా అందే అవకాశం ఉన్నది. ఆసరా పెన్షన్లకు లబ్ధిదారుల అర్హత వయసును 60 ఏండ్ల నుంచి 57కు తగ్గిస్తామని ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ హామీఇచ్చారు. ప్రస్తుతం ఇస్తున్న మొత్తానికి వంద శాతం పెంచి ఇస్తామని ప్రకటించారు. పెన్షన్‌దారులు ఎంతమంది ఉన్నారు? ఎంత మొత్తం నిధులు అవసరం అవుతాయి? అనే విషయాలను అంచనా వేసి, దాని ఆధారంగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు పొందుపరచాల్సి ఉంటుందని ఇప్పటికే కలెక్టర్లకు సీఎస్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం 39,52,410 మంది పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధాప్య పింఛన్ల కింద ఒక్కొక్కరికి నెలకు రూ.1,000 ఇస్తుండగా, వచ్చే ఏప్రిల్ నుంచి రూ.2,016, వికలాంగులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1,500 ను రూ.3016 కు పెంచుతున్నారు.

ఓటర్ల జాబితా ఆధారంగా..

ఓటర్ జాబితాలో పేర్కొన్న వయసువారీగా ఆసరా పెన్షన్‌దారుల జాబితా రూపొందించనున్నారు. ఓటర్ల జాబితా నుంచి 57 ఏండ్ల పైబడినవారి పేర్లు తీసుకొని సిద్ధంచేసిన జాబితాను గ్రామసభల్లో ప్రదర్శించాలని, అక్కడ ఆమోదం పొందిన తర్వాత జాబితాను మీ-సేవకు అప్పగించాలని కలెక్టర్లకు సీఎస్ జోషి ఇప్పటికే స్పష్టంచేశారు. లబ్ధిదారుల వయస్సు తగ్గించిన నేపథ్యంలో మరో ఎనిమిది లక్షల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉన్నదని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.



సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో కంటిపరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు (ఫైల్)

కంటివెలుగు @ 1,17,61,939

సోమవారం 1,03,423 మందికి కంటి పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కంటివెలుగు కార్యక్రమం అప్రతిహతంగా కొనసాగుతున్నది. అంధత్వరహిత తెలంగాణ సాధన కోసం ఆగస్టు 15న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన నాటినుంచి సోమవారం వరకు 1,17,61,939 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18,78,868 మందికి కండ్లద్దాలను పంపిణీచేశారు. మరో 14,46,221 మందికి ప్రత్యేక అద్దాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. కాగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 1,03,423 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 8,352 మందికి అద్దాలను అందజేశారు. మరో 6,576 మందిని ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదించారు.



కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందిన వారి సంఖ్య

క్యాటగిరీ	సోమవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్న వారు	1,03,423	1,17,61,939
రీడింగ్ అద్దాలు పొందిన వారు	8,352	18,78,868
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	6,576	14,46,221
కంటి సమస్యలపై రెఫరల్	5,076	7,56,689
కంటి సమస్యలు లేనివారు	83,419	76,80,161



ఖమ్మంలో మంగళవారం ఉదయం చలిమంట వేసుకున్న ప్రజలు



పగటిపూట మంచు దుప్పటి కప్పేయడంతో ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి) గ్రామంలో నిర్మానుష్యంగా ఉన్న వీధులు

ఎముకలు కొరుకుతున్న చలి

- ఉత్తర, ఈశాన్య దిశలనుంచి వీస్తున్న శీతలగాలులు
- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 2.9 డిగ్రీలు
- ఆదిలాబాద్ అర్లి(టీ)లో 3.2, హైదరాబాద్‌లో 9గా నమోదు
- మరో నాలుగురోజులు ఇదే పరిస్థితి అంటున్న వాతావరణశాఖ

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో చలి గాలుల జోరు కొనసాగుతున్నది. డిసెంబర్ 26 నుంచి మొదలైన చలిగాలుల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నది. ఉత్తర, ఈశాన్య దిశ నుంచి వీస్తున్న గాలుల తీవ్రత ఆదివారం రాత్రి నుంచి మరింత పెరిగినట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో రికార్డుస్థాయిలో 2.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఇండ్లల్లో నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. సంగారెడ్డి జిల్లా అల్గోల్, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామంలో 3.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. సోమవారం పెన్‌గంగా పరీవాహక ప్రాంతమైన అర్లి(టీ)లో పదేండ్ల రికార్డును తిరగరాస్తూ 2.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే. అర్లి(టీ)లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వాతావరణ సమాచార యంత్రం ద్వారా జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వాతావరణ సూచిపై వివరాలు నమోదవుతున్నాయి. గ్రామంలో తీవ్రమైన చలి కారణంగా పగలు కూడా వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం అయిందంటే జనం చలిమంట వద్దే ఉంటున్నారు. వ్యవసాయ పనులకు ఇబ్బందిగా ఉన్నదని రైతులు వాపోతున్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెదారిలో 3.8, కామారెడ్డి జిల్లా భిక్కనూర్, రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ 4.2, ఆదిలాబాద్ జిల్లా బేల 4.3, వికారాబాద్ జిల్లా నాగారంలో 4.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాజధాని హైదరాబాద్‌లోనూ 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. దక్కన్ పీఠభూమిలో ఎత్తైన ప్రాంతాల్లో ఒకటైన మెదక్ జిల్లాపై ఉత్తర, ఈశాన్య దిశలనుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉన్నదని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి రాజారావు తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, సిద్దిపేట, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మరో నాలుగు రోజులపాటు చలిగాలులు జోరుగా వీచే అవకాశమున్నదని వెల్లడించారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సంగారెడ్డి	2.9	34.6
ఆదిలాబాద్	5.2	27.3
కుమ్రంభీం ఆసిఫాబాద్	5.2	27.3
మంచిర్యాల	5.2	27.3
వికారాబాద్	5.4	31.1
సిద్దిపేట	5.4	32.4
మెదక్	5.4	33.5
నాగర్‌కర్నూల్	6.5	34.6
మహబూబ్‌నగర్	6.6	34.6
జోగులాంబ గద్వాల	7.4	32.9
జనగామ	7.8	32.7
యాదాద్రి భువనగిరి	7.9	32.9
మహబూబాబాద్	7.9	35.4
కరీంనగర్	8.3	34.8
పెద్దపల్లి	9.0	28.6
మేడ్చల్	9.3	27.5
హైదరాబాద్	9.3	27.5
వరంగల్ అర్బన్	9.5	28.4
వరంగల్ రూరల్	10.0	31.0
కామారెడ్డి	10.0	31.0
జగిత్యాల	10.0	33.0
వనపర్తి	10.2	35.5
నిజామాబాద్	10.5	27.9
సూర్యాపేట	11.0	27.0
నిర్మల్	12.0	28.0
జయశంకర్ భూపాలపల్లి	13.0	27.0
భద్రాద్రి కొత్తగూడెం	13.0	28.0
రాజన్న సిరిసిల్ల	13.0	29.0
రంగారెడ్డి	13.0	29.0
ఖమ్మం	14.0	27.0
నల్లగొండ	15.0	27.0

రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవ వేతనంపై కసరత్తు

- రాష్ట్రవ్యాప్తంగా 1.61 లక్షల మంది సభ్యులు
- ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చవుతుందని అంచనా
- రాష్ట్ర రైతు సమితిలో వ్యవసాయ నిపుణుల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతు సమన్వయసమితి సభ్యులకు గౌరవ వేతనానికి సంబంధించిన ప్రక్రియపై రాష్ట్ర వ్యవసాయశాఖ కసరత్తు ప్రారంభించింది. రైతులు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్న రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవ వేతనం అందిస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఈమేరకు సభ్యుల వేతనం, వారి విధులు వంటి వాటిపై వ్యవసాయశాఖ అధికారులు దృష్టి సారించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు దక్కేలా చూడటం, మార్కెట్‌లో సమస్యలు రాకుండా సమన్వయపరచడం, రైతుబంధు, రైతుబీమా అమలుచేయడం తదితర అంశాల్లో సమితులు కీలకపాత్ర పోషించాలని సర్కారు స్పష్టంచేసింది. రానున్న రోజుల్లో పంటకాలనీలు, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటులోనూ వీరిని భాగస్వాములను చేసే అవకాశముంది.

ఐదు వేల వేతనం..

గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లోని రైతు సమన్వయ సమితుల్లో మొత్తం 1.61లక్షల మంది సభ్యులున్నారు. గ్రామస్థాయిలో 15 మంది, మండల, జిల్లాస్థాయిల్లో 24 మంది సభ్యులతో సమితులు ఏర్పడ్డాయి. రాష్ట్రస్థాయిలో 42 మందితో ఏర్పాటుచేయాల్సి ఉన్నది. వీరందరికీ ఈ ఏడాది నుంచి వారికి గౌరవ వేతనం ఇవ్వనున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వేతనాలు అందుతాయని వ్యవసాయశాఖవర్గాలు తెలిపాయి. గ్రామసమితి సభ్యులకు రూ.వెయ్యి, సమన్వయకర్తకు రూ.1500, మండల సమితి సభ్యునికి రూ.1500, సమన్వయకర్తకు రూ.2 వేలు ఇస్తే ఎలా ఉంటుందనేదానిపై కసరత్తు చేస్తున్నారు. జిల్లా సమితి సభ్యునికి రూ.2500, జిల్లా సమన్వయకర్తకు రూ.5వేలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు. రాష్ట్రస్థాయి సభ్యునికి రూ.5 వేలు, చైర్మన్‌కు క్యాబినెట్ హోదా ఇస్తున్నందున ఆ మేరకు జీతభత్యాలు ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ప్రభుత్వ పెద్దలతో చర్చించి వీటిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇందుకోసం ఏడాదికి దాదాపు రూ.200 కోట్లు అవసరమవుతాయి. అదే విధంగా మండల, జిల్లాల్లో కార్యాలయాలు, జిల్లా సమన్వయకర్తకు వాహన సౌకర్యం కల్పించే యోచన ఉన్నట్టు తెలిసింది. రైతులతోపాటు, కొందరు వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో కలిపి 42 మందితో రాష్ట్ర రైతు సమితిని నియమిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. కార్పొరేషన్ హోదా కలిగిన రాష్ట్ర రైతు సమన్వయ సమితి రూ.500 కోట్ల నిధిని కేటాయించనున్నారు.

పెట్రోల్, డీజిల్ కన్నా
విమానం ఇంధనం చౌక
తగ్గిన ధరలు.. రూ.58కే లీటరు

న్యూఢిల్లీ, జనవరి 1: విమానాల ఇంధనం ధరలు రికార్డు స్థాయిలో తగ్గాయి. మంగళవారం కిలో లీటరు ఇంధనం ధర రూ.9,990(14.7 శాతం) తగ్గి రూ.58,060.97కు చేరుకుంది. సరిగ్గా నెల కిందట డిసెంబర్ 1న కూడా ఇంధనం ధర కిలో లీటరుపై రూ.8,327.83 తగ్గింది. అంతర్జాతీయంగా ఇంధనం ధరలు పడిపోవడంతోనే ఈ ధరలు తగ్గుతున్నాయి. తాజా తగ్గుదలను పరిశీలిస్తే లీటరు పెట్రోల్, డీజిల్ ధర కన్నా విమానంలో వినియోగించే ఇంధనం చౌక. అంతేకాదు.. లీటరు కిరోసిన్ ధర కన్నా కాస్త ఎక్కువ. కిలో లీటరు(వెయ్యి లీటర్లు) ఇంధనానికి రూ.58,060.97 కాగా లీటరుకు లెక్కిస్తే రూ.58.06 అవుతుంది. ప్రస్తుతం ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.68.65. అదే లీటరు డీజిల్ ధర రూ.62.66. మార్కెట్‌లో లీటరు కిరోసిన్‌ను రూ.56.59కి (రేషన్ షాపులో అమ్మే కిరోసిన్ కాదు) అమ్ముతున్నారు. దీని బట్టి చూస్తే కిరోసిన్ కన్నా లీటరు విమాన ఇంధనం రూ.1.50 మాత్రమే ఎక్కువ.



మళ్లీ తగ్గిన పెట్రోల్, డీజిల్ ధరలు
పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ తగ్గాయి. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో మంగళవారం లీటరు పెట్రోల్‌పై 17పైసలు తగ్గింది. ఢిల్లీలో రూ.68.84 ఉన్న లీటరు పెట్రోల్ ధర రూ.68.65కు పడిపోయింది. అలాగే రూ.63.86 ఉన్న లీటరు డీజిల్ ధర రూ.62.66కు చేరుకుంది. ముంబైలో రూ.74.47 ఉన్న లీటరు పెట్రోల్ రూ.74.30కు పడిపోయింది. రూ.65.76 ఉన్న లీటర్ డీజిల్ ధర రూ.65.56కు చేరుకుంది. అంతర్జాతీయంగా ఇంధనం ధరలు పడిపోవడంతో పాటు డాలర్‌తో రూపాయి మారక విలువలో హెచ్చుతగ్గుల వల్ల ప్రస్తుతం ధరలు తగ్గుతున్నాయి.

'యస్ సర్'కు బదులు
జైహింద్ లేదా జై భారత్
పాఠశాలల్లో విద్యార్థుల హాజరీపై గుజరాత్ నిర్ణయం



అహ్మదాబాద్, జనవరి 1: గుజరాత్‌లో ఇకపై పాఠశాల విద్యార్థులు తాము పాఠశాలకు హాజరైనట్లు చెప్పడానికి 'యస్ సర్', 'యస్ మేడం' అని పలుకొద్దు. 'జైహింద్', 'జై భారత్' అని చెప్పాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆ రాష్ట్ర విద్యాశాఖ రాష్ట్రంలోని పాఠశాలలకు సర్క్యులర్ జారీ చేసింది. హాజరు పలికేటప్పుడు 'జైహింద్', 'జై భారత్' అని విద్యార్థులు చెప్పడం తప్పనిసరని ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. ఈ మేరకు సోమవారం సదరు సర్క్యులర్ జారీ అయింది. చిన్నప్పటి నుంచి బాలల్లో దేశభక్తిని ప్రోత్సహించటానికే ఈ చర్యలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి భూపేంద్రసిన్హ్ చుడాసమా మాట్లాడుతూ మంగళవారం నుంచి ఈ నిర్ణయం అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, గ్రాంట్ ఇన్ ఎయిడ్, సెల్ఫ్ ఫైనాన్స్ స్కూళ్లలో ఈ ఆదేశాల అమలు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓ) చర్యలు చేపట్టారు.

సమాచార ప్రధాన కమిషనర్‌గా
సుధీర్ భార్గవ ప్రమాణం
నలుగురు కమిషనర్లతో ప్రమాణం చేయించిన సుధీర్



న్యూఢిల్లీ, జనవరి 1: కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ప్రధాన కమిషనర్‌గా సుధీర్ భార్గవతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించారు. ఆ తర్వాత సమాచార కమిషనర్లుగా నియమితులైన వనజ ఎన్ శర్న, యశ్వర్ధన్ కుమార్ సిన్హా, నీరజ్‌కుమార్ గుప్తా, సురేష్ చంద్రలతో సీఐసీ ప్రధాన కమిషనర్ సుధీర్ భార్గవ.. సమాచార కమిషన్ ప్రధాన కార్యాలయంలో ప్రమాణం చేయించారు. ప్రధాన సమాచార కమిషనర్‌తోపాటు సమాచార కమిషన్‌లో 11 మంది కమిషనర్లకు అవకాశం ఉండగా, ఇంకా నాలుగు కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

'సుప్రీం' తీర్పు తరువాతే ఆర్డినెన్స్

- రామాలయ నిర్మాణంపై ప్రధాని మోదీ
- ఒక్క యుద్ధంతో పాక్ తీరు మారదు
- వ్యక్తిగత కారణాలతోనే ఉర్జిత్‌పటేల్ నిష్క్రమణ
- ఏఎన్ఐ ఇంటర్వ్యూలో ప్రధాని వివరణ
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కాంగ్రెస్
- రామాలయాన్ని ఇప్పుడే నిర్మించాలి: ఆరెస్సెస్

న్యూఢిల్లీ, జనవరి 1: అయోధ్యలోని వివాదాస్పద స్థలం విషయమై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తరువాతనే అక్కడ రామాలయం నిర్మాణంపై ఆర్డినెన్స్ జారీ చేసే విషయాన్ని పరిశీలిస్తామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏఎన్ఐ వార్తాసంస్థకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన ప్రధాని మోదీ అనేక అంశాలపై మాట్లాడారు. 'అయోధ్య విషయమై ముందుగా న్యాయ ప్రక్రియ పూర్తి కావాలి. ఆ తరువాత ప్రభుత్వంగా మా బాధ్యతను నిర్వర్తిస్తాం. ఈ సమస్యకు రాజ్యాంగం పరిధిలోనే ఒక పరిష్కారాన్ని కనుగొంటామని బీజేపీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నాం' అని మోదీ గుర్తు చేశారు. న్యాయ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ఆలస్యం చేస్తున్నదని ఆరోపించారు. 'దేశంలో శాంతి, సౌభ్రాతృత్వాలను దృష్టిలో పెట్టుకొని అయోధ్య విషయంలో ఆటంకాలు సృష్టించకుండా కాంగ్రెస్ పార్టీ తమ న్యాయవాదులను నిరోధించాలి' అని ఆయన సూచించారు. రామాలయాన్ని నిర్మించడం ఎన్డీయే అజెండా కాదని, అది కేవలం బీజేపీ అజెండా మాత్రమేనని బీహార్‌లోని బీజేపీ మిత్రపక్షాలు కొద్దిరోజుల క్రితం ఆ పార్టీకి గుర్తుచేసిన నేపథ్యంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బీహార్ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, రామమందిరం అంశం కోర్టు ద్వారా పరిష్కారం కావాలని అభిప్రాయపడుతున్నామని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పేర్కొనగా.. రామాలయ అంశానికి అధిక ప్రాధాన్యమివ్వడం వల్లనే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బలు తగిలాయని, ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను రామాలయ అంశం డామినేట్ చేసిందని లోక్ జనశక్తి పార్టీ (ఎల్జేపీ) అధినేత రాంవిలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ విమర్శించిన విషయం తెలిసిందే.

ఫెడరల్ ఫ్రంట్ గురించి తెలియదు..

కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలతో జాతీయస్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేస్తున్న ప్రయత్నాల గురించి తనకు తెలియదని మోదీ చెప్పారు. ప్రధాని ఆదేశాల మేరకే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న ఆరోపణలకు స్పందిస్తూ మోదీ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. కేసీఆర్‌పై చంద్రబాబు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, తెలంగాణపై చంద్రబాబు విద్వేషాన్ని పెంచుకోవడమే ఇందుకు కారణమని అన్నారు. చంద్రబాబు అండ్‌కో ఏర్పాటుచేస్తున్న మహాకూటమికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం లేదన్నారు. 'ఇటువంటి రాజకీయాలను ప్రజలు తప్పక తిరస్కరిస్తారు. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమికి ఎదురైన పరాభవమేమిటో అందరికీ తెలుసు. కనుక మహాకూటమి గురించి మాట్లాడటంలో అర్థంలేదు. ఆ కూటమిలోని వారంతా తమ వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడుకొనేందుకే ఒక్కటయ్యారు' అని మోదీ విమర్శించారు.



ఒక్క యుద్ధంతో పాక్ తీరు మారదు
ఈ ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు వీలుగా మహాకూటమిని ఏర్పాటుచేసేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు, ఎన్డీఏలో లుకలుకలు, రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గవర్నర్ పదవికి ఉర్జిత్‌పటేల్ రాజీనామా చేయడం, పెద్దనోట్ల రద్దు, మూకదాడులు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమితోపాటు పలు ఇతర అంశాలపై ఈ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు మోదీ సమాధానమిచ్చారు. ఉగ్రవాదానికి ఊతమివ్వకుండా పాకిస్థాన్‌ను నిరోధించడంలో లక్షిత దాడులు (సర్జికల్ స్ట్రైక్స్) విఫలమయ్యాయన్న విమర్శలపై ప్రధాని స్పందిస్తూ.. కేవలం 'ఒక్క యుద్ధం'తో పాకిస్తాన్ తన తీరును మార్చుకొంటుందని భావించడం 'పెద్ద పొరపాటే'నన్నారు. ఒక్క యుద్ధంతో పాక్ మెరుగుపడదని, అందుకు ఆ దేశం మరికొంత సమయాన్ని తీసుకొంటుందని పేర్కొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకు, బీజేపీ వ్యతిరేక కూటమికి మధ్యే పోటీ
ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకు, బీజేపీ వ్యతిరేక కూటమికి మధ్యే పోటీ ఉంటుందని ఆయన అన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో తాము ఓటర్ల విశ్వాసాన్ని పొందగలమని మోదీ ధీమా వ్యక్తంచేశారు. వాస్తవానికి తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ఎవరూ అంచనా వేయలేదని, ఛత్తీస్‌గఢ్ ఫలితాలు నిర్ణాయకమైనవే అయినప్పటికీ మిగిలిన రెండు రాష్ట్రాల్లో ప్రజలు హంగ్ అసెంబ్లీవైపు మొగ్గుచూపారని పేర్కొన్నారు. తమది రైతు వ్యతిరేక ప్రభుత్వమని విపక్షాలు చేస్తున్న ఆరోపణలను మోదీ తోసిపుచ్చుతూ.. చాలా తక్కువ మంది రైతులు మాత్రమే బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొంటున్నారని చెప్పారు. ఎక్కువ మంది రైతులు వడ్డీ వ్యాపారుల నుంచే రుణాలను తీసుకొంటున్నారని, దీంతో ప్రభుత్వాలు వ్యవసాయ రుణాల మాఫీ ప్రకటనలు చేసినప్పటికీ చాలామంది రైతులు లబ్ధిదారులు కాలేకపోతున్నారని వివరించారు. ఆర్బీఐ గవర్నర్ పదవి నుంచి ఉర్జిత్‌పటేల్‌ను బలవంతంగా సాగనంపినట్టు వస్తున్న ఆరోపణలను కూడా మోదీ ఖండించారు. వ్యక్తిగత కారణాల రీత్యా ఈ పదవి నుంచి విముక్తి కల్పించాల్సిందిగా ఉర్జిత్‌పటేల్ ఆరేడు నెలల నుంచే కోరారని, ఈ విషయమై ఆయన లిఖితపూర్వకంగా కూడా విజ్ఞప్తి చేశారని చెప్పారు.

పొంతనలేని మాటలు: కాంగ్రెస్

ప్రధాని ఇంటర్వ్యూపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. మోదీ చెప్తున్న మాటలకు, క్షేత్రస్థాయిలోని వాస్తవాలకు మధ్య ఏమాత్రం పొంతనలేదని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, గబ్బర్ సింగ్ టాక్స్ (జీఎస్టీ), బ్యాంకు మోసాలు, నల్లధనం, రఫేల్ ఒప్పందంలో అవినీతి, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం తదితర సమస్యలతో దేశం సతమతమవుతున్నదని ఆయన పేర్కొనగా.. మోదీ ఇంటర్వ్యూ ఓ పేరడీలా ఉన్నదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఆనంద్‌శర్మ విమర్శించారు.

ప్రస్తుత హయాంలోనే మందిరం: ఆరెస్సెస్
ఈ ఇంటర్వ్యూలో మోదీ చేసిన వ్యాఖ్యలు రామాలయ నిర్మాణానికి సానుకూలంగా ఉన్నాయని ఆరెస్సెస్ స్వాగతించింది. పరస్పర సంప్రదింపుల ద్వారా లేదా చట్టాన్ని తీసుకురావడం ద్వారా రామాలయాన్ని నిర్మించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంటూ 1989లో బీజేపీ పాలంపూర్‌లో ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారని ఆరెస్సెస్ పేర్కొన్నది. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తామని చెప్పి 2014లో అధికారంలోకి వచ్చిన హామీని మోదీ ప్రభుత్వం ప్రస్తుత పదవీకాలంలోనే ఆ హామీని నెరవేర్చాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఆరెస్సెస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబోలే తెలిపారు.

రాముడి కంటే చట్టం పెద్దదా: శివసేన
మోదీ వ్యాఖ్యలపై శివసేన తీవ్రస్థాయిలో స్పందించింది. రాముడి కంటే చట్టం పెద్దదా? అని ఆ పార్టీ నాయకుడు సంజయ్‌రౌత్ ప్రశ్నించారు. అయోధ్య కేసుపై సుప్రీంకోర్టు ఈ నెల 4న విచారణ జరుపనున్న విషయం విదితమే.

అయోధ్యలో భక్తురాలిపై పూజారి లైంగికదాడి

అయోధ్య(యూపీ), జనవరి 1: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో ఉన్న ఓ ఆలయం ప్రధాన పూజారి భక్తురాలిపై పలుసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. వారణాసికి చెందిన ఓ మహిళ ఆధ్యాత్మిక పాఠాలు నేర్చుకోవడానికి పూజారి కృష్ణ కాంతాచార్య వద్దకు ఇటీవల వచ్చారు. ఆమెకు పాఠాలు బోధించిన ఆయన ఆలయ పరిసరాల్లోనే కొద్ది రోజులు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలుమార్లు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని భక్తురాలు పోలీసులకు ఫోన్ ద్వారా తెలుపడంతో మంగళవారం పూజారిని అరెస్టు చేశారు.

'బులంద్‌షహర్' నిందితుడి అరెస్ట్

- పోలీసు అధికారిపై దాడికి ఉపయోగించిన గొడ్డలి స్వాధీనం



పోలీసులతో నిందితుడు కల్వా

బులంద్‌షహర్(యూపీ), జనవరి 1: దాదాపు నెల కిందట ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో హింస చెలరేగినప్పుడు పోలీసు అధికారి సుబోద్ కుమార్‌సింగ్‌పై గొడ్డలితో దాడి చేసిన కల్వా అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మహావ్ గ్రామ సమీపంలో ఆవు కళేబరాలను గుర్తించిన కొందరు హింసాత్మక ఘటనలకు పాల్పడటంతో వారిని అదుపు చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్న క్రమంలో సుబోద్‌కుమార్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే 29 మందిని అరెస్టు చేసిన పోలీసులు తాజాగా కల్వాను అదుపులోకి తీసుకున్నారు. డిసెంబర్ 3న ఆందోళన సందర్భంగా రోడ్డును దిగ్బంధించడానికి కల్వా గొడ్డలితో ఓ చెట్టును నరుకుతుండగా సుబోద్‌కుమార్ అడ్డుకున్నారు. దీంతో కల్వా గొడ్డలితో సుబోద్‌కుమార్‌పై దాడి చేశాడు.

ఖైదీల వివరాలను పంచుకున్న భారత్, పాక్
పాకిస్థాన్ జైళ్లలో మగ్గుతున్న 537 మంది భారత ఖైదీలు

న్యూఢిల్లీ, జనవరి 1: మన దేశంలోని జైళ్లలో ఉన్న పాకిస్థాన్ ఖైదీల వివరాలను ఆ దేశానికి కేంద్రప్రభుత్వం అందజేసింది. అలాగే పాక్‌లోని జైళ్లలో ఉన్న భారతీయుల వివరాలను ఆ దేశం భారత్‌కు సమర్పించింది. భారత్‌లోని జైళ్లలో పాకిస్థాన్‌కు చెందిన 249 మంది ఖైదీలు, 98 మంది మత్స్యకారులు ఉండగా పాక్ జైళ్లలో 54 మంది భారతీయ ఖైదీలు, 483 మంది మత్స్యకారులు ఉన్నారు. 2008లో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రతి సంవత్సరం ఇరుదేశాలు జనవరి 1న, జూలై 1న రెండుసార్లు ఖైదీల వివరాలను ఇచ్చిపుచ్చుకుంటున్నాయి. మరోవైపు పాకిస్థాన్, భారత్ తమ అణ్వస్త్ర కేంద్రాల జాబితాను కూడా పరస్పరం అందజేసుకున్నాయి.

సాంకేతిక లోపంతో
సహాయ చర్యల్లో ఆటంకం
20వ రోజుకు చేరుకున్న మేఘాలయ-గని కార్మికుల అన్వేషణ



షిల్లాంగ్, జనవరి 1: మేఘాలయలోని బొగ్గు గనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులను రక్షించేందుకు చేపట్టిన సహాయ చర్యలకు సాంకేతిక లోపంతో ఆటంకం ఏర్పడింది. మంగళవారం విద్యుత్ మోటార్లలో సాంకేతిక లోపం తలెత్తింది. ఈ గనిలో సహాయ చర్యలు చేపట్టి మంగళవారానికి 20 రోజులైంది. భారత నౌకాదళ జవాన్లు, ఈతగాళ్లు, ఎన్‌ఆర్డీఎఫ్ సిబ్బంది సాయంతో గని లోపలకు వెళ్లారు. మరోవైపు జిల్లా అధికారులు సహాయ చర్యలు మరింత వేగవంతం చేయడానికి మూడో క్రేన్‌ను తీసుకొచ్చారు.

లింగ సమానత్వం కోసం..
మహిళా హారం

- కేరళలో 620 కి.మీ. పొడవున అతిపెద్ద 'ఉమెన్ వాల్'
- శబరిమలలో ప్రవేశం కోసం నినదించిన నారీలోకం
- కాలం చెల్లిన పురుషాధిక్య భావజాలం నుంచి బయటపడాలని పిలుపు




కొచ్చిలో మానవహారంగా నిలిచిన మహిళలు

తిరువనంతపురం: శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై కేరళ ప్రభుత్వానికి, అయ్యప్ప భక్తులకు మధ్య కొనసాగుతున్న వివాదం ఇప్పట్లో సమిసిపోయేలా కనిపించడం లేదు. పోటాపోటీగా సాగుతున్న ఆందోళనలు క్రమంగా భిన్న నిరసన రూపాలుగా మారుతున్నాయి. తాజాగా లింగసమానత్వం కోసం నినదిస్తూ లక్షల మంది మహిళలు భారీ 'ఉమెన్ వాల్'ను నిర్మించారు. అయ్యప్ప ఆలయంలో తమ ప్రవేశానికి అనుమతించాలని మహిళలు డిమాండ్ చేశారు. గత ఏడాది డిసెంబర్ 26న అయ్యప్పభక్తులు సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా నిర్వహించిన 'అయ్యప్పజ్యోతి' కార్యక్రమానికి పోటీగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం 620 కి.మీ. పొడవునా అతిపెద్ద మహిళా మానవహారాన్ని చేపట్టింది. రచయిత్రులు, కళాకారిణులు, సినీతారలు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, క్రీడాకారులు ఇందులో భాగమయ్యారు. ఉత్తర కేరళలోని కసర్‌గఢ్ నుంచి దక్షిణ కేరళలోని తిరువనంతపురం వరకు 14జిల్లాల పరిధిలోని రహదారుల వెంబడి మహిళలు హారంగా నిలబడ్డారు. మానవ హారం ప్రారంభ ప్రాంతం కసర్‌గఢ్‌లో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజ ముందు నిలబడగా.. తిరువనంతపురంలోని వెళ్లయంబాళం లోని చివరిస్థానంలో సీపీఎం జాతీయ నేత బృందాకారత్ నిలిచారు. సుమారు 50 లక్షల మంది మహిళలు, వారి మద్దతుదారులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు రోడ్లపైకి వచ్చిన మహిళలు కొద్దిసేపు రిహార్సల్స్ తర్వాత సాయంత్రం 4 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. లింగసమానత్వం, విలువల పునరుజ్జీవంపై నిర్వాహకులు మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఐదు గంటలకు కార్యక్రమం ముగిసింది. అన్ని రంగాల్లోనూ లింగ సమానత్వం కావాలని, కాలంచెల్లిన పురుషాధిక్య భావజాలం నుంచి బయటకు రావాలని వారు నినాదాలు చేశారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశానికి ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. వారికి మద్దతుగా యువకులు, వామపక్ష, ప్రగతిశీల సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. అధికార సీపీఎం సహా 176 ప్రజాస్వామిక సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 26న అయ్యప్పభక్తులు సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా నిర్వహించిన 'అయ్యప్పజ్యోతి' కార్యక్రమానికి పోటీగా మంగళవారం మహిళాహారాన్ని ఏర్పాటు చేశారు. అయ్యప్పజ్యోతి కార్యక్రమంలో కసర్‌గఢ్‌లోని హోసంగడి నుంచి కన్యాకుమారి వరకు దివ్వెలను చేతిలో పట్టుకుని వేలాదిమంది భక్తులు రహదారుల వెంబడి బారులు తీరారు. శతాబ్దాలుగా శబరిమలలో అమలవుతూ వస్తున్న సంప్రదాయాలను అలాగే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

లింగసమానత్వం కోసమే: విజయన్
సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. శబరిమలలో లింగసమానత్వం కోసమే ఈ మహిళా హారాన్ని చేపట్టినట్లు కేరళ సీఎం పినరాయి విజయన్ తెలిపారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని తిరువనంతపురంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ మహిళా సంస్కర్త అయ్యంకాళి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్, సీపీఐ నేత అన్నీ రాజా తదితరులు కూడా అయ్యంకాళి విగ్రహం వద్ద నివాళులర్పించారు. లింగసమానత్వం కోసం నినదిస్తూ.. కుల, మత, వర్ణ, వర్గాలకు అతీతంగా మహిళలు పాల్గొన్నారని విజయన్ చెప్పారు. చీకటి యుగాల్లోకి కేరళను తీసుకుపోకుండా ఈ ఉమెన్ వాల్ అడ్డుగోడగా నిలుస్తుందని ఆయన అన్నారు. 'మహిళా హారం' కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేందుకు వీలుగా మంగళవారం మధ్యాహ్నం వరకే పాఠశాలలను నడుపాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలూ కార్యక్రమంలో పాల్గొనేలా విస్తృత ప్రచారం చేసింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం బలవంతంగా ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చిందని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ ఆరోపించింది. 'ఉమెన్ వాల్' స్వచ్ఛందంగా జరిగింది కాదని, అది 'వివాదాలతో కూడిన గోడ' అని విమర్శించింది.

ఆరోగ్య రంగంలో 'ఆయుష్మాన్ భారత్'తో కొత్త ఒరవడి
100 రోజుల్లో 6.85 లక్షల మందికి లబ్ధి ■ కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడి



న్యూఢిల్లీ: ఆరోగ్య రంగంలో 'ఆయుష్మాన్ భారత్ పథకం' కొత్త ఒరవడిని సృష్టించిందని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. ఈ పథకాన్ని ప్రారంభించిన 100 రోజుల్లోనే 6.85 లక్షల మంది పేదలు లబ్ధిపొందారని తెలిపారు. రోజుకు కనీసం 5వేల మంది ఈ పథకం కింద ప్రయోజనం పొందుతున్నారన్నారు. 'ఆయుష్మాన్ భారత్' ప్రారంభించి 100 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో జైట్లీ మంగళవారం ఫేస్‌బుక్‌లో స్పందించారు. 'ఈ పథకంపై ప్రజలకు ఇంకా అవగాహన పెరిగితే లబ్ధిదారుల సంఖ్య బాగా పెరుగుతుంది. ఏటా కోటికిపైగా కుటుంబాలు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు పొందుతాయి' అని జైట్లీ చెప్పారు. మొత్తానికి దేశ జనాభాలో 40 శాతం మంది ప్రజలు లబ్ధిపొందే అవకాశముందన్నారు. వైద్య ఖర్చులు పెరుగుతుండటంతో పేదవాడికి ఈ పథకం ఎంతో అండగా నిలుస్తున్నదని తెలిపారు. ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ పథకం 16వేల ప్రైవేట్, ప్రభుత్వ దవాఖానల్లో అమలవుతున్నది. ఇందులో ప్రైవేట్ దవాఖానల సంఖ్యే అధికం. రానున్న రోజుల్లో మరిన్ని దవాఖానలు ఈ పథకాన్ని అమలు చేయనున్నాయి. ఒక కుటుంబానికి ఏడాదికి రూ.5లక్షల ఉచిత వైద్య సేవలు అందించే లక్ష్యంతో గతేడాది సెప్టెంబర్ 23న కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించింది.

ప్రశాంతంగా
కోరెగావ్-భీమా

పుణె: మహారాష్ట్రలోని కోరెగావ్-భీమా వద్ద ఉన్న అమరవీరుల స్తూపాన్ని మంగళవారం 8 నుంచి 10 లక్షల మంది సందర్శించి నివాళులర్పించారు. గతేడాది ఇక్కడ జరిగిన కార్యక్రమం సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో ఈసారి ప్రభుత్వం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. దీంతో శాంతియుత వాతావరణం నెలకొన్నది. సందర్శకులకు స్థానికులు గులాబీ పూలు అందజేసి ఆహ్వానం పలికారు. మరాఠా పీష్వాల పాలనను అంతమొందించడాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఇక్కడ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.



ముక్కులో పైపుతోనే విధులకు హాజరైన మనోహర్ పారికర్

సచివాలయానికి గోవా సీఎం పారికర్
నాలుగు నెలల విరామం తర్వాత తొలిసారి

పనాజీ, జనవరి 1: అనారోగ్యంతో బాధపడుతున్న గోవా సీఎం మనోహర్ పారికర్ (63) నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం సచివాలయానికి వచ్చారు. నాలుగు నెలల తర్వాత పారికర్ సచివాలయానికి రావడం ఇదే మొదటిసారి. గతేడాది ఆగస్టులో చివరిగా ఆయన సచివాలయానికి వచ్చారు. పాంక్రియాటిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న పారికర్ అమెరికాలోనూ, తర్వాత ఢిల్లీలోని ఎయిమ్స్‌లోనూ చికిత్స పొందారు. ప్రస్తుతం పనాజీకి సమీపంలోని డొనా పౌలాలోని తన వ్యక్తిగత నివాసంలో కోలుకుంటున్నారు.

సెల్‌ఫోన్‌కు బానిసగా మారిందని..
కూతురికి నిప్పంటించిన తండ్రి

పాల్ఘడ్: మహారాష్ట్రలోని పాల్ఘడ్ జిల్లాలో ఒక యువతి (16) ఫోన్‌కు బానిస కావడం తండ్రి మహమ్మద్ మన్సూరీకి పట్టరాని కోపం తెప్పించింది. ఆమె నిత్యం ఫోన్ వాడుతుండటంపై తండ్రీ కూతుళ్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో ఇతర కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేరు. ఆ కోపంలో తానేం చేస్తున్నాడో అర్థంకాని పరిస్థితిలో మహమ్మద్ మన్సూరీ కూతురిపై కిరోసిన్ చల్లి నిప్పంటించాడు. దీంతో ఆమెకు 70 శాతం గాయాలయ్యాయి. స్థానికులు ఆ యువతిని దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ముంబైలోని జేజే దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మన్సూరీని అరెస్ట్ చేసిన పోలీసులు ఐపీసీలోని 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ మరో కుట్ర
కర్ణాటక డిప్యూటీ సీఎం పరమేశ్వర ఆరోపణ



బెంగళూరు: కర్ణాటకలోని జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ మరో కొత్త కుట్రను పన్నిందని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ నేత జీ పరమేశ్వర ఆరోపించారు. కానీ ఆ కుట్రలు ఎన్నటికీ సఫలం కావని మంగళవారం మీడియాతో అన్నారు. తమ పార్టీ అసంతృప్త ఎమ్మెల్యేలతో బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా భేటీ జరుపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. 'ఎమ్మెల్యేల కొనుగోలులో బీజేపీ దిట్ట. మా పార్టీ అసంతృప్త ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నిస్తున్నది. ఈ ప్రయత్నాలు గతంలోనూ జరిగాయి. కానీ సఫలం కాలేదు. మళ్లీ కొత్త ప్రయత్నాలను మొదలుపెట్టింది. ఈసారి కూడా ఆ పార్టీకి భంగపాటు తప్పదు' అని పరమేశ్వర పేర్కొన్నారు.

ప్రధాని సభలో నలుపుపై నిషేధం!
ఆ రంగు దుస్తులు ఉంటే రానివ్వమంటూ జార్ఖండ్‌లో ఆంక్షలు

మేదినీనగర్: జార్ఖండ్‌లో శనివారం ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు ఆంక్షలు విధించారు. నల్లటి దుస్తులు ధరించిన వాళ్లు ప్రధాని సభకు రావద్దని ఆదేశాలు జారీ చేశారు. తమ సర్వీసుల క్రమబద్ధీకరణ కోసం కొద్ది రోజులుగా ఆ రాష్ట్ర ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో నల్ల దుస్తులు ధరించి నల్లజెండాలను ప్రదర్శించి నిరసన తెలుపాలని ఉపాధ్యాయులు భావిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు నల్లటి వస్తువులు(దుస్తులు, జెండాలు తదితరాలు) కల వాళ్లను సభకు అనుమతించబోమన్నారు. ఈ నిబంధన అధికారులకూ వర్తిస్తుందని తెలిపారు.



నా కులానికి చెందిన వారి అభివృద్ధి కోసం కృషి చేయడం నా ప్రథమ కర్తవ్యం. ఆ తరువాత మొత్తం సమాజం కోసం కృషి చేస్తా. అందరి కోసం పనిచేయడమే నా ఉద్దేశం.

మమతా భూపేశ్, రాజస్థాన్ మంత్రి

నేను (విడాకుల కోసం) న్యాయ పోరాటం సాగిస్తున్నా. ఈ పోరాటం మహాభారత యుద్ధం కన్నా పెద్దది... యాదవ సమాజానికి మేం విడిపోవడానికి సంబంధించిన వాస్తవాలు తెలువవు. తెలిసినప్పుడు వారు మాకు తప్పక మద్దతు ఇస్తారు.

తేజ్ ప్రతాప్ యాదవ్, ఆర్జేడీ నేత



చరిత్రలో నేడు



1942

ఫిలిప్పీన్స్‌ను ఆక్రమించిన జపాన్ సేనలు.

1947

తూర్పు బెంగాల్‌లో శాంతి యాత్ర ప్రారంభించిన మహాత్మాగాంధీ.





1988

కెనడా-యూఎస్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసిన ముల్రోనీ, రీగన్

ప్రధాన న్యాయమూర్తి పదవికి పరిశీలనలో ఉన్న చోలేంద్ర శుష్మర్ రాణాపై పార్లమెంటరీ కమిటీ అనేక ప్రశ్నలు కురిపించింది. ఆయన గతంలో ఇచ్చిన వివాదాస్పద తీర్పులపై కూడా అడిగింది. రాజ్యాంగ పదవులలో చేరే వారు సమర్థులేనా అని నియామకానికి ముందు పార్లమెంటరీ కమిటీ పరిశీలిస్తుంది. ఈ మధ్యకాలంలో న్యాయవ్యవస్థ పట్ల ప్రజల నమ్మకం సన్నగిల్లుతున్నది. అందువల్ల నిజాయితీపరులు మాత్రమే ఉన్నస్థానాలకు చేరే విధంగా పార్లమెంటరీ కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలె.

ది హిమాలయన్ టైమ్స్

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ ఘన విజయం సాధించిన తీరు ఈ గెలుపును ఊహించిన వారిని కూడా ఆశ్చర్యపరిచింది. ప్రతిపక్షాలన్నిటినీ కుప్పకూలిన అవామీ లీగ్ మొత్తం 300 సీట్లలో 288 గెలుచుకున్నది. హసీనా పాలనలో బంగ్లాదేశ్ సాధించిన ఆర్థికాభివృద్ధి మూలంగానే ఈ విజయం సాధ్యమైంది. దుస్తుల ఎగుమతిలో బంగ్లాదేశ్ చైనా తరువాత స్థానంలో ఉన్నది. ఈ ఆర్థికాభివృద్ధి మూలంగా హసీనా పాలనపై ఉన్న మిగతా ఆరోపణలన్నీ పక్కకు పోయాయి. బంగ్లాదేశ్ ఘర్షణలకు అతీతంగా ఎదుగుతుందని ఆశిద్దాం.

డాన్

ఆహార పరిశ్రమ

తెలంగాణ రాష్ట్రం సమగ్ర శాస్త్రీయ వ్యవసాయ విధానంతో క్షేత్రస్థాయిలో మరో చారిత్రక సన్నివేశానికి సమాయత్తమవుతున్నది. ఆహార పరిశ్రమ, పంట కాలనీల ద్వారా వ్యవసాయాన్ని జీవికకు భరోసా ఇచ్చే రంగంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచిస్తున్నారు. ఈ దిశగా సమగ్ర అధ్యయనం చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. సమర్థవంతమైన, శాస్త్రీయమైన పద్ధతిలో పంటల సాగు, పంపిణీ విధానం దేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడున్నా అధ్యయనం చేయాలని, ఆచరించాలని కోరటం గమనార్హం. అత్యధిక శాతం ప్రజలు ఇప్పటికీ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్న ఈ సమాజంలో తమ పంటకు కనీస మద్దతు ధర దక్కటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మొదటిసారి అధికారానికి వచ్చిన వెంటనే రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విత్తనాలు, ఎరువులు, విద్యుత్ అందేలా చర్యలు తీసుకున్న కేసీఆర్ రైతులను ఆదుకోవడానికి అనేక వినూత్న పథకాలను ప్రవేశపెట్టారు. నీటి వసతి కల్పించేందుకు అనేక ప్రాజెక్టులను అతి వేగంగా పూర్తి చేస్తున్నారు. మరోవైపు వ్యవసాయాన్ని గిట్టుబాటుగా మార్చడానికి సమగ్ర వ్యూహానికి రూపకల్పన చేశారు. ఈ సమగ్ర వ్యూహంలో భాగమే తాజాగా ఆహార పరిశ్రమ, పంట కాలనీల విధానాలు అమలు చేయడం.

వ్యవసాయాధారిత సమాజంగా ఉన్న దేశంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో కనీస శాస్త్రీయ విధానాలు అమలు, ఆచరణలో లేకపోవటం విషాదం. మానవవికాస అభివృద్ధి చరిత్రలో వ్యవసాయరంగంలో ఉన్నంత అరాచకం, అశాస్త్రీయం ఏరంగంలోనూ కనపడదు. సబ్బు మొదలు అగ్గిపెట్టె దాకా ఉత్పత్తిదారుడు ప్రతి చిన్న వస్తువును కొనుగోలుదారులను గుర్తించి వారి లక్ష్యంగా ఉత్పత్తి చేస్తాడు. మార్కెట్లో లాభసాటిగా అమ్ముకుంటాడు. కానీ సమస్త మానవాళి మనుగడకు మూల కారణమైన వ్యవసాయ ఉత్పత్తులు మాత్రం సామాజిక అవసరాలకు అనుగుణంగా ఉండవు. తరతరాలుగా భూమిని నమ్ముకొని బతికే రైతు గాలివాటంగా పంటలు పండిస్తాడు. ఒక పంటకు ధర ఉన్నదని పంట వేస్తే, పంట చేతికొచ్చే సరికి పరిస్థితి తలకిందులైపోతుంది. దీంతో పంటను అమ్ముకోలేక పంట చేన్లను పశువులకు మేతగా చేసే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఏ నేలలో ఏ పంట వేయాలో, ఎప్పుడు వేయాలో చెప్పే బాధ్యతాయుత వ్యవస్థను నెలకొల్పి చిత్తశుద్ధితో అమలు చేసిన పాలక ప్రభుత్వాలు ఈ దేశంలో లేవు. దీంతో తరతరాలుగా భూమిని నమ్ముకొని బతికే రైతు గాలివాటంగా పంటలు పండించే దుస్థితి ఉన్నది. పండించిన పంటకు కనీస ధర రాక రోడ్లపై, చెత్తకుప్పల్లో టమాటాలు, ఉల్లిగడ్డలు మొదలు కూరగాయలు, ఆకు కూరలు పారబోసిన వైనం ఉంటున్నది. అలాగే పాలకు కూడా కనీస మద్దతు ధర దక్కటం లేదని రోడ్లపై వేలాది లీటర్ల పాలను రోడ్లపై పారబోసిన పాడి రైతుల దీనగాథ ఎరిగిందే. రైతు పరిస్థితి అమ్మబోతే అడివి, కొనబోతే కొరివి అన్న చందంగా తయారైంది. దీనికంతటికీ కారణం ప్రభుత్వాల బాధ్యతారాహిత్యమని ప్రధానంగా చెప్పుకోక తప్పదు.

ఆహారశుద్ధి పరిశ్రమ ద్వారా రైతాంగం మాత్రమే కాదు, మొత్తంగా ప్రజానీకానికంతా ఎంతో మేలు జరుగుతుంది. రైతు పండించిన పంట ఏదైనా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు మొదలు పండ్ల తోటల ఉత్పత్తులను నిల్వ చేసుకునే శీతల గిడ్డంగులతో పాటు, అనేక పద్ధతులు అందుబాటులోకి వస్తాయి. అలాగే 'ప్రాసెస్' చేయటం ద్వారా పండ్లు, పంట ఉత్పత్తులు ఏవైనా చాలాకాలం నిల్వ చేసుకోవచ్చు. స్థల, కాలాలకు అతీతంగా అన్నిరకాల పండ్లు, పంట ఉత్పత్తులను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడవచ్చు.

ఆహారశుద్ధి పరిశ్రమ ద్వారా రైతాంగం మాత్రమే కాదు, మొత్తంగా ప్రజానీకానికంతా ఎంతో మేలు జరుగుతుంది. రైతు పండించిన పంట ఏదైనా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు మొదలు పండ్ల తోటల ఉత్పత్తులను నిల్వ చేసుకునే శీతల గిడ్డంగులతో పాటు, అనేక పద్ధతులు అందుబాటులోకి వస్తాయి. అలాగే 'ప్రాసెస్' చేయటం ద్వారా పండ్లు, పంట ఉత్పత్తులు ఏవైనా చాలాకాలం నిల్వ చేసుకోవచ్చు. స్థల, కాలాలకు అతీతంగా అన్నిరకాల పండ్లు, పంట ఉత్పత్తులను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడవచ్చు. సరియైన ధరలు అందుబాటులోకి వచ్చినప్పుడే మార్కెట్లో అమ్ముకోవచ్చు. తాజా రుచులు, సువాసనలు ఉండే విధంగా ఆ ఉత్పత్తులకు బ్రాండ్ నేమ్ సాధించి విదేశాలకు ఎగుమతి చేసి ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చు. దీంతోపాటు ప్రభుత్వం ఆలోచిస్తున్న పంట కాలనీల విధానం మరింత ఉన్నతమైనది, శాస్త్రీయమైనది. నేలకు తగ్గ పంటలు వేయటంతో పాటు, ప్రజల అవసరాలకు తగ్గ విధంగా పంటలు ఏవి ఎంత శాతం భూముల్లో పండించాలో పంట కాలనీల విధానం ద్వారా ఆచరణలోకి వస్తుంది. దీంతో రైతు పండించిన పంట అమ్ముడుపోదు, గిట్టుబాటు ధర అందదు అనే సమస్యే ఉత్పన్నం కాదు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా సాగుభూమిలో ఏ పంట ఎంత శాతమనే శాస్త్రీయ అంచనాతో పండించటంతో ప్రజావసరాలు తీరుతాయి. ప్రజావసరాలకు, పంట ఉత్పత్తులకు సమ న్వయం ఉండటం కారణంగా స్థూలంగా వ్యవసాయరంగంలోని సంక్షోభం కనుమరుగు అవుతుంది. ఇలాంటి శాస్త్రీయ పద్ధతుల అమలు ద్వారా ఆహారభద్రత సమస్య కూడా పరిష్కారం అవుతుంది. ఇప్పటికే వ్యవసాయరంగ అభివృద్ధి, రైతు సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజె క్టు నిర్మాణాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం ఆహార పరిశ్రమ, పంట కాలనీల విధానం ద్వారా వ్యవసాయ సమాజానికే ఆదర్శంగా నిలుస్తుందనటంలో సందేహం లేదు.

జనగళం

ఎక్కువ బస్సులు నడుపాలి

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు సొంత ఊళ్లకు వెళ్తుంటారు. ఈ సమయంలో ప్రయాణికులకు తగిన రవాణ సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీకి గాని, రైల్వే శాఖ గాని పెద్ద పనే. అయితే ఏటా ఈ పండుగ సమయాల్లో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని తగిన ఏర్పాట్లు చేయాలి. ప్రయాణికులు ప్రైవేటు వాహనాల కంటే ఆర్టీసీ వంటి వాటిపైనే ఎక్కువగా ఆధారపడుతుంటారు. ఏ ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో జనాలు వెళ్తుంటారో దానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. వీలైనన్ని ఎక్కువ బస్సులు నడుపాలి. ప్రయాణికుల ఇబ్బందులు పండకుండా తగిన చర్యలు చేపట్టాలి. అధికారులు ఇప్పటి నుంచే ఈ దిశగా ఆలోచించాలి.

-బి. రామాంజనేయులు, పెద్దపల్లి

అప్పుడే మార్పు సాధ్యం

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం నోట్లను రద్దు చేశామని కేంద్రం చెబుతున్నది. కానీ ఇంకా చాలాచోట్ల ఏటీఎంలలో సమస్య అలాగే కనిపిస్తున్నది. ముఖ్యంగా పండుగ సమయాల్లో ఏటీఎంలలో డబ్బులు ఉండటం లేదు. అంతా నగదురహిత లావాదేవీలవైపు మళ్లాలి అంటే అంత సులువు కాదు. కాబట్టి కేంద్రం ముందు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలిగించాలి. అప్పుడే కేంద్రం ఆశించిన మార్పు సాధ్యం.

-పి. సతీశ్, హైదరాబాద్

ప్రమాదాలు అరికట్టాలి

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అతి వేగమే ప్రధాన కారణంగా చాలా సందర్భాల్లో కనిపిస్తున్నది. కాబట్టి అతివేగంతో ప్రయాణిస్తున్న వాహనాలపై రవాణ అధికారులు దృష్టి సారించాలి. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిపై తగిన చర్యలు చేపట్టాలి. అతి వేగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. అప్పుడే కొంతవరకు ప్రమాదాలను తగ్గించగలుగుతాము.

-పులిపాక రవీందర్, జహీరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

వ్యవసాయం



డాక్టర్ పిడిగెం సైదయ్య

రైతుబంధు ఇప్పుడు దేశబంధు

తెలంగాణలో రైతు సంక్షేమ కోసం తెచ్చిన పథకాలు మేలైన ఫలితాలు ఇచ్చాయి. వరి వంటి ప్రధాన పంటల దిగుబడులు రికార్డుస్థాయిలో వచ్చాయి. ఇది కేవలం రుణమాఫీ వంటి తాత్కాలిక ఉపశమన చర్యల తోనే సాధ్యం కాలేదు. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిరంతర విద్యుత్ సరఫరా, రైతుబంధు పెట్టుబడి సహాయ పథకాన్ని విజయవంతంగా అమలుచేస్తున్నది.

ప్రస్తుతం అన్నిపార్టీలు వ్యవసాయరంగ సంక్షేమంవైపు దృష్టి సారిస్తున్నాయి. హామీల వరాలు కురిపిస్తున్నాయి. ఇందులో ప్రధానమైనవి రెండు. దేశవ్యాప్తంగా చర్చలో రుణమాఫీ ఒకటి, రెండవది తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న రైతుబంధు పథకం. మొదటిది అప్పుల ఊబిలో ఉన్న రైతుల బైటపడేసి కొంత ఊరటనిస్తుంది. రెండోది సాగు చేయడానికి చేతిలో డబ్బు లేకపోయినా ఎవరి దగ్గరా అప్పు చేయకుండా అవసరమైన పెట్టుబడిని అందించేది. అందుకే రుణమాఫీ కంటే రైతుబంధు పథకమే ఉత్తమం అన్నది అందరూ అంగీకరిస్తున్న వాస్తవం.

వ్యవసాయరంగంలో సంక్షోభాలు నెలకొన్నాయి. అయినా ఇప్పటికీ దేశ జనాభాలో ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారే అధికం. అంతేకాదు రాజకీయపార్టీలకు వారి ఓట్లే కీలకం. అందుకే కొన్నిసార్లు రుణమాఫీ చేయబడింది. దేశంలో మొదటిసారిగా 1990లో కేంద్రం 10000 కోట్ల పంట రుణాలను మాఫీ చేసింది. 2008లో కేంద్రం 65000 కోట్ల విలువ కలిగిన పంట రుణాలను మాఫీ చేసింది. ఇది జాతీయ స్థూల ఉత్పత్తిలో 1.3 శాతం. గత తొమ్మిదేండ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వేల కోట్ల రూపాయల పంట రుణాలు మాఫీ చేశాయి. 4.8 కోట్ల రైతుల రుణాలు మాఫీ అయ్యాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రుణమాఫీ ప్రకటించా యి. 2016లో అప్పటి జయలలిత ప్రభుత్వం తమిళనాడులో రుణమాఫీ ప్రకటించింది. 44 వేల కోట్ల రూపాయల రుణమాఫీతో కర్ణాటక జాబితాలో మొదటి స్థానంలో ఉన్నది. దాదాపు 30 వేల కోట్ల రూపాయల పైచిలుకు రుణాలతో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలు ఉన్నాయి. 2017లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక రాష్ట్రా ల రుణమాఫీ సొమ్ము మొత్తం 13.6 బిలియన్ డాలర్లకు సమానం. 2019 నాటికి దేశవ్యాప్త పంట రుణాల మాఫీ మొత్తం దేశ జీడీపీలో 2–2.5 శాతానికి సమానంగా ఉండొచ్చు అని గణాంకాలు తెలుపుతున్నాయి.

దేశవ్యాప్తంగా రుణమాఫీ ప్రకటించే వరకు ప్రధాని మోదీని నిద్రపోనివ్వనని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. దేశవ్యాప్త రుణమాఫీకి దాదాపు నాలుగు లక్షల కోట్లు అవసరం. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో గెలిచిన కాంగ్రెస్ రుణమాఫీని ప్రకటించింది. మధ్యప్రదేశ్‌లో రెండు లక్షల వరకు ఉన్న పంట రుణాలను రద్దు చేస్తున్నట్టు కమల్‌నాథ్ ప్రకటించారు. జాతీయ, సహకార బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను రద్దు చేస్తున్న ప్రభుత్వం 35 నుంచి 38 కోట్ల రూపాయలు ఇందుకోసం వెచ్చించాలి. 34 లక్షల మంది రైతులకు ఈ పథకం లబ్ధి చేకూర్చనున్నది. అలాగే ఛత్తీస్‌గఢ్‌లో రూ.1600 కోట్లతో 16.65 లక్షల మంది రైతుల స్వల్పకాలిక రుణాలు మాఫీ చేయనున్నారు.

బడా పారిశ్రామికవేత్తలకు సంబంధించి 40–50 శాతం రుణాలను జాతీయ బ్యాంకులు మాఫీ చేస్తున్నాయి. వేల కోట్ల రూపాయలు పారిశ్రామికవేత్తలు ఎగ్గొడుతున్నారు. పంటల సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. సాగులో పెట్టుబడి ఖర్చులు కూడా గణనీయంగా పెరిగిపోతున్నాయి. దీంతో కుటుంబపోషణ భారంగా ఉంటుంది. గ్రామాలలో అయితే 24 నుంచి 36 శాతం వరకు అధిక వడ్డీకి తీసుకుని తలకుమించిన భారంతో సాగు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవాల్సి బాధ్యత ఉన్నది. దీనికి రుణ మాఫీ మేలు చేస్తుంది. అయితే అదే తారకమంత్రం కాదు. పంట రుణాలు సాగు చేసే ప్రతి రైతుకు అందడం లేదు. అధిక సంఖ్యలో ఉన్న చిన్న, సన్నకారు రైతులకు సంస్థాగత రుణాల అందుబాటు లేదు. సహకార బ్యాంకులు, జాతీయ బ్యాంకులు వీరికి రుణాలు అందించడంలో అనేక సమస్యలు చూపిస్తున్నారు. అలాగే రుణమాఫీకి ఏక సూత్రాలు లేవు. పంట నష్టం లేదా పంట విస్తీర్ణం లేదా యజమాని ఆర్థిక స్థోమత ఇలా దేన్నీ పరిగణనలోకి తీసుకోవాలో స్పష్టత లేదు. ఒక రాష్ట్రంలో రైతులు క్షామం వల్ల పంటలు నష్టపోతున్నారు. మరో రాష్ట్రంలో అధిక పంట ఉత్పత్తులు ఉండి, ధరలు రాక నష్టపోతున్నారు. కాబట్టి దేశమంతా రుణమాఫీ ఒకేవిధంగా ఉండదు.



అదేసమయంలో ప్రధాని మోదీ కూడా రైతులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. రుణమాఫీని మించిన మరో ఆకర్షక పథకం గురించి సమాలోచన చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల రుణమాఫీల మార్గదర్శకాలు పరిశీలిస్తున్నారు. వాటితోపాటు దేశంలో పలు రాష్ట్రాలు అమలు చేస్తున్న, రైతుల ఆదరణ పొందుతున్న ప్రధానమైన మూడు పథకాలపై చర్చిస్తున్నారు. వీటిలో తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న 'రైతుబంధు' పెట్టుబడి మద్దతు పథకం ఒకటి. మధ్యప్రదేశ్‌లో అమలవుతున్న 'భవంతర్ యోజన' జార్ఖండ్‌లో ఉన్న సబ్సిడీ బదిలీ పథకాలను కూడా పరిశీలిస్తున్నారు. అలాగే రైతులు ప్రధానంగా పంటలకు గిట్టుబాటు ధరలు అందడంలేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కనీస మద్దతు ధరలకు, బహిరంగ మార్కెట్ ధరలకు మధ్య వ్యత్యాసాన్ని నేరుగా రైతుల ఖాతాలోకి వేసే పథకంపై కూడా ఆలోచన చేస్తున్నారు. ఇంకా ఆహార పంటలకు ఉచితంగా బీమా చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు సమాచారం.

దేశంలో వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం పలు అంశాలతో ముడిపడి వ్యవసాయ ఉత్పత్తులలో పెరుగుదలను ప్రోత్సహిస్తూనే, ఉద్యాన రంగాన్ని బలోపేతం చేయాలి. పంట కోత అనంతరం నిల్వలకు కావాల్సిన వసతి సౌకర్యాలు కల్పించాలి. దిగుబడులను పెంచే సాగునీటి వసతుల కల్పనపై దృష్టిపెట్టాలి. పంటల బీమా ప్రతి పంటకు అందేలా ప్రణాళికలు రూపొందించాలి. పండించిన ప్రతి ధాన్యపు గింజకు గిట్టుబాటు ధర అందేలా చూడాలి. మార్కెట్ సంస్కరణలూ తీసుకునిరావాలి.

తెలంగాణలో రైతు సంక్షేమ కోసం తెచ్చిన పథకాలు మేలైన ఫలితాలు ఇచ్చాయి. వరి వంటి ప్రధాన పంటల దిగుబడులు రికార్డుస్థాయిలో వచ్చాయి. ఇది కేవలం రుణమాఫీ వంటి తాత్కాలిక ఉపశమన చర్యల తోనే సాధ్యం కాలేదు. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిరంతర విద్యుత్ సరఫరా, రైతుబంధు పెట్టుబడి సహాయ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నది. దీంతోపాటు రైతు కుటుంబాలను ఆదుకునేందుకు 'రైతుబీమా', వ్యవసాయ విస్తరణ బలోపేతం, త్వరితగతిన స్పందించిన ప్రభుత్వ మార్కెటింగ్‌కు మద్దతు ఇలా అనేక పథకాలు, ప్రభుత్వ కార్యాచరణతోనే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. దీనిలో రైతుబంధు పథకం ప్రధానమైంది. రైతుల పంట విస్తీర్ణం, ఆర్థిక స్థోమత వంటి అంశాలతో ముడిపెట్టకుండా అన్నివర్గాల రైతులకు పెట్టుబడి సహాయం అందించడం మొదటి విజయం. పంట రుణాలు కొందరే తీసుకుంటారు. కాబట్టి రుణమాఫీ ఫలితాలు అందరికీ అందవు. పెట్టుబడికి నిబంధనలు లేవు. కాబట్టి భూమి ఉన్న ప్రతి రైతుకు సాగులో పెట్టుబడి పథకం సహాయపడింది. సకాలంలో విత్తనాలు, ఎరువులు, కొనుగోలు చేసి పంటల దిగుబడులు పెరిగేలా ఆదుకోగలిగింది. గ్రామాల్లో వడ్డీ వ్యాపారస్థుల కబంధహస్తాల నుంచి రైతులను విముక్తి చేయగలిగింది. అందుకే 'రైతుబంధు' ఇప్పుడు 'దేశబంధు' కాబోతున్నది. దేశంలో చిన్న, సన్నకారు రైతులే 85 శాతానికి పైగా ఉన్నారు. పంటల సాగులో వీరికి పెట్టుబడి సకాలంలో కావాలి. సాగులో నిలదొక్కుకోవడానికి ఇది ఒక్కటి చాలు. దీనికితోడు రైతుబీమా పథకాన్ని దేశవ్యాప్తం గా అమలు చేస్తే వ్యవసాయరంగంలో పురోగతి సాధ్యమవుతుంది. ఈ విషయంలో వ్యవసాయ అనుకూల విధానాలతో తెలంగాణ రాష్ట్రం దేశానికి దిక్సూచిగా మారడం శుభపరిణామం.

దేశంలో చిన్న, సన్నకారు రైతులే 85 శాతానికి పైగా ఉన్నారు. పంటల సాగులో వీరికి పెట్టుబడి సకాలంలో కావాలి. సాగులో నిలదొక్కుకోవడానికి ఇది ఒక్కటి చాలు. దీనికితోడు రైతుబీమా పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తే వ్యవసాయరంగంలో పురోగతి సాధ్యమవుతుంది. ఈ విషయంలో వ్యవసాయ అనుకూల విధానాలతో తెలంగాణ రాష్ట్రం దేశానికి దిక్సూచిగా మారడం శుభపరిణామం.

(వ్యాసకర్త శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

సకలజనుల్లో సంబురం

తెలంగాణం



ఆసరి రాజు

గొప్ప ప్రయత్నాలు, గొప్ప ఆలోచనలన్నీ హేళనతోనే మొదలవుతాయి'- అల్బర్ట్ కామూ. ఇది ఉద్యమనాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సరిగ్గా సరిపోతుందేమో! ఎందుకంటే ఉద్యమంలో ఎన్ని విమర్శలు వచ్చినా, వ్యక్తిగత దాడి జరిగినా కుంగిపోలేదు.లక్ష్య సాధనలో గమ్యాన్ని ముద్దాడాలనే తన సంకల్పం ముందు అన్నీ పటాపంచలయ్యాయి. కేసీఆర్ తాను ఏ పని చేపట్టినా దానికి సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకుంటారు. దానిపై విస్తృత అధ్యయనం చేస్తారు. కార్యాచరణ ప్రకటించడానికి ముందే పక్కా ప్రణాళిక రూపొందించుకుంటారు. ఉద్యమ సమయంలోనూ, తర్వాత పాలనలోనూ తనదైన ముద్ర వేయడానికి ఇవే కారణం. అందుకే ఆయన ఆలోచనలు, పాలనా పరంగా కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దేశంలో ఇప్పుడు చర్చనీయాంశాలు అయ్యాయి. తాను చేపట్టిన కార్యక్రమం వల్ల లక్షలాది మందికి లబ్ధి చేకూరేలా ఉండాలి అన్నది ముఖ్యంత్రి ఆలోచన. తాజాగా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కూడా రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలను అక్కడి రైతుల కోసం ప్రకటించింది. జార్ఖండ్ రాష్ట్రం కూడా రైతుబంధు పథకాన్ని తమ రాష్ట్రంలో అమలు చేసే ప్రయత్నాలు చేస్తున్నది. అందుకే మొన్న ప్రెస్‌మీట్‌లో రైతుబంధు గురించి ఇప్పుడు చాలా రాష్ట్రాలు అమలు చేయడానికి ముందుకు వస్తున్నాయని, కేంద్రం కూడా ఆ ఆలోచన చేస్తున్నదని ఇంతకంటే ఏం కావాలి అని అన్నారు. అంతేగానీ కొంతమంది లాగా అంతా 'నేనే' అన్నట్టు ఎన్నడూ చెప్పుకోలేదు.

ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ నాలుగున్నర ఏండ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు మీ కండ్ల ముందే ఉన్నాయని, అవి నిజమో కాదో మీరే బేరీజు వేసుకుని ఆలోచించి ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజలకే నిర్ణయాధికారం వదిలిపెట్టారు. అందుకే విపక్షాలు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు పట్టించుకోలేదు. ఎందుకంటే రాష్ట్ర విభజనకు ముందు ఆ తర్వాత తెలంగాణలో వచ్చిన మార్పు ఏమిటి అన్నది ప్రజలు స్పష్టంగా గుర్తించారు. భారీ మెజారిటీతో మరోసారి పనిచేసే ప్రభుత్వాన్ని నిలబెట్టారు. రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన తర్వాత ఐదేండ్లలో అంతా అయిపోతుంది అనే భ్రమలు ప్రజలకు ఏమీ లేవు. కానీ చిత్తశుద్ధి ఉన్న నాయకుడి నేతృత్వంలో జరుగుతున్న ప్రాజెక్టుల నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఫలప్రదం కాబోతున్నాయనే నమ్మకం కలిగింది. దాని ఫలితమే ఉద్యమ సమయంలో తెలంగాణకు వ్యతిరేకంగా నిలబడిన వాళ్లు కూడా ఇవాళ కేసీఆర్ నాయకత్వానికి ఓటు వేసేలా చేసింది. మాటలు చెప్పడం వేరు పని చేయడం వేరు. అందుకే తాము చేపట్టే ప్రతి పని ఏదో హడావుడిగా కాకుండా కొంచెం లేటు అయినా పక్కాగా పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో స్పష్టంగా చెప్పారు. దీన్ని ప్రజలు విశ్వసించారు.

చేసిన పనిని గొప్పగా కాకుండా తమ బాధ్యత అన్నట్టు చెప్పడం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముందు నుంచి అలవాటు. కానీ ఒక ఒక నాయకుడు మాత్రం తానే అందరికంటే సీనియర్ అని, తనకు నలభై ఏండ్ల రాజకీయ అనుభవం ఉన్నదని, ఉన్నవి లేనివి చెప్పుకోవడం దాన్నే వారి అనుచరగణం ప్రచారం చేయడం పరిపాటి అయ్యింది. అందుకే తాజాగా హైకోర్టు విభజన అంశాన్ని కూడా రాద్ధాంతం చేయడమూ ఆయనకే చెల్లింది. హైకోర్టు విభజన గురించి కొన్నేండ్లుగా టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావించారు. దీనిపై ముఖ్యమంత్రి, ఎంపీలు ప్రధానిని, కేంద్ర న్యాయమంత్రిని అనేక సందర్భాల్లో కలిసి విన్నవించారు. విభజన కోసం అవసరమైతే ఏపీ హైకోర్టు కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి తగిన ఏర్పాట్లు చేస్తామని తెలంగాణ ప్రభు త్వం అనేక సందర్భాల్లో ముందుకు వచ్చింది. ఆ సమయంలోనూ చంద్రబాబు ప్రభుత్వం చిత్తశుద్ధితో సమస్య పరిష్కారం కోసం పనిచేయలేదు. ఆ తర్వాత అనేక సంప్రదింపులు జరిగాయి. అనంతరం గత ఏడాది అక్టోబర్‌లో ఏపీ ప్రభుత్వం ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేసింది. దానికి అనుగుణంగా కేంద్రం తగిన చర్యలు తీసుకున్నది. ఫలితంగా రాష్ట్రపతి నోటిఫికేషన్ వచ్చింది. తీరా నోటిఫికేషన్ వచ్చిన తర్వాత నారా వారు నాలుక మడతేసి కేంద్రంపై ఆరోపణలు చేసిన తీరు హాస్యాస్పదంగా ఉన్నది. రాష్ట్ర విభజన సమయంలో చేసిన వితండవాదాలే నేడు విభజన చట్టంలోని వివిధ అంశాల పరిష్కారంలోనూ చేస్తున్నారు. ఇలా ప్రతి అంశం జటిలం అవ్వడానికి ఏపీ ప్రభుత్వ వైఖరే కారణం. చంద్రబాబు అక్కడి పాలనపై దృష్టి సారించకుండా తన వ్యక్తిగత ప్రచారం కోసం చేసిన ప్రయత్నాలే ఎక్కువ. ఇదే విషయాన్ని అక్కడి ప్రతిపక్షాలు కూడా విమర్శిస్తున్నాయి. కాబట్టి ఈ కొత్త ఏడాది అయినా ఏపీ ప్రభుత్వం అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని ఆశిద్దాం.

చివరగా 2018 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంతోషం కలిగించే అనేక అంశాలు ఉన్నాయి. విభజన అనంతరం పదేండ్లు ఎంత కీలకమో ప్రజలకు తెలుసు. అందుకే ఎన్నికల సమయంలో కొంతమంది చేసిన కుట్రలను తిప్పికొట్టారు. అలాగే రాష్ట్ర ఆవిర్భావం నుంచి రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న హైకోర్టు విభజన పూర్తి అయింది. తెలంగాణ హైకోర్టు కొలువు దీరింది. వచ్చే ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు అందించబోయే ఫలితాలు పంట పొలాలకు చేరనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అందించిన రైతుబంధు ద్వారా రైతులు సాగు సంబురంగా సాగుతున్నది. మిషన్ భగీరథ ద్వారా ఈ ఏడాది దాదాపు అన్ని గ్రామాలకు నీళ్లు అందనున్నాయి. నలుగురి ముందు నవ్వుల పాలు కావొద్దు అన్న ముఖ్యమంత్రి మాటను ప్రజలు అర్థం చేసుకున్నారు. ఈ నాలుగున్నర ఏండ్ల కాలంలో ప్రజలు అనేక సందర్భాల్లో తమ చైతన్యాన్ని చూపెట్టారు. అందుకే గత ఏడాది సకల జనులకు సంతోషం నింపిన సంవత్సరంగా నిలిచిపోయింది.

చివరగా 2018 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంతోషం కలిగించే అనేక అంశాలు ఉన్నాయి. విభజన అనంతరం పదేండ్లు ఎంత కీలకమో ప్రజలకు తెలుసు. అందుకే ఎన్నికల సమయంలో కొంతమంది చేసిన కుట్రలను తిప్పికొట్టారు. అలాగే రాష్ట్ర ఆవిర్భావం నుంచి రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న హైకోర్టు విభజన పూర్తి అయింది. తెలంగాణ హైకోర్టు కొలువుదీరింది. వచ్చే ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు అందించబోయే ఫలితాలు పంట పొలాలకు చేరనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అందించిన రైతుబంధు ద్వారా రైతులు సాగు సంబురంగా సాగుతున్నది

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం యాదాద్రికి భక్తులు పోటెత్తారు. శ్రీలక్ష్మీనరసింహస్వామివారి జన్మ నక్షత్రం స్వాతి, ఏకాదశి సందర్భంగా లక్ష పుష్పార్చన, నూతన సంవత్సరం ఒకే రోజున రావడంతో యాదాద్రి భక్తులతో పులకించింది. ఈవో గీత ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ



వరంగల్ నగరంలోని చారిత్రాత్మకమైన భద్రకాళీ అమ్మవారిని మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. సాధారణ క్యూలైన్లు భక్తులతో నిండి పోవడంతో పాటు, ప్రత్యేక దర్శన క్యూలైన్లలోనూ భక్తులు బారులు తీరారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఆర్ సునీత పర్యవేక్షించారు.
- మట్టెవాడ (వరంగల్)



బాసర సరస్వతీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి చెంత మొక్కులు తీర్చుకున్నారు. మహారాష్ట్ర, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిపించారు. సుమారు పదివేలమంది అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయాధికారులు తెలిపారు.
- బాసర



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి ముందుగా కోడెమొక్కు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. 7 వేలమందికిపైగా భక్తులు రాగా రూ.5 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో రాజేశ్వర్ వెల్లడించారు.
-వేములవాడ కల్చరల్

వైద్యసేవల్లో వర్ధన్నపేట టాప్

- రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన సీహెచ్‌సీ
- కేసీఆర్ కిట్టుతో పెరిగిన సంఖ్య



వర్ధన్నపేట సీహెచ్‌సీలో ఆధునిక వసతులతో ఉన్న వార్డు

వర్ధన్నపేట, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ దవాఖానల్లో వసతులతోపాటు, వైద్యసేవలు మెరుగయ్యాయి. ఇదివరకు సర్కార్ దవాఖాన అంటే భయపడే వారు.. స్వరాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దవాఖానల స్థితిగతులను మార్చేసింది. మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలను కల్పించడంతో అప్పటినుంచి ప్రభుత్వ దవాఖానలకే క్యూ కడుతున్నారు. కేసీఆర్ కిట్టు, అమ్మఒడి పథకాలు అందుబాటులోకి రావడంతో డెలివరీలు పెరిగాయి. ప్రసూతి విభాగంలో వరంగల్ రూరల్ జిల్లాలోని వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోపాటు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ సీఎం కేసీఆర్ సహకారంతో ఇక్కడి వసతులు మెరుగయ్యాయి. వైద్యులు కూడా నిబద్ధతతో పనిచేస్తుండటంతో దవాఖానకు వచ్చే వారి సంఖ్య అమాంతం పెరిగిపోయింది. వర్ధన్నపేట సీహెచ్‌సీకి సమీపంలోని వరంగల్ అర్బన్, జనగామ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన వారు కూడా ప్రసూతి కోసం ఇక్కడికే వస్తున్నారు. 2017లో వర్ధన్నపేట సీహెచ్‌సీలో 1,530 డెలివరీలు జరగ్గా ఇందులో 693 సాధారణ కాన్పులు, 837 సీజేరియన్లు ఉన్నాయి. ఇది రాష్ట్రంలోనే రికార్డు. 2018 జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు 2,261 డెలివరీ జరగ్గా అందులో 887 సాధారణ, 1374 సిజేరిన్లు ఉన్నాయి.

కేసీఆర్ కిట్ల పంపిణీలో టాప్..

వర్ధన్నపేటలో కేసీఆర్ కిట్లను అత్యధికంగా పంపిణీ చేశారు. 2017 మే నుంచి డిసెంబర్ వరకు 1,024 కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. 2018 జనవరి నుంచి డిసెంబర్ 31వరకు 1,834 కిట్లను అందజేశారు. ఇన్ని డెలివరీలు రాష్ట్రంలోని ఏ సీహెచ్‌సీలోనూ జరగలేదని వైద్యులు చెబుతున్నారు.

మెరుగైన సౌకర్యాలతో వైద్యం..



ప్రభుత్వం దవాఖానలో అధునాతన యంత్రాలు, వసతులు కల్పించడంతో మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్, కలెక్టర్ సహకారంతో గర్భిణులకు ప్రతినెలా పరీక్షలు చేయడంతోపాటు ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవాలు చేస్తున్నాం. కేసీఆర్ కిట్లతోపాటు ఆర్థిక సహాయాన్ని అందించడంతోపాటు 102 వాహనంలో తిరిగి తల్లీబిడ్డను సురక్షితంగా వారి ఇంటికి పంపిస్తున్నాం.
– డాక్టర్ నర్సింహస్వామి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, వర్ధన్నపేట

పోరుకు ముందే ఏకగ్రీవం

- అందరూ కలిశారు.. ఐక్యతను చాటారు
- సల్పబండ తండా పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్ ఏకగ్రీవం
- నిజామాబాద్ జిల్లాలోనే మొదటిది..
- ఇక అధికారిక ప్రక్రియే తరువాయి



ఏకగ్రీవ సర్పంచ్‌గా నిర్ణయించి సర్మన్‌నాయక్‌ను సన్మానిస్తున్న నిజామాబాద్ జిల్లా సల్పబండ తండావాసులు

ధర్పల్లి: సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజే నిజామాబాద్ జిల్లాలో ఓ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం సల్పబండ తండా(ఎస్‌బీ తండా) నూతన గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇక అధికారిక ప్రక్రియ మిగిలిఉన్నది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని గ్రామస్థులు నూతన పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేసుకొని ఐక్యతను చాటారు. రాష్ట్రంలోనే ఈ సారి మొట్టమొదటగా ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీ ఇదే కావడం విశేషం. గతంలో దుబ్బాక గ్రామపరిధిలోని సల్పబండ తండా గతేడాది వడ్డెర కాలనీతో కలిసి నూతన పంచాయతీగా అవతరించింది. ఇదివరకు దుబ్బాక సర్పంచ్‌గా పనిచేసిన తండాకు చెందిన ధరావత్ సర్మన్ నాయక్‌ను సర్పంచ్‌గా, వడ్డెర కాలనీకి చెందిన వ్యక్తిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా తండా పెద్దలు, టీఆర్‌ఎస్ నాయకుడు శంకర్‌నాయక్, యువకులు సర్మన్‌నాయక్‌ను అభినందించారు.

ఎస్‌బీ తండా జనాభా 644..

సల్పబండ తండా(ఎస్‌బీ తండా) పంచాయతీ పరిధిలో వడ్డెర కాలనీ, తండా కలిపి మొత్తం 644 జనాభా ఉండగా, 295 మంది ఓటర్లు ఉన్నారు. 8వార్డులు ఉన్నాయి. ఎస్టీలు 369మంది ఉండగా, ఇతర కులాల వారు 275మంది ఉన్నారు. సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా గతేడాది 500, ఆపై జనాభా కలిగిన పంచాయతీలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గతేడాది నూతన పంచాయతీగా అవతరించిన సల్పబండ తండా పంచాయతీలో ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో పంచాయతీ పరిధిలోని వారంతా కలిసి, ఇదివరకు దుబ్బాక పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేసిన అనుభజ్ఞుడైన సర్మన్‌నాయక్ సర్పంచ్ అయితేనే బాగుంటుందని భావించారు. అంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో తండాను అభివృద్ధి చేసుకుంటామని ఈ సందర్భంగా సర్మన్‌నాయక్, తండా వాసులు తెలిపారు. ఇక అధికారిక ప్రక్రియ లాంఛనమే కానున్నది.



బీబీనగర్ ఎయిమ్స్ ఏర్పాటుకు శారద ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే పైళ్ల, కలెక్టర్ అనితారామచంద్రన్

ఎయిమ్స్‌కు తాత్కాలిక భవనం

పరిశీలించిన ఎంపీ బూర, ఎమ్మెల్యే పైళ్ల

భువనగిరిరూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిమ్స్‌కు తాత్కాలిక భవనం సమకూర్చడానికి అనంతారం గ్రామ సమీపంలోని శారద ఇంజినీరింగ్ కాలేజీని మంగళవారం ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికి ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ ప్రవేశాలు జరుగుతున్నందున శారద ఇంజినీరింగ్ కాలేజీ భవనాన్ని పరిశీలించినట్టు చెప్పారు.



లబ్ధిదారులకు సబ్సిడీపై మంజూరైన ద్విచక్ర వాహనాలను అందజేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, కలెక్టర్ శివలింగయ్య

మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం మత్స్యకార్మికుల సంక్షేమానికి అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరు డివిజన్ స్థాయిలో మత్స్యకారులకు మంజూరైన మోపెడు వాహనాలను మంగళవారం అమ్మాపురం రోడులో ఉన్న తిరుమలగార్డెన్‌లో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యతో కలిసి మత్స్యకార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్ల సహదేవ్, జాయింట్ కలెక్టర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే విందు

వనపర్తి అర్బన్: వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్లచెరువు (మినీట్యాంక్ బండ్) ఆయకట్టు రైతులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి జర్రిపోతుల మశమ్మ వద్ద వాగులో వస్తున్న జలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు విందు ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది రైతులు రాగా ఎమ్మెల్యే వారితో కలిసి భోజనం చేశారు. ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాలు వచ్చినప్పుడే నల్లచెరువులోకి కొద్దిపాటి నీళ్లు వచ్చేవని, దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వాటిని దూరం చేయాలనే కృష్ణా జలాలను నల్ల చెరువుకు తరలిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే చొరవను అభినందించారు.

'పాలమూరు' అవరోధాలను అధిగమిస్తాం

ప్రాజెక్టుల ప్రగతి నివేదికను సీఎం కేసీఆర్‌కు అందజేస్తాం

తెలంగాణ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్‌రెడ్డి



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ-1 టన్నెల్ వద్ద రిటైర్డు సీఈ శ్యాంప్రసాద్‌రెడ్డి, రిటైర్డు ఇంజినీర్లు

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల అవరోధాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని తెలంగాణ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 12.40 లక్షల ఎకరాలకు సాగునీరందించవచ్చని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రిటైర్డ్ ఇంజినీర్లు శ్యాంప్రసాద్‌రెడ్డి, ముత్యంరెడ్డి, చంద్రమౌళి, వెంకటేశ్, జగదీశ్వర్‌లతో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో పీఆర్‌ఎల్‌ఐ ప్రాజెక్టులో ప్యాకేజీ-1, టన్నెల్, ప్యాకేజీ- 2 అంజనగిరి రిజర్వాయర్, ప్యాకేజీ-3 మెయిన్ కెనాల్ పనులను పరిశీలించారు. ప్యాకేజీ-1లో 1.5 కిలోమీటర్ల టన్నెల్‌కుగాను 1300 మీటర్లు తవ్విన టన్నెల్‌లోకి వెళ్లి బృందం పరిశీలించింది. శ్యాంప్రసాద్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఏదుల రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిందని, భూములు కోల్పోయిన రైతులకు రావాల్సిన పరిహారం గురించి సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. శ్రీశైలం టన్నెల్‌తోపాటు ఎంజీకేఎల్‌ఐ లిఫ్ట్-3లో తలెత్తుతున్న సాంకేతిక లోపాలను బుధవారం పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మంగళ వారం సూర్యాపేటలో లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

101 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

సూర్యాపేట, నమస్తే తెలంగాణ: బంగారు తెలంగాణలో మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన 101 మంది లబ్ధిదారులకు రూ.89 లక్షల కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను, 14వ వార్డులో బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. తమ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సహాయం చేస్తూ అండగా నిలుస్తున్నారని గుర్తుచేశారు. రైతు బీమాతో భరోసా కల్పిస్తున్నదని చెప్పారు.

న్యూఇయర్ వేడుకల్లో అపశ్రుతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి.. పలువురికి గాయాలు





శ్రీకాంత్, దిగంబర్ (ఫైల్)



కరీంనగర్ జిల్లా మందాడిపల్లి శివారులో నుజ్జునుజ్జయిన కారు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: నూతన సంవత్సరం వేడుకల్లో అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం మందాడిపల్లి గ్రామసమీపంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంకటేశ్(25), కేఎస్ చక్రపారెడ్డి(31), రంజిత్(28) ఓ సీడ్‌కంపెనీలో పనిచేస్తున్నారు. వీరంతా న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొని తిరిగివస్తుండగా.. మందాడిపల్లి వద్ద కరీంనగర్ వైపు వెళ్తున్న గ్రానైట్ లారీ వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్, చక్రపారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా.. కారు నడుపుతున్న రంజిత్, లారీ డ్రైవర్ మోను రాథోడ్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లారు. వీరిని సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ వంగపహాడ్‌కి చెందిన ఆటో డ్రైవర్ దోమ అరుణ్ (28) సోమవారం రాత్రి స్నేహితులతో నూతన సంవత్సర వేడుకలను జరుపుకొన్నాడు. అనంతరం ఆటోలో స్నేహితులతో వస్తుండగా గ్రామశివారులోని మామిడితోట వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడగా అరుణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అరుణ్‌కు భార్య, ఆరు నెలల పాప ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

కోనాపూర్ శివారులో ఇద్దరు యువకులు మృతి..

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కోనాపూర్ శివారులో మంగళవారం తెల్లవారుజాము 3 గంటల ప్రాంతంలో బైకు అదుపుతప్పి పడిపోవడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. కోనాపూర్‌కు చెందిన శ్రీకాంత్, అవాజ్‌పల్లి తండాకు చెందిన దిగంబర్, నిజామాబాద్‌కు చెందిన హిమకేత్ తోటి స్నేహితులతో కలిసి సోమవారం కోనాపూర్ శివారులో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. విందు అనంతరం తెల్లవారుజామున శ్రీకాంత్, దిగంబర్, హిమకేత్ బైకుపై కోనాపూర్ బయలుదేరారు. గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్(22), దిగంబర్(23) అక్కడికక్కడే మృతిచెందారు. హిమకేత్‌కు తీవ్రగాయాలయ్యాయి.

వికారాబాద్ జిల్లాలో అదుపు తప్పి కారు బోల్తా..

వికారాబాద్ జిల్లా ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడటంతో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. షాపూర్‌నగర్‌లోని మల్లారెడ్డి వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న సోమేశ్, గోపాల్, మేగనాథ్, ప్రమోద్, సంకల్ప, విలుదరి, సిరి, మంజిత న్యూఇయర్ సందర్భంగా మద్యం సేవించి కారులో వెళ్తుండగా బోల్తా పడింది. సోమేశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

8 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

సీఎం కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్నాం.. ఎమ్మెల్యే గంగుల వెల్లడి



గంగుల కమలాకర్

కరీంనగర్ కల్చరల్: సమస్త లోక కల్యాణార్థం ఫిబ్రవరి 8 నుంచి 17వ తేదీవరకు కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్‌లోగల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ద్వితీయ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. మంగళవారం నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక మార్కెట్‌లోని వేంకటేశ్వరాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. చివరిరోజు 17న వేంకటేశ్వరస్వామి శోభాయాత్ర ఉంటుందన్నారు. 2 నుంచి 3వేల మంది కళాకారులు యాత్రలో పాల్గొంటారని, జబల్‌పూర్ బ్యాండ్ ఊరేగింపు ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాలకు సీఎం కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

కేటీపీఎస్‌లో నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తి

పాల్వంచ: కేటీపీఎస్ ఆరోదశలోని 11వ యూనిట్‌లో మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ఎకనమైజర్‌లో లీకేజీలు ఏర్పడి 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. డిసెంబర్ 22న కూడా ట్యూబ్ లీకేజీతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. తిరిగి అదే సమస్య తలెత్తడంతో ఇంజినీర్లు యూనిట్‌ను నిలిపి వేసి యుద్ధప్రాతిపదిన మరమ్మతులు చేపడుతున్నారు. సోమవారం నుంచే బాయిలర్‌లోని ట్యూబ్స్ లీకేజీలను గమనించిన ఇంజినీర్లు ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా ప్రయత్నం చేశారు. కానీ దాని తీవ్రత ఎక్కువగా ఉండటంతో యూనిట్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరమ్మతుల తర్వాత ఉత్పత్తి చేపడతామని ఆరో దశ ఎస్ఈ అనిల్‌కుమార్ తెలిపారు.

వృద్ధురాలు సజీవ దహనం

వెంకటాపూర్(జయశంకర్ భూపాలపల్లి): వృద్ధురాలు సజీవ దహనమైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ మండలం కేశవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చాతరాజుపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. చాతరాజుపల్లికి చెందిన ఎలగొండ సారక్క(75), ఆమె కొడుకు సంజీవ పూరి గుడిసెలో నివాసముంటున్నారు. సంజీవ ఇంట్లో సామగ్రి తీసుకొచ్చేందుకు కిరాణ దుకాణానికి వెళ్లాడు. ఈ క్రమంలో గుడిసెలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. లేవలేని స్థితిలో ఉన్న సారక్క మంటల్లో సజీవ దహనమైంది. కొడుకు సంజీవ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ దగ్ధం

కురవి: వ్యవసాయ పొలం నుంచి ట్రాక్టర్‌పై వరిగడ్డి తీసుకు వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి గడ్డితో సహా ట్రాక్టర్ దగ్ధమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం ఉప్పరిగూడెం శివారు హట్యతండా వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. బలపాల శివారు లింగ్యాతండాకు చెందిన ఓ రైతు తన పొలం నుంచి ట్రాక్టర్‌పై వరి గడ్డిని తోలుతున్నారు. తండాకు వస్తున్న క్రమంలో హట్యతండా వద్ద ప్రమాదవశాత్తు తీగలు ట్రాక్టర్‌కు తగలడంతో నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. డ్రైవర్ మాలోత్ కళ్యాణ్ తప్పించుకునే క్రమంలో స్వల్పంగా గాయపడగా మానుకోట ఏరియా దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్, ట్రక్కుతోపాటు గడ్డి కూడా పూర్తిగా కాలిపోయింది.



మంటల్లో కాలిపోతున్న వరిగడ్డి ట్రాక్టర్



మంగళ వారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎమ్మెల్సీ సలీం



మంగళ వారం టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్తున్న తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవి ప్రసాద్, టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి



టీజీవో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం తెలంగాణభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారులు బాధ్యతతో పనిచేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్నారని, ఈ నేపథ్యంలో నూతన సంవత్సరంలో అధికారులంతా ప్రజల కోసం మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీజీవో గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్. అధ్యక్షురాలు వీ మమత, ప్రధానకార్యదర్శి ఏ సత్యనారాయణ, రవీందర్‌కుమార్, సహదేవ్, రవీందర్‌రావు, విష్ణువర్దన్‌రావు, మధుసూదన్‌గౌడ్, వెంకటయ్య, బేగ్, కృష్ణయాదవ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మంగళ వారం తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన కేటీఆర్ యువసేన అధ్యక్షుడు ప్రవీణ్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

కేటీఆర్ యువసేనకు అవార్డు

- సామాజిక సేవలో పురస్కారం.. అధ్యక్షుడు ప్రవీణ్‌కు ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సామాజిక సేవా కార్యక్రమాల్లో కేటీఆర్ యువసేన అధ్యక్షుడు, తెలంగాణ ఔట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథుని ప్రవీణ్‌కు అవార్డు దక్కింది. మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో 12 విభాగాల్లో అవార్డులు ప్రకటించగా, సామాజిక సేవా కార్యక్రమాల అంశంలో కేటీఆర్ యువసేనను అవార్డుకు ఎంపికచేశారు. కేటీఆర్ యువసేన, తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. సేవా పురస్కారాన్ని మంగళవారం రవీంద్రభారతిలో కేటీఆర్ యువసేన అధ్యక్షుడు ప్రవీణ్‌కు ప్రదానం చేశారు. అనంతరం ఆయన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను కేటీఆర్ అభినందించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ కూడా ప్రవీణ్‌ను అభినందించారు.



అవార్డు ధ్రువీకరణ పత్రాన్ని చూపుతున్న కేటీఆర్ యువసేన అధ్యక్షుడు ప్రవీణ్, చిత్రంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

టీఆర్‌ఎస్ పాలనలో బీసీలకు భరోసా

ఆర్థికాభివృద్ధికి సబ్సిడీ రుణాలు • రాజకీయ, ప్రభుత్వ పదవుల్లో ప్రత్యేక ప్రాధాన్యం
కులవృత్తులకు పూర్వవైభవం • కొత్తగా 142 బీసీ గురుకులాల ఏర్పాటు
• వచ్చే ఏడాది మరో 119 బీసీ గురుకులాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 52శాతం ఉన్న బీసీలకు టీఆర్‌ఎస్ పాలనలో భరోసా కల్పించారు. సీఎం కే చంద్రశేఖర్‌రావు దేశంలో ఎక్కడాలేనివిధంగా బీసీల సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని రాష్ట్రంలో బీసీ సంక్షేమ హాస్టళ్లను బలోపేతం చేయడమే కాకుండా మహాత్మా జ్యోతిబాపూలే పేరిట బీసీ గురుకులాలను ఏర్పాటుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి 21 బీసీ గురుకులాలు ఉండగా, టీఆర్‌ఎస్ పాలనలో కొత్తగా 142 బీసీ గురుకులాలను ఏర్పాటుచేశారు. వచ్చే విద్యా సంవత్సరం మరో 119 బీసీ గురుకులాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్‌లో ప్రతి మండలానికి ఒక బీసీ గురుకులాన్ని ఏర్పాటుచేయాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. వాటిల్లో నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఒక్కో విద్యార్థిపై రూ.లక్షవరకు ఖర్చు చేస్తున్నారు. సివిల్స్, గ్రూప్-1, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నించే అభ్యర్థుల కోసం బీసీ స్టడీ సర్కిళ్లను నిర్వహిస్తున్నారు.



వందశాతం సబ్సిడీ రుణాలు

రాష్ట్రంలోని బీసీ, ఎంబీసీ కుటుంబాల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నది. ఎన్నడూ లేనంతగా బీసీలకోసం 2018-19 వార్షిక బడ్జెట్లో రూ.5,919 కోట్లు కేటాయించగా, ఎంబీసీ అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు నిర్ణయించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కులాలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు వందశాతం సబ్సిడీ రుణాలను అందజేసింది. బ్యాంకు లింకేజీ లేకుండా సబ్సిడీ రుణాలను అమలుచేసిన ఘనత టీఆర్‌ఎస్ సర్కారుదే. సబ్సిడీ రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ న్యాయంచేసేలా ప్రభుత్వం వందశాతం సబ్సిడీతో రూ.50 వేలు రుణాన్ని అందజేసింది. సీఎం కేసీఆర్ పాలనలో రాజకీయ పదవుల్లోనూ బీసీలకు పెద్దపీటవేశారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించారు. లెజిస్లేచర్‌లో బీసీలకు 33శాతం రిజర్వేషన్ పెట్టాలని దేశంలోనే మొదటిసారిగా తీర్మానంచేసింది కూడా టీఆర్‌ఎస్ ప్రభుత్వమే. అది కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని ప్రవేశపెట్టి బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని అందులోనే నిర్ణయించారు. రాష్ట్రస్థాయి శాసనసభ, శాసనమండలి పదవుల్లో, కార్పొరేషన్ పదవులు, జిల్లా, మండలస్థాయి రాజకీయ పదవుల్లోనూ సీఎం కేసీఆర్ బీసీలకు ప్రాధాన్యం కల్పించారు. పార్టీ పదవుల్లోనూ ప్రాధాన్యం ఇచ్చారు.

కులవృత్తుల పురోభివృద్ధికి తోడ్పాటు

స్వరాష్ట్రంలో కులవృత్తులకు ప్రాధాన్యం పెరిగింది. బీసీ, ఎంబీసీ కుల వృత్తులవారికి అధునాతన పద్ధతులతో తమ వృత్తిని కొనసాగించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా యూనిట్ల స్థాపనకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. రూ.వెయ్యి కోట్ల నిధితో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వమే. గొల్లకురుమలకు 74 లక్షల గొర్రెలు పంపిణీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల పురోభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లోని రజక, నాయీబ్రాహ్మణ కులవృత్తిదారులు ఆర్థిక ప్రగతిసాధించేందుకు అవకాశం ఏర్పడింది. కుమ్మరులు, మేదర, ఇతర వృత్తిదారులు అధునాతన రీతిలో తమ వృత్తిని కొనసాగించేందుకు నిధులు కేటాయించడమేకాకుండా ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

సీఎం కేసీఆర్‌తోనే రజకుల అభివృద్ధి



సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణలోని రజకుల అభివృద్ధి సాధ్యమవుతున్నది. బడ్జెట్లో ఏటా రూ.250 కోట్లు రజకుల అభివృద్ధి, సంక్షేమానికి కేటాయించడం హర్షణీయం. రాష్ట్ర రజక ఫెడరేషన్‌కు అనుబంధంగా 3,200 రజక సొసైటీలు ఏర్పాటుచేసుకున్నాం. 703 మంది రజకులకు రూ.5.77 కోట్లు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఖర్చు చేసింది.

-కొండూరు సత్యనారాయణ,
తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



వందశాతం సబ్సిడీతో రుణాలను అందజేస్తున్న కేసీఆర్ రెండోసారి సీఎం కావడం సంతోషంగా ఉన్నది. అధునాతన సెలూన్ల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించడం కేసీఆర్‌వల్లే సాధ్యమైంది. నాయీబ్రాహ్మణుల భవన్‌కు ప్రభుత్వం ఎకరం భూమి, రూ.2 కోట్లు మంజూరు చేసింది. వృత్తిదారుల కోసం రూ.200 కోట్లు కేటాయించారు. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

- రాసమల్ల బాల్ కిషన్,
నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సంచార జాతులకు అండ



రాష్ట్రంలోని సంచార జాతులకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారు. ఏండ్లతరబడి వివక్షకు గురైన సంచార జాతులను రెండోసారి సీఎం అయిన కేసీఆర్ సారే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తారు. సంచార జాతులను ఎంబీసీ జాబితాలో చేర్చి, ఫెడరేషన్ ఏర్పాటు చేసి, ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం కేసీఆర్ కృషి గొప్పది.

- మిట్టపల్లి జగ్గయ్య,
వీరభద్రీయ కుల సంఘం రాష్ట్ర నాయకుడు

పంచాయతీకి చాటింపు

మొదటిపేజీ తరువాయి...

ఉప సర్పంచ్ ఎన్నిక జరుగుతుందని వివరించారు.

పక్కాగా ప్రచార ఖర్చు లెక్కింపు

పోటీ చేసే అభ్యర్థులు కచ్చితంగా ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని, ఉల్లంఘించినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని నాగిరెడ్డి హెచ్చరించారు. అభ్యర్థుల తుది జాబితా ప్రదర్శించిన తర్వాతే ప్రచారం ప్రారంభించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే మైక్‌లు వినియోగించాలని, వాటికి ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. నూతన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఎన్నికల వ్యయాన్ని సవరించామన్నారు. ప్రచార ఖర్చు జనాభా ఐదువేలు దాటిన పంచాయతీల్లో గరిష్ఠంగా సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50 లక్షలు, వార్డు స్థానాల అభ్యర్థులు రూ.50 వేలు, జనాభా ఐదువేలలోపు ఉన్నచోట్ల గరిష్ఠంగా సర్పచ్ అభ్యర్థులు రూ.1.50 లక్షలు, వార్డు స్థానాల అభ్యర్థులు రూ.30 వేలు మాత్రమే ఉండాలన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఖర్చు చూపించకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. గత ఎన్నికల్లో ఎన్నికల ఖర్చు చూపించని తొమ్మిది మంది సర్పంచ్‌లను, 1300 మంది వార్డు సభ్యులను పదవి నుంచి తొలిగించామని చెప్పారు. 1,266 మంది సర్పంచ్, 311 మంది జెడ్పీటీసీ, 1331 మంది ఎంపీటీసీ అభ్యర్థులపై మూడేండ్లు ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేశామని వెల్లడించారు. సున్నితమైన, సమస్యాత్మక గ్రామాలను గుర్తిస్తున్నామని, ఆయాచోట్ల అదనంగా పోలీసు బలగాలను మోహరిస్తామన్నారు.

మొత్తం బ్యాలెట్ పేపర్లు	3,36,34,279
20 శాతం అదనం	92,223
ఇంక్ సిరా	1,55,000 బాటిళ్లు
సీల్డ్ పేపర్లు	5,50,000

సరిపడా బ్యాలెట్ పత్రాలు

గత ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మొత్తం 3,36,34,279 బ్యాలెట్ పేపర్లు ముద్రించామని, అదనంగా మరో 20 శాతం (92,223) అందుబాటులో ఉంచుతామని తెలిపారు. తెలుగు అక్షరమాల ప్రకారం అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని చెప్పారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా 200 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్ అభ్యర్థులకు తెలుపు రంగు, వార్డు సభ్యులకు పింక్ కలర్ బ్యాలెట్ పేపర్లు కేటాయించామన్నారు. బ్యాలెట్ పత్రాల్లో అభ్యర్థి పేరుగానీ, ఫొటోగానీ ఉండవని కేవలం గుర్తులు మాత్రమే కేటాయిస్తామన్నారు. పంచాయతీలవారీగా సీరియల్ నంబర్లు, కోడ్ నంబర్లు మండలాల వారీగా రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరిస్తారని, వాటిని పంచాయతీ బ్యాలెట్ పేపర్లపై వేయాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ పత్రాల కట్టల వెనుక గ్రామ పంచాయతీ పేరు, వార్డు సంఖ్య, వినియోగించిన బ్యాలెట్ పత్రాల వివరాలన్నీ స్పష్టంగా ఉండాలని సూచించారు.

30 గుర్తులు.. చివరగా నోటా

ఈసారి సర్పంచ్ అభ్యర్థుల కోసం 30 గుర్తులను, వార్డు స్థానాలకు 20 గుర్తులను కేటాయించారు. సర్పచ్ అభ్యర్థులకు వరుసగా.. ఉంగరం, కత్తెర, బ్యాట్, కప్పు సాసర, విమానము, బంతి, షటిల్, కుర్చీ, వంకాయ, నల్లబోర్డు, కొబ్బరి కాయ, లేడి పర్సు, మామిడి కాయ, సీసా, బకెట్, బుట్ట, దువ్వెన, అరటిపండు, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, క్యారెట్, గొడ్డలి, గాలి బుడగ, బిస్కట్, వేణువు (పిల్లనగ్రోవి), ఫోర్కు, చెంచా గుర్తులను ముద్రించనున్నారు. వార్డు స్థానాల్లో అభ్యర్థుల కోసం వరుసగా.. జగ్గు, గౌను, గ్యాస్ పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, గాజు గ్లాసు, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటీనా, గరాటా, మూకుడు, కేటిల్ (చాయ్‌కేతిరి), విల్లు బాణం, కవరు, హాకీ స్టిక్ మరియు బంతి, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పోస్టు డబ్బా, విద్యుత్ స్తంభం గుర్తులను కేటాయించారు. ఒక్క బ్యాలెట్ పేపర్‌లో 8 గుర్తులతో పాటు నోటా గుర్తుకు స్థానం ఉంటుంది. ఈ సంఖ్య దాటితే మరో బ్యాలెట్ పేపర్‌ను జతచేస్తారు. నోటా గుర్తు చివర్లో ఉంటుంది.



పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వివరిస్తున్న ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి తదితరులు

అసెంబ్లీ ఓటరు జాబితా అనుసరించి..

అసెంబ్లీ ఓటరు జాబితాను అనుసరించి పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా తయారు చేశామని, సప్లిమెంటరీ జాబితాను విడుదలచేశామని ఎన్నికల కమిషనర్ తెలిపారు. మే నెలలో సిద్ధం చేసిన ఓటర్ల జాబితా ప్రకారం గ్రామీణ ప్రాంతంలో పురుష ఓటర్లు 68,50,309 మంది, స్త్రీలు 68,66,300 మంది, ఇతరులు 860 మంది ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సప్లిమెంటరీ జాబితాలో మరో 16,86,682 మంది జమ అయ్యారని, పరిశీలన అనంతరం ఇందులో నుంచి 4,52,093 మందిని తొలిగించామన్నారు. మొత్తం 1,49,52,058 మంది ఓటర్లున్నారని వివరించారు. అన్ని రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా ఇచ్చామన్నారు. జనవరి 1వ తేదీ వరకు నమోదైన ఓటర్ల జాబితాతో రెండో సప్లిమెంటరీ జాబితాను మూడు రోజుల్లో విడుదల చేస్తామని చెప్పారు. ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారు మాత్రమే పోలింగ్ బూత్‌ల్లోకి వెళ్లాలని స్పష్టం చేశారు. ఓటర్లు 18 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదేని ఒకటి చూపించాలన్నారు.

బ్యాంకు ఖాతా నుంచే వ్యయం

అభ్యర్థులు తమ ప్రచార ఖర్చును బ్యాంకు ఖాతా నుంచే వెచ్చించాలని నాగిరెడ్డి స్పష్టంచేశారు. ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు మండలానికి నాలుగైదు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయనున్నారు. వారు గ్రామాల్లో తిరుగుతూ ప్రచార తీరును పరిశీలిస్తారు. వీడియో చిత్రీకరణ, అభ్యర్థుల వెంట తిరిగే జనం, వారి భోజనం, టిఫిన్ ఖర్చులు, జెండాలు, వాహనాల ఖర్చులపై అంచనా వేస్తారు. కరపత్రాలు, ప్రకటనలపైనా ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, మేయర్లకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని పోలింగ్ ఏజెంట్లుగా నియమించవద్దని, గుర్తింపు కార్డులు ఉన్న సిబ్బందినే పోలింగ్ బూత్‌లోకి వెళ్లాలన్నారు.

19 పంచాయతీలకు మినహాయింపు

రాష్ట్రంలోని 19 గ్రామ పంచాయతీలకు, వాటి పరిధిలోని 184 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం లేదు. ఇందులో 17 పంచాయతీలకు ఇంకా పదవీకాలం పూర్తికాలేదు. మరో రెండు పంచాయతీలకు సంబంధించి కోర్టులో కేసులు నడుస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం కొత్తూరు, తిమ్మాపూర్, ఆదిలాబాద్ జిల్లా బేల మండలం కొబాయి, మంగరూర్, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బండమీదిపల్లి, కావేరమ్మపేట, శంకరయ్యపల్లి తండా, నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందంపల్లి, చందుపట్ల, కాడపర్తి, నీలిబండ, నోముల, తాటికల్, గొల్లగూడెం, బీమని మండలం లక్ష్మీపూర్, పెద్దపేట, వేంపల్లి మండలం చామన్‌పల్లి, వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామ పంచాయతీలకు ఇంకా పదవీకాలం పూర్తికాలేదు. కోర్టు కేసుల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నాయినాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు.

ప్రచార ఖర్చు

పదవి	జనాభా 5వేలు దాటితే	ఐదువేలలోపు
సర్పంచ్	రూ. 2.50లక్షలు	రూ.1.50 లక్షలు
వార్డుమెంబర్	రూ.50 వేలు	రూ. 30 వేలు

డిపాజిట్లు

పదవి	ఎస్సీ,ఎస్టీ, బీసీలకు(రూ.ల్లో)	ఇతరులకు
సర్పంచ్	1,000	2,000
వార్డుమెంబర్	250	500

ప్రక్రియ	మొదటి విడుత	రెండో విడుత	మూడో విడుత
నామినేషన్ల స్వీకరణ	జనవరి 7	జనవరి 11	జనవరి 16
తుదిగడువు	జనవరి 9	జనవరి 13	జనవరి 18
నామినేషన్ల పరిశీలన	జనవరి 10	జనవరి 14	జనవరి 19
ప్రాథమిక అభ్యర్థుల జాబితా	జనవరి 10 సాయంత్రం	జనవరి 14 సాయంత్రం	జనవరి 19 సాయంత్రం
అభ్యంతరాల స్వీకరణ	జనవరి 11	జనవరి 15	జనవరి 20
అభ్యంతరాల పరిశీలన	జనవరి 12	జనవరి 16	జనవరి 21
నామినేషన్ల విత్‌డ్రా	జనవరి 13	జనవరి 17	జనవరి 22
అభ్యర్థుల తుదిజాబితా	జనవరి 13 సాయంత్రం	జనవరి 17 సాయంత్రం	జనవరి 22 సాయంత్రం
పోలింగ్	జనవరి 21	జనవరి 25	జనవరి 30
లెక్కింపు	జనవరి 21	జనవరి 25	జనవరి 30
ఉప సర్పంచ్ ఎన్నిక	జనవరి 21	జనవరి 25	జనవరి 30

★ పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుంది
★ కౌంటింగ్ పోలింగ్ జరిగిన రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభం అవుతుంది.
★ ఉప సర్పంచ్ ఎన్నిక కౌంటింగ్ ముగిసిన తర్వాత జరుగుతుంది.

అబ్జర్వర్లుగా 26 మంది సీనియర్ ఐఏఎస్‌లు

పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు 26 మంది సీనియర్ ఐఏఎస్‌లకు బాధ్యతలు అప్పగించినట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వీరు ఎన్నికల సంఘం తరుపున డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నట్లు భావించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జనరల్ అబ్జర్వర్లుగా నియమించినవారిలో టూరి జం కార్యదర్శి బుర్రా వెంకటేశం, గిరిజనాభివృద్ధి సంస్థ కార్యదర్శి బెన్హర్ మహేశ్‌దత్ ఎక్కా, హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ ఎల్ శశిధర్, హాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్ ఎండీ శైలజారామయ్యర్, ఇండస్ట్రీస్ కమిషనర్ అహ్మద్‌నదీమ్, బీసీ వెల్ఫేర్ కమిషనర్ అనితారాజేంద్ర, అగ్రికల్చర్ కమిషనర్ రాహుల్‌బొజ్జా, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ దినకర్‌బాబు, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ క్రిస్టినాజడ్ చోంగ్తూ, గెజిటీర్స్ కమిషనర్ జీ కిషన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్ టీ చిరంజీవులు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ పీ సత్యనారాయణరెడ్డి, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ బాలమాయాదేవి, సీసీఎల్‌సీ డైరెక్టర్ వాకాటి కరుణ, అయిల్‌ఫెడ్ ఎండీ కే నిర్మల, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అడిషనల్ సెక్రెటరీ ఎల్ శర్మణ్, హోం జాయింట్ సెక్రెటరీ ఎం చంపాలాల్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ జాయింట్ డైరెక్టర్ విజేంద్ర, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ కేవై నాయక్, సెర్ప్ సీఈవో పౌసుమీ బసు, ప్రోటోకాల్ జాయింట్ సెక్రెటరీ ఎస్ అర్విందర్‌సింగ్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్ ప్రీతి మీన, హెల్త్ అండ్ ఫ్యామిటీ వెల్ఫేర్ డైరెక్టర్ అలుగు వర్షిణిలను డిప్యూటేషన్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘానికి కేటాయించారు.



మంగళ వారం విజయవాడలో కొత్త హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేసిన సీ ప్రవీణ్‌కుమార్‌తో గవర్నర్ నరసింహన్, ఏపీ సీఎం చంద్రబాబు తదితరులు

ఏపీ చీఫ్ జస్టిస్ ప్రమాణస్వీకారం

అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సీ ప్రవీణ్‌కుమార్ ప్రమాణం స్వీకరించారు. మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఉదయం 10.30 గంటలకు గవర్నర్ నరసింహన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యకమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తితోపాటు 13 మంది న్యాయమూర్తులు కూడా ప్రమాణం చేశారు. దీంతో ఆంధ్రపదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పూర్తిస్థాయిలో ఉనికిలోకి వచ్చినట్లయింది. ఉమ్మడి హైకోర్టులో 3.4 లక్షల వ్యాజ్యాలుండగా.. అందులో 70 శాతం వరకు కేసులు ఏపీకి చెందినవే. ఏపీ హైకోర్టుకు మంజూరైన న్యాయమూర్తుల పోస్టులు 37 కాగా.. ప్రస్తుతం ఉన్నవారు 14 మంది.

రాష్ట్ర విభజన పూర్తయినట్టే: చంద్రబాబు

అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇప్పుడు అమరావతికి రావడంతో రాష్ట్ర విభజన పూర్తయిందని భావిస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. మంగళవారం తాత్కాలిక హైకోర్టు ప్రారంభం అనంతరం ఆయన మాట్లాడుతూ.. 9, 10 షెడ్యూల్‌లోని నిధులు, ఆస్తుల విభజన తప్ప తరలింపు మొత్తం పూర్తయినట్టేనన్నారు. ఇక ఫిజికల్‌గా హైదరాబాద్ నుంచి వచ్చేది ఏమీలేనట్టేనని చెప్పారు. అమరావతికి హైకోర్టు తరలించడానికి చాలా తక్కువ సమయం ఇచ్చారని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఏపీ హైకోర్టును దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాల్సి ఉందని, హైకోర్టు విధుల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన చెప్పారు. విభజన సమస్యలున్నా అన్నింటినీ అధిగమిస్తున్నామని, సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకొని ముందుకెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. అందరి సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు.

నేను పవన్‌తో కలిస్తే వైసీపీకి ఏం ఇబ్బంది?

- విచిత్రంగా వ్యాఖ్యానించిన ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, నమస్తే తెలంగాణ: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌పై ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను పవన్‌కల్యాణ్‌తో కలిస్తే వైసీపీకి వచ్చే ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. పవన్‌ను అనవసరంగా విమర్శిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌తో కలిసి పోటీచేస్తారా అన్న ప్రశ్నకు ఆయన నవ్వుతూ సమాధానం దాటవేశారు. పవన్‌తో కలిసి పోటీ చేసేదిలేదని స్పష్టం చేయకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుందని చంద్రబాబు ప్రశ్నించారు. మోదీ, జైట్లీ కలిసి ప్రమోట్ చేస్తున్నదే ఈ ఫెడరల్ ఫ్రంట్ అని దుయ్యబట్టారు. మహాకూటమి విఫలమయిందని, చంద్రబాబు ఆక్రోశంతో మాట్లాడుతున్నారని ఏఎన్ఐతో ముఖాముఖిలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్పందించారు. ప్రధాని నరేంద్రమోదీ వల్ల దేశానికి ఏం లాభం జరిగిందో చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. నోట్ల రద్దు, జీఎస్టీతో ఆర్థికాభివృద్ధి ఏం సాధించారు? అని ప్రశ్నించారు. దేశ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.





నూతన సంవత్సరం సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. దాదాపు లక్షా 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే దర్శనానికి అనుమతించారు. తర్వాత రద్దీ పెరగడంతో గర్భగుడి దర్శనాన్ని నిలిపివేసి రెండువరుసల్లో మహాద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు.

నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లోని బిర్లా మందిర్‌కు మంగళవారం తరలివచ్చిన భక్తులు

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేలో మరో ర్యాంపు

- రూ.36 కోట్లతో హెచ్ఎండీఏ ప్రతిపాదనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేలో మరో ర్యాంపు ఏర్పాటుకు హెచ్ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సులువుగా వెళ్లేందుకు వీలుగా మాసబ్‌ట్యాంక్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు 11.6 కిలోమీటర్ల పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేను గతంలోనే అందుబాటులోకి తీసుకొచ్చారు. లక్ష్మీనగర్, బుద్వేల్, ఆరాంఘర్ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ లేకుండా ఉండేందుకు ఇప్పటికే మూడు ర్యాంపులు ఏర్పాటుచేశారు. ఇందులో ప్రధానంగా ర్యాంపులు (ఎగువ ర్యాంపు/దిగువ ర్యాంపు)లు కీలకంగా మారాయి. ఈ మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టోలీచౌకీ, మెహిదీపట్నం చేరుకునే వాహనాలు మాసబ్‌ట్యాంక్ వరకు వచ్చి మళ్లీ యూటర్న్ ద్వారా మెహిదీపట్నం జంక్షన్‌కు రావాల్సి వస్తుండటంతోపాటు ప్రధానంగా అత్తాపూర్ నుంచి మెహిదీపట్నం మార్గంలో ట్రాఫిక్ అత్యధికంగా ఉంటున్నదని హెచ్ఎండీఏ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే హైదర్‌గూడ సమీపంలో మరో ర్యాంపు (ఎగువ/దిగువ) అవసరమని నిర్ణయించి ప్రతిపాదనలు సిద్ధంచేశారు. రూ.36 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రతిపాదనపై పరిపాలన అనుమతుల కోసం హెచ్ఎండీఏ ప్రభుత్వానికి అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నది. త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురానున్నది.



గవర్నర్ నరసింహన్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకులాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయులుగౌడ్ తదితరులు

రాజ్‌భవన్‌లో గవర్నర్ దర్బార్

- ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు
- గవర్నర్ దర్బార్‌లో సందడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్‌భవన్‌లో కొత్త సంవత్సర వేడుకల కోలాహలం నెలకొన్నది. గవర్నర్ నరసింహన్ దంపతులు దర్బార్‌హాలులో ప్రముఖులతోపాటు సాధారణ జనంతో కలిసి ఉత్సాహంగా గడిపారు. హోంమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, సీఐఎస్ఎఫ్ అదనపు డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ అంజనీకుమార్, అదనపు పోలీస్ కమిషనర్ శిఖాగోయల్, రాచకొండ సీపీ మహేశ్‌భగవత్, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకులాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయులు గౌడ్ తదితరులు గవర్నర్‌ను కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌భవన్ ఉద్యోగులు, గవర్నర్ సలహాదారులు ఏకే మహంతి, ఏపీవీఎన్ శర్మ, ప్రిన్సిపల్ సెక్రెటరీ హర్‌ప్రీత్‌సింగ్, లైజన్ ఆఫీసర్ విద్యాసాగర్ తదితరులు గవర్నర్ దంపతుల చేత కేక్ కట్ చేయించారు. అనంతరం గవర్నర్ విలేకరులతో మాట్లాడుతూ రెండు తెలుగురాష్ట్రాల ప్రజలు సుఖ, సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న పెండింగ్ సమస్యల్లో చాలా పరిష్కారమమ్యాయని తెలిపారు. మిగిలి ఉన్నకొన్ని చిన్న సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని చెప్పారు.



నూతన సంవత్సరం సందర్భంగా రాజ్‌భవన్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నుమాయిష్ జోష్!





మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నుమాయిష్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్. నుమాయిష్‌లో సందర్శకుల సందడి

- ప్రారంభించిన హోంమంత్రి మహమూద్ అలీ
- తొలిరోజే 3 వేల మంది సందర్శన
- 5న మహిళలకు మాత్రమే ప్రవేశం
- 31న పాఠశాల విద్యార్థులకు ఉచితం

హైదరాబాద్ సిటీబ్యూరో/అబిడ్స్, నమస్తే తెలంగాణ: ప్రజలను అలరించే హైదరాబాద్ నుమాయిష్ ప్రారంభమైంది. ఉస్మానియా గ్రాడ్యుయేషన్ అసోసియేషన్, నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 79వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను హోంమంత్రి మహమూద్ అలీ, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మంగళవారం ప్రారంభించారు. ఇప్పటికే పలు స్టాళ్ల నిర్మాణాలు పూర్తికావడంతోపాటు కొన్ని ఉత్పత్తులను సందర్శకులకు అందుబాటులో ఉంచారు. 46 రోజులపాటు కొనసాగే ఎగ్జిబిషన్‌లో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల ఉత్పత్తుల విక్రయాలు చేపడుతారు. ఎగ్జిబిషన్ నిర్వహణకు ప్రత్యేక భద్రత ఏర్పాటుచేశారు. వెల్‌బేబీ షో, మహిళలకు వంటల పోటీలతోపాటు నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరిస్తాయి. జనవరి 5న మహిళలు మాత్రమే ఎగ్జిబిషన్‌ను సందర్శించే వీలు కల్పించగా, 14 ఏండ్లలోపు పాఠశాల విద్యార్థులకు 31న ఉచిత ప్రవేశం కల్పిస్తారు. గత ఏడాది మాదిరిగానే ప్రవేశ రుసుం రూ.30, రైలు చార్జీని రూ.10గా నిర్ణయించారు. మొదటి రోజు 3 వేల మంది సందరర్శకులు వచ్చారు.

అభివృద్ధిలో తెలంగాణదే అగ్రస్థానం

అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మంగళవారం ఎగ్జిబిషన్ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసర్కార్ ముందస్తు ఆలోచనతో 1938లో పరిశ్రమల ద్వారానే ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిందని, వచ్చే రాబడిని విద్యాభివృద్ధికి ఖర్చు చేసిందని గుర్తుచేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 18 విద్యాసంస్థల్లో వేలమంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. సందర్శకులకు ఇబ్బంది కలుగకుండా పరిశుభ్రత, తాగునీటి వసతికి వలంటీర్లను నియమించామని, వాహనాల పార్కింగ్ ఫీజును ఎత్తివేశామని తెలిపారు. గతేడాది 25 లక్షల మంది సందర్శించారని, ఈసారి 30 లక్షల మందికి పైగా సందర్శిస్తారని అంచనా వేశామని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ నిజాం హయాంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తులను పరిచయం చేయాలనే గొప్ప ఆశయంతో ఎగ్జిబిషన్ సొసైటీని వేదికగా చేశారన్నారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశం నివ్వెరపోయేలా కొత్త ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీని తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. ఆసియాలోనే మొదటగా బాలికలకు కస్తూ ర్బా పాలిటెక్నిక్ కాలేజీని స్థాపించిన ఘనత సొసైటీదని, ఇలాంటి కాలేజీలకు మరిన్ని నిధులు కేటాయించనున్నట్టు వివరించారు. తొలిసారి నాలుగంచెల రక్షణ విధానాన్ని ప్రవేశపెట్టామని, ఎగ్జిబిషన్ చరిత్రలో తొలిసారిగా మెట్రో రైలును లింక్ చేశామని చెప్పారు. సొసైటీ కార్యదర్శి జీవీ రంగారెడ్డి మాట్లాడుతూ వంద స్టాళ్లతో పబ్లిక్ గార్డెన్‌లో మొదలై నేడు 2,500 స్టాళ్లు ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగిందన్నారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకుల కోసం మొబైల్ యాప్, టాయిలెట్స్, ఫుడ్, ఉచిత వైఫై తదితర ఏర్పాట్లను చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బీ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి బీ సురేందర్ రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్ పాపయ్య చక్రవర్తి, ఎన్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల స్థలం తనఖా

- రెండుకోట్లు లోన్ తీసుకున్న ప్రైవేటు కంపెనీ
- మరొకరి స్థలం చూపించి మరో ఇద్దరు వ్యాపారుల మోసం
- మహారాష్ట్ర బ్యాంకుకు రూ.4 కోట్లు టోకరా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నలుగురు వ్యాపారులు ఖైరతాబాద్‌లోని మహారాష్ట్ర బ్యాంకుకు రూ.4 కోట్లు టోకరావేశారు. ఇద్దరు వ్యాపారులు ఓ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని తనఖాపెట్టి రూ.2 కోట్లు కొల్లగొడితే.. మరో ఇద్దరు వేరే వ్యక్తికి చెందిన స్థలాన్ని తనదిగా చూపి రూ.2 కోట్ల రుణం పొందారు. వీటిపై బ్యాంకు జోనల్ మేనేజర్ ఫిర్యాదుతో సీసీఎస్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు. ముషీరాబాద్ పరిధిలోని గోల్కొండ క్రాస్‌రోడ్డులో ఉన్న బేకీస్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ పీసపాటి నారాయణ, సంస్థ డైరెక్టర్ రాయపూడి రమాదేవి కలిసి ఖైరతాబాద్‌లోని మహారాష్ట్ర బ్యాంకు శాఖలో రుణం కోసం దరఖాస్తుచేశారు. తమ సంస్థ పేరుతో భహలోల్ ఖాన్‌గూడలోని సర్వేనంబర్ 155లో 500 గజాల స్థలంలో ఇల్లు ఉన్నదని చెప్పి, రిజిస్ట్రేషన్ సేల్‌డీడ్‌ను తనఖా పెట్టారు. 2013 ఫిబ్రవరిలో రూ.2 కోట్ల రుణం పొందారు. కొన్ని రోజుల తర్వాత వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు ఆరాతీసి ఎన్‌పీఏ ఖాతాగా గుర్తించారు. నిబంధనల ప్రకారం తనఖా పెట్టిన ఆస్తిని వేలం వేసేందుకు ప్రయత్నించగా.. ఆ స్థలం రహమాన్ ఎలిమెంటరీ గవర్నమెంట్ స్కూల్‌కు సంబంధించినదిగా అమీర్‌పేట తహసీల్దార్ నిర్ధారించారు.

ప్రైవేట్ వ్యక్తి స్థలాన్ని..

అన్నా ఇకో లాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ శానిటరీ నాప్‌కిన్స్, మెటర్నిటీ ప్యాడ్‌లు తయారుచేస్తుంది. ఈ సంస్థ డైరెక్టర్లు గప్త శ్రీకర్, యెలిమాలి వెంకటేశ్ రుణం కోసం ఖైరతాబాద్‌లోని మహారాష్ట్ర బ్యాంకు శాఖలో సంప్రదించారు. ఎస్సార్‌నగర్ పరిధిలోని బీకేగూడలో తమకు 500 గజాల స్థలంలో ఇల్లు ఉన్నదంటూ ప్యానల్ అడ్వకేట్‌తో లీగల్ ఒపీనియన్‌ను బ్యాంకుకు అందించారు. దీంతో బ్యాంకు వారికి 2013 ఫిబ్రవరిలో రూ.2 కోట్లు మంజూరుచేసింది. ఆ తర్వాత వారు వాయిదాలు చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు తనఖా పెట్టిన ఆస్తిని వేలం వేసే ప్రక్రియను మొదలుపెట్టారు. డాక్యుమెంట్లను అమీర్‌పేట తహసీల్దార్‌కు పంపించి ఆ ఆస్తులను డిమార్క్ చేయాలని కోరారు. అయితే వారు చూపెట్టిన స్థలం సయ్యద్ పటేల్ భాషా అనే వ్యక్తికి చెందిన స్థలంగా తేలింది. నకిలీ పత్రాలతో బ్యాంకును మోసం చేశారని తేలింది. ఈ రెండు ఘటనలపై బ్యాంకు జోనల్ మేనేజర్ రాధే శ్యామ్ బన్సల్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంపరింగ్ జరిగిందనడం సరికాదు

- కూటమి నేతలు కేసీఆర్ రాజకీయ బలాన్ని తక్కువగా అంచనావేశారు
- వ్యూహంలో విఫలం.. సమన్వయలోపం.. ప్రచారంలో జాప్యం ఓటమికి కారణాలు
- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: శాసనసభ ఎన్నికల్లో తమ అభ్యర్థుల ఘోర పరాజయానికి ప్రజాకూటమిలో సమన్వయలోపం, ప్రచారంలో జాప్యం ప్రధాన కారణాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) ట్యాంపరింగ్ వల్లే టీఆర్ఎస్ గెలిచిందనడం సరికాదని ఆయన స్పష్టంచేశారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు సరైన విధంగా వ్యవహరించలేదని ఆరోపించారు. మంగళవారం ఆయన టీజేఎస్ కార్యాలయంలో విలేకరులతో చిట్‌చాట్ చేశారు. ప్రజాకూటమి ఏర్పాటులో జాప్యం, సమన్వయలోపంతో చాలాచోట్ల పరాజయం పాలుకావాల్సి వచ్చిందని తెలిపారు. ప్రచారంలో జాప్యం జరుగుతున్నదని తాను అప్రమత్తంచేసినా కూటమిలో ఇతర పార్టీల నాయకులు మేల్కొనలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం విషయంలో నిర్లక్ష్యం వహించిందని చెప్పారు. ప్రచారానికి 15 రోజులు చాలని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వారంరోజులు చాలని టీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ అన్నారని వివరించారు. కూటమి కూర్పు కుదిరే సరికే పుణ్యకాలం కాస్త గడిచిపోయిందన్నారు. కూటమి మ్యానిఫెస్టో బాగా ఉన్నప్పటికీ, ప్రజలకు అర్థమయ్యేలా వివరించలేకపోయామని పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారం కూడా చేయలేకపోయామని చెప్పారు. టీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు రాజకీయ బలాన్ని, చతురతను తక్కువగా అంచనావేయరాదని చెప్పిన తన మాటలను కూటమి నేతలు ఖాతరు చేయలేదని పేర్కొన్నారు. కూటమి నాయకులు కొందరు అతి విశ్వాసంతో వ్యవహరించారని, చాలా మంది కొత్త అభ్యర్థులు కావడంతో నష్టం జరిగిందని వివరించారు.

ఎస్టీయూ డైరీని ఆవిష్కరించిన గవర్నర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) డైరీని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి మరువరానిదని కొనియాడారు.

జర్నలిస్ట్ యాకేశ్‌కు డాక్టరేట్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తుది దశ తెలంగాణ ఉద్యమం లో జర్నలిస్టుల పాత్ర అనే అంశంపై పరిశోధన చేసిన సీనియర్ జర్నలిస్టు దైద యాకేశ్‌కు తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. యాకేశ్ తెలంగాణ మీద పరిశోధనలు చేసి పలు సిద్ధాంత వ్యాసాలు రాశారు.



ఎయిర్‌పోర్ట్‌లో 'నూతన' పలకరింపు

- ప్రయాణికులకు వినూత్నంగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శంషాబాద్ విమానాశ్రయ భద్రతా విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సిబ్బంది నూతన సంవస్తరం వేడుకను వినూత్నంగా జరిపారు. విమాన ప్రయాణికులకు కొత్త అనుభూతినిచ్చేలా పుష్పాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విదేశాలకు వెళ్లేవారు, విదేశాల నుంచి వస్తున్నవారిని ఆప్యాయంగా పలుకరిస్తూ పుష్పగుచ్ఛాలు అందించారు. నిత్యం సీరియస్‌గా సీఐఎస్ఎఫ్ సిబ్బంది తీరుకు విమానప్రయాణికులు ఒక్కసారిగా పులకించిపోయి తిరిగి వారితో కరచాలనంచేసి ధన్యవాదాలు తెలిపారు.

'డబుల్' ఇండ్లకు కేంద్రం కొర్రీలు

- నిబంధనల సాకుతో నిధుల నిలిపివేత
- రావాల్సింది రూ.1,500 కోట్లు.. ఇచ్చింది రూ.590 కోట్లు
- హైదరాబాద్‌లో 60 శాతానికిపైగా ఇండ్ల నిర్మాణం పూర్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి కేంద్రం మోకాలడ్డుతున్నది. ఇండ్ల నిర్మాణం వ్యయంలో కేవలం పది శాతం వాటా ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం.. దానిలోనూ నిబంధనల సాకుతో రకరకాల కొర్రీలు పెడుతూ సాగదీత ధోరణి అవలంబిస్తున్నది. ప్రభుత్వం నిర్మించే ఇండ్లలో లబ్ధిదారుల వాటా ఉండాలని, వారి పూర్తి వివరాలు తమకు తెలుపాలని పేర్కొంటూ నిధులను నిలిపివేసింది. ఫలితంగా మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నగరంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్లకు ఒక్కోదానికి రూ.7.5 లక్షలు, మౌలిక సదుపాయాలకు రూ.1.5 లక్షలు కలిపి మొత్తం రూ.9 లక్షల వరకు ఖర్చవుతున్నది. ఇందులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద కేంద్ర ప్రభుత్వం ఒక్కోఇంటికి రూ.1.5 లక్షలు ఇవ్వనుండగా, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్‌లోని పేదలకోసం మొదటివిడుతలో లక్ష ఇండ్లు నిర్మించాలని లక్ష్యం పెట్టుకోగా సుమారు 97,300 ఇండ్ల నిర్మాణం ప్రారంభమైంది. వీటికి దాదాపు రూ.8,500 కోట్లు ఖర్చవుతుండగా.. కేంద్ర ప్రభుత్వం వాటాపోగా మిగిలిన మొత్తం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే వెచ్చిస్తున్నది. మొత్తం 109 ప్రాంతాల్లో నిర్మాణం చేపట్టగా, దాదాపు 10 వేల గృహాల నిర్మాణం తుదిదశకు చేరుకున్నది. మిగిలినవాటి నిర్మాణం 60 శాతానికిపైగా పూర్తయింది. కేంద్ర ప్రభుత్వ వాటాకింద రూ.1,500 కోట్లు రావాల్సివుండగా, ఇప్పటివరకు రూ.590 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. నిబంధనల సాకుతో మిగిలిన నిధులను కేంద్రం విడుదల చేయడంలేదు. ఇండ్ల నిర్మాణం దాదాపు 60 శాతానికిపైగా ఇండ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ 40 శాతంవరకు మాత్రమే నిధులు విడుదలచేసి చేతులు ఎత్తేయడం ఏమిటని అధికారులు ప్రశ్నిస్తున్నారు. నగరంలోని పేదలకోసం దశలవారీగా ఇండ్లను పూర్తి ఉచితంగా నిర్మించి ఇవ్వాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి తగిన సహకారం లభించకపోవడంపట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీఎండీ ప్రభాకర్‌రావును కలిసిన విద్యుత్ ఉద్యోగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతన సంవత్సరం సందర్భంగా ట్రాన్స్‌కో, జెన్‌కో విద్యుత్ సంస్థల సీఎండీ డీ ప్రభాకర్‌రావును ఆయా సంస్థల ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విద్యుత్ సౌధలో సీఎండీ ప్రభాకర్‌రావును కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య, అధ్యక్షుడు అశోక్, సంఘం ప్రతినిధులు నాజర్ షరీఫ్, కే వెంకటేశ్వర్లు, పీ అనిల్, జే స్వామి, పరమేశ్, వీరస్వామి, మధుసూదన్‌రావు, శ్రీనివాస్, హరిశంకర్, నాగరాజు, కొండారెడ్డి, నగేశ్, అనురాధ, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఔత్సాహికులకు వేదిక టీహబ్

- 2018లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు 56 వేల మంది సందర్శన
- 25కు పైగా అంతర్జాతీయ ఈవెంట్ల నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన టీహబ్‌కు 2018 సంవత్సరంలో జాతీయ, అంతర్జాతీయ వేదికల నుంచి విశేష ఆదరణ దక్కింది. ఒక్క సంవత్సరంలోనే 56 వేల మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, వివిధ రాష్ట్రాలకు చెందిన పాలకులు సందర్శించారని టీహబ్ తెలిపింది. మొత్తం 800 ఈవెంట్లు నిర్వహించగా ఇందులో 25 ఈవెంట్లు విదేశీ సంస్థలు నిర్వహించినవి. 52 స్టార్టప్‌లకు నిధులు, ఆర్థిక సహాయం దక్కగా 1,443 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మేలు జరిగిందని వివరించింది.

మెట్రో మరో రికార్డు

- ఒక్కరోజే 2.10లక్షలు దాటిన ప్రయాణికులు
- డిసెంబర్ 31న రెండుమార్గాల్లో పెద్దసంఖ్యలో ప్రజల రాకపోకలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ మరో రికార్డు సాధించింది. సంవత్సరం చివరి రోజైన డిసెంబర్ 31న మొత్తం రెండుమార్గాల్లో 2.10 లక్షల మందికిపైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. పాస్‌లపై ప్రయాణించే మెట్రో సిబ్బంది, మెట్రో మాల్స్ నిర్వాహకులను కలుపుకుంటే ప్రయాణించినవారి సంఖ్య 2.25 లక్షలకు చేరినట్టు మెట్రో రైలు ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మియాపూర్-ఎల్బీనగర్ మార్గంలో 1.66 లక్షల మంది, నాగోల్-బేగంపేట మార్గంలో 59 వేల మంది ప్రయాణించినట్టు పేర్కొన్నారు. అమీర్‌పేట, మియాపూర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, జేఎన్టీయూ, ఉప్పల్ తదితర స్టేషన్లలో సాయంత్రం ఐదునుంచి 10:30 గంటల మధ్య ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉండటంతో అదనపు రైళ్లను నడిపినట్టు మెట్రోరైలు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజుల్లో కూడా మెట్రో రెండుమార్గాల్లో నిత్యం సుమారు 1.5 లక్షలమంది ప్రయాణిస్తుండగా, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో వారి సంఖ్య గణనీయంగా పెరుగడం విశేషం. అమీర్‌పేట-హైటెక్‌సిటీ మార్గం (10 కి.మీ.)లో ప్రస్తుతం ట్రయల్ రన్ కొనసాగుతుండగా, త్వరలోనే ఇది అందుబాటులోకి వచ్చే అవకాశమున్నది. ఈ మార్గం కూడా అందుబాటులోకొస్తే ప్రయాణికుల సంఖ్య రోజుకు మూడు లక్షలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



నమస్తే తెలంగాణ
ఆట
10
[కరీంనగర్]
బుధవారం 2 జనవరి 2019
WWW.NTNEWS.COM



పైన్ పిల్లల్ని ఎత్తుకున్న పంత్

బెస్ట్ బేబీ సిట్టర్‌గా ప్రశంసలు

సిడ్నీ: మైదానంలో జరిగిన స్లెడ్జింగ్‌ను పక్కనబెట్టి.. టీమ్ ఇండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ నిజంగానే బేబీ సిట్టర్ అవతారం ఎత్తాడు. ఆసీస్ సారథి టిమ్ పైన్ కుమారుడ్ని ఎత్తుకొని ముద్దు చేశాడు. ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్ ఇంట్లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఈ దృశ్యం చోటు చేసుకున్నది. ఈ కార్యక్రమానికి ఆతిథ్య జట్టు కుటుంబాలతో సహా హాజరైంది. ఈ సందర్భంగా తమ కుమారుడ్ని పంత్ ఎత్తుకుని ఆటాడిస్తున్న ఫొటోను పైన్ భార్య బోనీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. అంతటితో ఆగకుండా 'బెస్ట్ బేబీ సిట్టర్' అంటూ కితాబిచ్చింది. మూడో టెస్ట్‌లో పంత్ బ్యాటింగ్ చేస్తుండగా, పైన్ అదే పనిగా స్లెడ్జింగ్ చేశాడు. 'ధోనీ వచ్చాడు.. నీవు హోబర్ట్‌కు ఆడతావా! కాస్త విశ్రాంతైనా దొరుకుతుంది. నీవు నా పిలల్ని ఆడిస్తే నా భార్యను సినిమాకు తీసుకెళ్తా' అంటూ ఆసీస్ కెప్టెన్ మాటల యుద్ధం చేశాడు. దీనికి పంత్ కూడా దీటుగానే బదులిచ్చాడు. 'మాంకీ.. తాత్కాలిక కెప్టెన్ ఎలా ఉంటాడో చూశావా. అతను మాట్లాడటం తప్ప ఏమీ చేయలేడు' అని మాయాంక్, జడేజాతో వికెట్ కీపర్ వ్యాఖ్యానించాడు. ఏదేమైనా మైదానంలో గొడవను పట్టించుకోకుండా పంత్ చేసిన పని క్రీడాస్ఫూర్తిని చాటి చెబుతున్నది.

టీ20 ప్రపంచకప్‌లో లంక, బంగ్లాకు దక్కని బెర్తులు



దుబాయ్: ఆస్ట్రేలియా వేదికగా వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ టోర్నీకి శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు నేరుగా అర్హత సాధించలేకపోయాయి. ప్రస్తుత ప్రపంచ టీ20 ర్యాంకింగ్స్‌లో లంక, బంగ్లా వరుసగా తొమ్మిది, పదో ర్యాంక్‌ల్లో ఉన్నాయి. అయితే టాప్-8లో ఉన్న జట్లు సూపర్ 12కు అర్హత పొందుతాయని ఐసీసీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందులో పాకిస్థాన్, భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్‌తో పాటు ఆఫ్ఘనిస్థాన్ ఉన్నాయి. మిగిలిన నాలుగు బెర్తుల కోసం లంక, బంగ్లా అర్హత మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. మొత్తం ఆరు జట్లు నాలుగు స్థానాల కోసం పోటీపడుతాయి. టీ20 ప్రపంచకప్ టోర్నీకి నేరుగా ఆడే అవకాశం దక్కకపోవడంపై లంక కెప్టెన్ లసిత్ మలింగ స్పందిస్తూ 'సూపర్-12 దశకు అర్హత సాధించలేకపోవడం నిరుత్సాహపరిచింది. అర్హత టోర్నీలో మెరుగ్గా రాణిస్తామన్న గట్టి నమ్మకం నాకుంది'అని అన్నాడు.

భవిష్యత్ కెప్టెన్‌ని కాదు



కమిన్స్

సిడ్నీ: భవిష్యత్‌లో ఆసీస్ టెస్ట్ జట్టు కెప్టెన్సీ చేపట్టాలన్న వ్యాఖ్యలను స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ తోసిపుచ్చాడు. ప్రస్తుత సారథి టిమ్ పైన్ అద్భుతంగా పని చేస్తున్నాడని మద్దతిచ్చాడు. 'భవిష్యత్ కెప్టెన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం. పైన్ రూపంలో మాకు మంచి నాయకుడు దొరికాడు. ప్రస్తుత తరుణంలో ఈ వృత్తి చాలా నిబద్ధతతో నిర్వర్తిస్తున్నాడు. సుదీర్ఘంగా పని చేసే సత్తా, సామర్థ్యం కూడా అతనికి ఉంది' అని కమిన్స్ పేర్కొన్నాడు. మెల్‌బోర్న్‌లో కమిన్స్.. వీరోచిత ప్రదర్శన చూసి.. ఇతనే మా భవిష్యత్ కెప్టెన్ అంటూ స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ ట్వీట్ చేశాడు. గతేడాది బ్యాటింగ్, బౌలింగ్ బాగుందని గణాంకాలతో సహా వెల్లడించాడు. అయితే ప్రస్తుతానికి తనకు కెప్టెన్సీ తీసుకోవాలన్న ఆసక్తి లేదని కమిన్స్ స్పష్టం చేశాడు. మైదానంలో సత్తా చాటడంపైనే ఎక్కువగా దృష్టిపెడుతానన్నాడు. 'బ్యాటింగ్, బౌలింగ్‌లో చాలా బిజీగా ఉన్నా. మధ్యలో కెప్టెన్సీ అంటే భారం పెరుగుతుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో విఫలమైనప్పుడు దీనిపై ఆలోచన చేస్తా. ఎందుకంటే ఈ తరుణంలో నేను మంచి సారథి అని నిరూపించుకోలేను' అని కమిన్స్ వ్యాఖ్యానించాడు. వైస్ కెప్టెన్‌గా హాజిల్‌వుడ్ బాగా పని చేస్తున్నాడని కితాబిచ్చాడు. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు కూడా ఆట గురించే ఆలోచిస్తుంటాడన్నాడు. ఓ బౌలర్ కెప్టెన్ కావాల్సిన అవసరం ప్రస్తుతం ఆసీస్‌కు లేదని వెల్లడించాడు.

మళ్లీ తండ్రి కాబోతున్న వార్నర్



సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. బాల్ ట్యాంపరింగ్ ఉదంతంతో తీవ్ర ఒడిదొడుకులకు లోనైన వార్నర్ ముచ్చటగా మూడోసారి తండ్రి కాబోతున్నాడు. ఈ విషయాన్ని వార్నర్ భార్య కాండైస్ సోమవారం ట్విట్టర్ ద్వారా అందరితో పంచుకున్నది. ఈ సందర్భంగా చేదు అనుభవాలను మిగిల్చిన 2018 ఏడాదికి ముగింపు పలుకుతూ కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. 'కష్టకాలంలో మాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ సంతోషకరమైన సందర్భాన్ని అందరితో పంచుకోవాలనుకుంటున్నాం. మా కుటుంబసభ్యుల సంఖ్య త్వరలో ఐదుకు చేరబోతున్నది' అని కాండైస్ ట్వీట్ చేసింది. గత మార్చిలో కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో బాల్ ట్యాంపరింగ్ బయటపడింది. దీంతో ఉన్నఫళంగా దక్షిణాఫ్రికా నుంచి విరామం లేని ప్రయాణానికి తోడు తీవ్ర ఒత్తిడి కారణంగా కాండైస్ వార్నర్‌కు గర్భస్రావమైంది.

తుది కూర్పు ఎలా?

సిడ్నీ టెస్ట్‌కు జట్టు ఎంపికపై డైలమా ■ స్వదేశానికి రోహిత్ ■ ఓపెనర్‌గా విహారి విఫలం ■ పాండ్యాకు అవకాశం దక్కేనా!



సిడ్నీలో ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్‌తో భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లీ, జట్టు సభ్యులు. మంగళవారం ప్రధాని అధికార నివాసం కిరిబిల్లి హౌస్‌లో ఆస్ట్రేలియా, భారత క్రికెటర్లు కొత్త ఏడాది ప్రారంభం సందర్భంగా ప్రధానితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

సిడ్నీ: ఏడు దశాబ్దాల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచే సువర్ణావకాశం కోసం భారత్ అడుగు దూరంలో ఉన్నది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఉన్న టీమ్‌ఇండియా రేపటి నుంచి సిడ్నీలో జరిగే ఆఖరిదైన నాలుగో టెస్ట్‌లోనూ విజయం సాధించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. అయితే కీలక ఆటగాళ్ల గైర్హాజరీ, అందుబాటులో ఉన్నవారు సరైన ఫామ్‌లో లేకపోవడంతో.. తుది జట్టు ఎంపికపై డైలమా కొనసాగుతున్నది. సిరీస్ గెలువాలంటే మ్యాచ్‌ను నెగ్గినా లేదా డ్రా చేసుకున్న సరిపోతుంది. దీంతో కెప్టెన్ కోహ్లీ, టీమ్ మేనేజ్‌మెంట్ ఇప్పటికే కసరత్తులు మొదలుపెట్టినా.. తుది కూర్పుపై ఓ స్పష్టత రాలేకపోతున్నది. అడిలైడ్‌లో విరాట్‌సేన వీరోచితంగా చెలరేగినా.. పిచ్ పరిస్థితులను అంచనా వేయలేక పెర్త్‌లో బోల్తా కొట్టింది. అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో మెల్‌బోర్న్ మ్యాచ్‌కు కొన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకుని అనుకున్న ఫలితాన్ని సాధించింది. విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చడానికి పెద్దగా ఇష్టపడని కోహ్లీ సైతం మూడో టెస్ట్‌లో అందర్ని ఆశ్చర్యపరిచాడు. అయితే ఇప్పుడు చరిత్ర సృష్టించే మ్యాచ్ కావడంతో ఏమాత్రం తేడా వచ్చినా స్థానాలే గల్లంతయ్యే అవకాశాలు ఉండటంతో అటు ఆటగాళ్లు ఇటు మేనేజ్‌మెంట్ చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో అసలు ఎవరెవరు తుది జట్టు పరిస్థితి ఏంటో చూద్దాం!

ఓపెనర్‌గా మయాంక్ హిట్..

దాదాపు ఏడాది కాలంగా బెంచ్‌కే పరిమితమైన మయాంక్ అగర్వాల్ వచ్చిన అవకాశాన్ని రెండు చేతుల్లా ఒడిసిపట్టుకున్నాడు. సీనియర్లు మురళీ విజయ్, లోకేశ్ రాహుల్‌ను కాదని కోహ్లీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. యువ సంచలనం పృథ్వీ షా స్థాయిలో.. కఠినమైన ఎంసీజీ పిచ్‌లో ఆసీస్ బౌలర్ల దుమ్ముదులిపాడు. వాస్తవంగా చెప్పాలంటే మాయంక్ తొలి ఇన్నింగ్స్ (76)లో ఇచ్చిన శుభారంభమే టెస్ట్ గెలువడానికి పునాదిగా మారింది. రెండో ఇన్నింగ్స్‌లో స్టార్లందరూ పెవిలియన్‌కు క్యూ కట్టినా ఒంటరిగా 42 పరుగులు చేసి ఆసీస్ ముందు భారీ లక్ష్యం నిర్దేశించడంలో కీలకమయ్యాడు. దీంతో సిడ్నీ టెస్ట్‌కు కూడా అతని స్థానం ఖాయం.

విహారి మిడిలార్డర్‌కేనా..?

ఇంగ్లండ్ పిచ్‌లపై అరంగేట్రం చేసిన హైదరాబాద్ ప్లేయర్ హనుమ విహారి ఈ సిరీస్‌లో రాణిస్తాడని చాలా నమ్మకం పెట్టుకున్నారు. అందులో భాగంగా అవకాశాలు కూడా బాగానే ఇచ్చారు. రెండో టెస్ట్‌లో మిడిలార్డర్‌లో ఆడిన విహారి రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 48 పరుగులు చేయడం ఆందోళన కలిగించింది. మూడో టెస్ట్‌కు వచ్చేసరికి ఓపెనర్‌గా ప్రమోట్ చేసి విరాట్ ఓ అద్భుత అవకాశాన్ని ఇచ్చాడు. దీనిని కూడా అతను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్ (8+13)లో కలిపి 21 పరుగులు చేసి నిరాశపర్చాడు. భీకరమైన ఆసీస్ పేసర్లను ఓపికగా ఎదుర్కొన్నా.. పరుగులుగా మల్చడంలో విఫలమయ్యాడు. సిడ్నీ టెస్ట్‌లో అతన్ని ఓపెనర్‌గా కొనసాగిస్తారా? లేదా? చూడాలి. విహారి విఫలమైనా.. తర్వాతి సిరీస్‌ల్లో మిడిలార్డర్‌లో చోటు కల్పిస్తామని ఇంతకుముందే చీఫ్ సెలెక్టర్ ఎంఎస్కే ప్రసాద్ వెల్లడించాడు. కాబట్టి నాలుగో టెస్ట్‌లోనూ అతని స్థానానికి ఢోకా లేనట్లే. ఒకవేళ సిడ్నీలో విహారి ఓపెనర్‌గా సెంచరీ చేస్తే మాత్రం ఈ ఫార్మాట్‌లో అతనికి బంగారు భవిష్యత్ ఉన్నట్లే.

భారత్‌కు రోహిత్..

టీమ్‌ఇండియా మిడిలార్డర్ బ్యాటింగ్ లైనప్‌లో రోహిత్‌ది పెద్ద పాత్ర. కానీ అతని టెస్ట్ కెరీరే సవ్యంగా సాగడం లేదు. అరంగేట్రం మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగినా.. తర్వాతి మ్యాచ్‌ల్లో ఆ స్థాయి మెరుపులు కనిపించలేదు. ఆసీస్‌తో సిరీస్‌కు అనూహ్యంగా ఎంపికైన ఈ ముంబైకర్ అడిలైడ్‌లో ఆకట్టుకోలేకపోయాడు. గాయంతో పెర్త్ టెస్ట్‌కు దూరమైనా.. మళ్లీ మెల్‌బోర్న్‌లో బరిలోకి దిగాడు. తొలి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ (63 నాటౌట్)తో జట్టుకు బాగా ఉపయోగపడినా రెండో ఇన్నింగ్స్‌లో 5 పరుగులతో నిరాశపర్చాడు. మొత్తానికి తన శైలికి పూర్తి భిన్నంగా ఆడుతూ ఈ ఫార్మాట్‌కు తాను పనికొస్తానని రుజువు చేసుకున్నాడు. పుజార, రహానే, కోహ్లీలపై పెద్దగా భారం పడకుండా లోయర్ ఆర్డర్‌తో కీలక భాగస్వామ్యాలను నెలకొల్పడం శుభపరిణామం. అయితే సిడ్నీ టెస్ట్‌కు రోహిత్ అందుబాటులో ఉండటం లేదు. అతని భార్య రితికా ఆదివారం పండంటి పాపకు జన్మనివ్వడంతో ఈ ముంబైకర్ ఉన్న పళంగా స్వదేశానికి బయలుదేరాడు. సిడ్నీ టెస్ట్‌లో అతనికి చోటు ఖాయమైనా.. రెండు వేర్వేరు సంఘటనలతో రెండు టెస్ట్‌లకు దూరమయ్యాడు. రోహిత్ వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉంటాడని బీసీసీఐ ప్రకటించింది. ఇప్పటివరకు కెరీర్‌లో 27 టెస్ట్‌లు ఆడిన రోహిత్ 39.62 సగటుతో 1585 పరుగులు చేశాడు. ఇందులో 3 శతకాలు, 10 అర్ధ సెంచరీలు ఉన్నాయి. పరిమిత ఓవర్లలో చెలరేగే రోహిత్ టెస్ట్‌లో నమోదు చేసిన ఈ గణాంకాలను చూసి విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. ఇలాగే కొనసాగితే సమీప భవిష్యత్‌లోనే ఈ ముంబైకర్ టెస్ట్‌లకు దూరమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



పాండ్యాతో భర్తీ చేస్తారా?

వెన్ను నొప్పికి గురైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. దీంతో రోహిత్ స్థానంలో అతన్ని ఆడించాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నది. అయితే ఒకే ఒక్క ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడిన హార్దిక్ పరిస్థితి ఏంటో మైదానంలోకి దిగితేగానీ తెలియదు. ఐదుగురు బౌలర్ల వ్యూహానికి పాండ్యా సరిగ్గా సరిపోతాడు. ముగ్గురు పేసర్లు, ఓ స్పిన్నర్, సీమర్ ఆల్‌రౌండర్‌తో ముందుకెళ్తే ఎక్స్‌ట్రా బ్యాట్స్‌మన్‌కు అవకాశం దక్కుతుంది. మరోవైపు ఓపెనర్‌గా విఫలమవుతున్న విహారిని మళ్లీ మిడిలార్డర్‌లో ఆడించాలని కొంత మంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రోహిత్ స్థానం అతనికి కరెక్ట్ అని వాదిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పాండ్యాను ఏం చేస్తారో చూడాలి. టెస్ట్ సిరీస్ తర్వాత కీలకమైన వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌నకు కూడా సమయం దగ్గరపడుతున్నది. దీంతో పాండ్యాకు మ్యాచ్ ప్రాక్టీస్ అవసరమనే వాదన కూడా బలంగా వినిపిస్తున్నది. బ్యాట్స్‌మెన్‌గా కోహ్లీ, పుజార, రహానే తమ స్థానాలను ఖాయం చేసుకోగా, బౌలింగ్‌లో మార్పులు చేయకపోవచ్చు. షమీ, ఇషాంత్, బుమ్రా, జడేజాను కొనసాగించే అవకాశం ఉంది. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ ఈ మ్యాచ్‌లోనూ దాదాపుగా బెంచ్‌కు పరిమితమైనట్లే. ఓవరాల్‌గా చరిత్ర సృష్టించే మ్యాచ్‌లో భారత్ ఆటతీరుపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ మొదలైంది.

సిడ్నీలో ఆసీస్ ఆటగాళ్ల ప్రాక్టీస్



లాబుచాంగె

నాలుగు టెస్ట్‌ల సిరీస్‌ను ఎలాగైనా సమయం చేయాలన్న పట్టుదలతో ఉన్న ఆస్ట్రేలియా అందుకు తగ్గట్లు వ్యూహరచన చేస్తున్నది. ఈనెల 3న మొదలయ్యే నాలుగో టెస్ట్ కోసం మంగళవారం ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్‌తో సహా ఏడుగురు సిడ్నీ క్రికెట్ స్టేడియం(ఎస్‌సీజీ) నెట్స్‌లో చెమటోడ్చారు. మొత్తం 14 మందితో కూడిన జట్టులో పైన్, లియాన్, ఖవాజ, ఫించ్, మార్కస్, హ్యాండ్స్‌కోంబ్, మార్నస్ కొత్త ఏడాది తొలిరోజు ప్రాక్టీస్‌లో మునిగితేలారు. నాలుగో టెస్ట్‌కు జట్టులోకొచ్చిన స్పిన్ ఆల్‌రౌండర్ మార్నస్ లాబుచాంగె..సహచర క్వీన్స్‌లాండ్ బ్యాట్స్‌మన్ ఉస్మాన్ ఖవాజకు బౌలింగ్ చేశాడు. మరోవైపు ఆడిన మూడు టెస్ట్‌ల్లో ఘోరంగా విఫలమైన ఓపెనర్ ఆరోన్ ఫించ్ సిడ్నీ టెస్ట్‌లో ఆడేది అనుమానంగా మారింది. మంగళవారం ఫించ్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయకపోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తున్నది. ఇదిలా ఉంటే మూడో టెస్ట్‌లో ఆడిన జట్టునే సిడ్నీలోనూ కొనసాగించే అవకాశమున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) వెబ్‌సైట్ పేర్కొంది.

ఎంసీజీకి సగటు రేటింగ్!

మెల్‌బోర్న్: పిచ్‌ల నిర్వహణలో ఆస్ట్రేలియాకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) మరోసారి షాకిచ్చింది. మూడో టెస్ట్ మ్యాచ్ జరిగిన ఎంసీజీ పిచ్‌కు 'సగటు రేటింగ్' మాత్రమే కల్పించింది. ఇప్పటికే రెండో టెస్ట్ మ్యాచ్ జరిగిన పెర్త్ పిచ్‌కూ సగటు రేటింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. గతేడాది ఇంగ్లండ్‌తో జరిగిన యాషెస్ సిరీస్ సందర్భంగా టెస్ట్‌మ్యాచ్ పేలవ డ్రాగా ముగిసింది. దీంతో మూడు డీ మెరిట్ పాయింట్లను విధించింది. తాజాగా జరిగిన మూడో టెస్ట్ సందర్భంగా పిచ్ పరిస్థితి కాస్త మెరుగైందని ఐసీసీ తెలిపింది. ఐసీసీ నిబంధనల ప్రకారం సగటు రేటింగ్ ప్రకటించినా డీ మెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉండదు. ఐదేండ్లలో 5 డీ మెరిట్ పాయింట్లు విధిస్తే ఆ మైదానం టెస్ట్ నిర్వహణ హోదాను కోల్పోనుంది. ఎంసీజీ మైదానంలో రెండురోజులపాటు పుజార, కోహ్లీ, మయాంక్ ఓపికగా ఆడి 443 పరుగులు సాధించారు. చివరి మూడు రోజులు పిచ్‌లో కాస్త జీవం కనిపించగా.. ఆసీస్ 20 వికెట్లలో 15 వికెట్లను పేసర్లు పడగొట్టారు. దీంతో ఎంసీజీకి ఐసీసీ సగటు రేటింగ్ ఇచ్చింది. ఎంసీజీ మైదానంలో 4 కొత్త పిచ్‌లను తయారు చేస్తుండగా.. 15 ఏండ్ల కిందట తయారు చేసిన పిచ్‌లపైనే ఈ ఏడాది సీజన్‌ను ముగించనున్నారు.ఒక్కో పిచ్ తయారీకి దాదాపు మూడేండ్ల సమయం పట్టనుంది. కొత్తగా నిర్మించిన పెర్త్ స్టేడియంలోని పిచ్‌కు సగటు రేటింగ్ ఇవ్వడంపై ఆసీస్ కోచ్ లాంగర్ అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

అగ్రస్థానంలో హైదరాబాద్ హంటర్స్



సింధు

పుణె: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్(పీబీఎల్) సీజన్-4లో హైదరాబాద్ హంటర్స్ జట్టు తిరుగులేని విజయాలతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. పుణెలో మంగళవారం నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌తో జరిగిన పోరులో 5-0తో విజయం సాధించింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన హైదరాబాద్ హంటర్స్ జట్టు ఈ సీజన్‌లో మూడో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్ తరపున ఆడుతున్న పీవీ సింధు.. నార్త్ ఈస్టర్న్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సైనా నెహ్వాల్ మధ్య పోరు అభిమానులను అలరించింది. ఈ మ్యాచ్‌లో విజయంతో కొత్త ఏడాదిని విజయంతో సింధు ప్రారంభించడం విశేషం. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుకు సెమీస్ అవకాశం పదిలం కానుండగా..రెండు జట్లూ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగాయి.

సైనా X సింధు

కొత్త ఏడాదిలో ఇద్దరు హైదరాబాద్ స్టార్ షట్లర్ల మధ్య పోటీని అభిమానులు ఎంతో ఉత్సాహంగా తిలకించారు. హంటర్స్ తరపున సింధు, నార్త్ ఈస్టర్న్ జట్టుకు సైనా ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో బీవెన్ జాంగ్, సంగ్ జీ హన్ చేతిలో ఓడిన సింధు ఈ మ్యాచ్‌లో మాత్రం 11-15,15-9,15-5 స్కోరుతో సైనాను ఓడించింది. గాయం కారణంగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు బరిలోకి దిగని సైనా ఈ మ్యాచ్‌లోనే తొలిసారిగా మైదానంలోకి దిగింది. పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో కనిపించని సైనా సుదీర్ఘ ర్యాలీలు ఆడడంలో విఫలమైంది. తొలిగేమ్‌లో ఓడినా..రెండో గేమ్‌లో విజయంతో సత్తాను చాటింది. కాగా, కీలకమైన మూడో గేమ్‌లో అప్పటికే పూర్తిగా అలసటతో కనిపించిన సైనా.. సింధు జోరును అడ్డుకోలేక పోవడంతో పరాజయం పాలైంది. నార్త్ ఈస్టర్న్ జట్టు ట్రంప్ మ్యాచ్‌గా హో యూ వీ మ్యాచ్‌ను ఎంచుకుంది. హంటర్స్ షట్లర్ మార్క్ కాల్జో 15-11,15-14 స్కోరుతో హో యూను ఓడించి జట్టుకు కీలకమైన ఆధిక్యం అందించాడు. హంటర్స్ ట్రంప్ మ్యాచ్‌లో లీ యున్ 10-15,15-13,15-9స్కోరుతో ఈస్టర్న్ షట్లర్ తనాంగ్‌సక్ సాయెన్సోమ్‌బూన్సుక్‌ను ఓడించాడు. కాగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో 8-15, 14-15 స్కోరుతో కిమ్ సారంగ్, హైవోన్ జోడీ చేతిలో హంటర్స్ జోడీ కిమ్ హా, లియావో మిన్‌చున్ జోడీని ఓడించింది. చివరిగా సాగిన పురుషుల డబుల్స్‌లో 15-10,12-15,15-14 స్కోరుతో హంటర్స్ జోడీ ఇసారా, సారంగ్ జోడీ విజయం సాధించింది. ఈ విజయంతో పుణెలో రెండో అంచె లీగ్ పోటీలు ముగిసేసరికి హైదరాబాద్ హంటర్స్ జట్టు టేబుల్ టాపర్‌గా నిలిచింది.

పీబీఎల్‌లో నేటి మ్యాచ్

ఢిల్లీ X బెంగళూరు

వేదిక: అహ్మదాబాద్ సమయం: రా. 7.00

ప్రత్యక్ష ప్రసారం స్టార్ స్పోర్ట్స్‌లో

చాంపియన్ల సెల్ఫీ



స్విట్జర్లాండ్ విజయం

పెర్త్: హాప్‌మన్ కప్ లీగ్ దశ పోరులో హోరాహోరీ పోరాటంతో డిఫెండింగ్ చాంపియన్ స్విట్జర్లాండ్, అమెరికా అలరించాయి. మంగళవారం జరిగిన కీలకమైన పోరులో డిఫెండింగ్ చాంపియన్ స్విట్జర్లాండ్ జట్టు 2-1 తేడాతో విజయం సాధించింది. తొలుత పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో స్విస్ యోధుడు ఫెదరర్ 6-4,6-1 స్కోరుతో ఫ్రాన్సెస్ తియాఫోను చిత్తుగా ఓడించాడు. అనంతరం హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ పోరులో 4-6,6-4,6-3 స్కోరుతో బెలిండా బెంకిచ్‌పై సెరెనా కష్టపడి నెగ్గింది. దీంతో 1-1తో రెండుజట్ల స్కోరు సమమయ్యాయి. మిగిలిన మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ఎవరు గెలిస్తే ఆ జట్టు ముందంజ వేయనుండగా.. కెరీర్‌లోనే తొలిసారిగా మిక్స్‌డ్ డబుల్స్‌లో సెరెనా, ఫెదరర్ మధ్య ఆసక్తికర పోరు సాగింది. అమెరికా తార సెరెనా, తియాఫో అమెరికా తరపున కోర్టులో దిగగా.. ఫెదరర్, బెలిండా జోడీ స్విస్ తరపున కోర్టులోకి అడుగు పెట్టింది. ఈమ్యాచ్‌లో స్విస్ జోడీ 4-2,4-3 స్కోరుతో అమెరికా జంటను కంగుతినిపించింది. యూఎస్ ఓపెన్ ఫైనల్ సందర్భంగా అంపైర్‌తో గొడవపడిన అనంతరం మళ్లీ సెరెనా టెన్నిస్ కోర్టులోకి దిగడం ఇదే తొలిసారి.

ఐపీఎల్‌కు బుమ్రా దూరం!



సిడ్నీ: రానున్న ఐపీఎల్ టోర్నీకి భారత స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐపీఎల్ టోర్నీ ముగిసిన వెంటనే ఇంగ్లండ్ వేదికగా వన్డే ప్రపంచకప్ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో మెగాటోర్నీని దృష్టిలో పెట్టుకుని కీలక పేసర్లకు ఐపీఎల్ నుంచి విశ్రాంతినివ్వాలని కెప్టెన్ కోహ్లీ..బీసీసీఐకి ప్రతిపాదన చేశాడు. కెప్టెన్ మాటకు కట్టుబడుతూ బోర్డు గనుక ఆమోదం తెలిపితే..ముంబై ఇండియన్స్ జట్టు బుమ్రా సేవలను కోల్పోయే అవకాశముంది. అయితే పేసర్లకు విశ్రాంతినిచ్చే విషయంలో ఫ్రాంచైజీలతో మాట్లాడి వారి అభిప్రాయాలను బోర్డు పరిగణనలోకి తీసుకోవచ్చని సీనియర్ అధికారి పేర్కొన్నారు. 'బుమ్రాకు సంబంధించిన పూర్తి డేటాను జట్టు సహాయక బృందం నుంచి తెప్పించుకుంటాం. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని బుమ్రా సేవలను ఎలా ఉపయోగించుకోవాలన్నది నిర్ణయిస్తాం. ఎందుకంటే అతను ప్రస్తుతం భారత్ జట్టుకు మూడు ఫార్మాట్లలో కీలక బౌలర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ విషయమై ముంబై జట్టుతో మాట్లాడుతాం. ఒక వేళ పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంటే..ముంబై తరపున కీలక మ్యాచ్‌లన్నీ ఆడవచ్చు. కాకపోతే తీరిక లేని ప్రయాణ షెడ్యూల్ కారణంగా ఆటగాళ్లు అలసిపోయే అవకాశముంటుంది. లేకపోతే వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకుని విశ్రాంతినిస్తే.. చాలా బాగుంటుంది' అని సదరు అధికారి అన్నాడు.

విభేదించిన రోహిత్, ధోనీ:

పేసర్లకు విశ్రాంతినివ్వాలన్న కెప్టెన్ కోహ్లీ చేసిన ప్రతిపాదనతో రోహిత్‌శర్మ, ధోనీ విభేదించారు. ఒకవేళ ముంబై ఐపీఎల్ ప్లేఆఫ్స్‌కు చేరితే బుమ్రాకు విశ్రాంతి నివ్వకుండా ఆడిస్తామని రోహిత్ అన్నాడు. మరోవైపు ఈ మధ్యే ధోనీ స్పందిస్తూ..వరల్డ్‌కప్ టోర్నీకి సిద్ధం కావడానికి ఐపీఎల్ సరైన ప్లాట్‌ఫామ్ అని అన్నాడు. అయితే ఆటగాళ్లపై పడుతున్న వర్క్‌లోడ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ధోనీ సూచించాడు.

సెన్సెక్స్ 36,254 ↗186

నిఫ్టీ 10,910 ↗48

ముడి చమురు (బ్రెంట్) ↗ 54.16 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	32,470
22 క్యారెట్లు	32,320
వెండి (కిలో)	39,250

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	66.60	72.10
యూరో	76.30	84.30
బహ్రెయిన్ దినార్	177.70	189.70
కువైట్ దినార్	220.20	233.20
సౌదీ రియాల్	17.30	19.10
యూఏఈ దిర్హామ్	17.70	19.30

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	99.00
రిటైల్ లైవ్	121.00
డ్రెస్డ్	175.00
స్కిన్‌లెస్	200.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	439-00
రంగారెడ్డి	439-00
మెదక్	439-00
కరీంనగర్	441-00
వరంగల్	441-00
రిటైల్ ప్రైస్	5-00

చివరి గంటలో అనూహ్య రికవరీ

కొత్త ఏడాది శుభారంభం




2019 సంవత్సరాన్ని స్టాక్ మార్కెట్ లాభాలతో ప్రారంభించింది. మొండి బకాయిలు తగ్గుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన నివేదికతో బ్యాంకింగ్ షేర్లు లాభాలను మూటగట్టుకున్నాయి. లాభంతోనే ప్రారంభమైనప్పటికీ మొదటి ఐదు నిమిషాల్లోనే నష్టాల్లోకి జారుకుని మధ్యాహ్నం రెండున్నర గంటల వరకూ నష్టాల్లోనే ప్రధాన సూచీలు ట్రేడ్ అయ్యాయి. అయితే చివరి గంటలో వచ్చిన అనూహ్య కొనుగోళ్ల మద్దతుతో నిఫ్టీ 10,807 పాయింట్ల కనీస స్థాయి నుంచి ఏకంగా10,922 స్థాయికి చేరుకుంది. చివరికి నిఫ్టీ నికరంగా 47.55 పాయింట్ల లాభంతో 10,910.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 186.24 పాయింట్ల లాభంతో 36,254.57 వద్ద ముగిసింది. మధ్యాహ్నం తర్వాత ముఖ్యంగా బ్యాంకింగ్, ఆర్థికసేవలు, ఐటీ రంగాల షేర్లలో వచ్చిన కొనుగోళ్లతో మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా పెరిగింది. ప్రభుత్వం రంగ బ్యాంక్ ఇండెక్స్ 1.59 శాతం పెరిగింది. ఆర్థికసేవల రంగం ఇండెక్స్ 1 శాతం లాభపడగా, బ్యాంక్‌నిఫ్టీ 0.85 శాతం, రియల్టీ 2.22 శాతం, మీడియా 0.31 శాతం మేర లాభపడ్డాయి. కాగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.10 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.42 శాతం లాభాలతో ముగిశాయి. మెటల్ ఇండెక్స్ 0.61 శాతం నష్టపోగా, ఆటో ఇండెక్స్ 0. 57 శాతం, ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 0.39 శాతం నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో మొత్తం 995 షేర్లు లాభాలతో ముగిస్తే 726 షేర్లు నష్టాలతో ముగిశాయి. నిఫ్టీలో భారతీ ఎయిర్‌టెల్ 2.99 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 2.12 శాతం, ఎస్‌బీఐ 1.62 శాతం, బీపీసీఎల్ 1.59 శాతం చొప్పున నష్టపోయాయి. ఎంఅండ్ఎం 3.84 శాతం, హిందాల్కో 1.46 శాతం, ఇండియాబుల్స్ హౌజింగ్ 1.38 శాతం, హిందుస్తాన్ యూనీలీవర్ 1.13 శాతం చొప్పున నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో కేవలం రెండే షేర్లు కొత్త 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేయగా, 25 షేర్లు లాభాలతో ముగిశాయి. ఎఫ్ఐఐలు రూ. 48.19 కోట్ల అమ్మకాలు జరపగా, డీఐఐలు రూ. 142.58కోట్ల కొనుగోళ్లు జరిపారు.

34 పైసలు పెరిగిన రూపాయి మారకం

డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా 34 పైసల లాభంతో 69.43 వద్ద ముగిసింది. గత మూడు రోజుల్లో రూపాయి విలువ మొత్తం 92 పైసల మేర లాభపడింది. ఈక్విటీ మార్కెట్లలో పాజిటివ్ ధోరణికి తోడు అంతర్జాతీయ మార్కెట్లు చాలా వరకు సెలవులో ఉండడంతో దేశీయ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి రికవరీ కొనసాగింది. రూ. 69.63 వద్ద ప్రారంభమైన రూపాయి చివరికి 34 పైసల లాభంతో రూ. 69.43 వద్ద ముగిసింది. కాగా, 2018లో రూపాయి మారకం విలువ రూ. 5.09 ల మేర నష్టపోయింది. ఇది 2017లో రూ. 63.87 వద్ద ముగిసింది. 2019 రూపాయి మారకం విలువ స్థిర పడడానికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ రిసెర్చి పేర్కొంది,. పెద్ద పతనం అంటూ ఉండకపోవచ్చునని అభిప్రాయపడింది.

జీఎస్టీ వసూళ్లు తగ్గుముఖం

డిసెంబర్‌లో రూ.94,726 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ, జనవరి 1: గడిచిన కొన్ని నెలలుగా పెరుగుతూ వచ్చిన జీఎస్టీ వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. డిసెంబర్ నెలకుగాను రూ.94,726 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. నవంబర్‌లో వసూలైన రూ.97,637 కోట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి. అయినప్పటికీ గత నెలలో 72.44 లక్షల మంది జీఎస్టీఆర్-3బీ విక్రయ రిటర్నులు దాఖలు చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నవంబర్‌లో ఇది 69.6 లక్షలుగా ఉన్నది. గత నెలలో వసూలైన రూ.94 వేల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.16,442 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.22,459 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.47,936 కోట్లు, సెస్‌ల రూపంలో రూ.7,888 కోట్లు వసూలయ్యాయి. ప్రతి నెల సాధారణ పరిష్కారం కింద రాష్ర్టాలకు చెల్లించాల్సిన దాంట్లో సీజీఎస్టీ కింద రూ.18,409 కోట్లు, ఎస్‌జీఎస్టీ కింద రూ.14,793 కోట్ల చెల్లింపులు జరిపింది కేంద్ర ప్రభుత్వం. ఆయా చెల్లింపులు జరిపిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి రూ.43,851 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.46,252 కోట్ల ఆదాయం సమకూరిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. నవంబర్‌లో కొనుగోళ్లు, విక్రయాలు తగ్గుముఖం పట్టడం.. జీఎస్టీ వసూళ్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో (ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలం) జీఎస్టీ వసూళ్ల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ. 8.71 లక్షల కోట్ల నిధులు సమకూరాయి. ప్రస్తుత 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో రూ.13.48 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది కేంద్రం. జూలై 2017 నుంచి మార్చి 2018 వరకు సరాసరిగా ఒక్కో నెలలో రూ.89,885 కోట్ల జీఎస్టీ వసూలైంది. మరో 23 ఉత్పత్తులపై జీఎస్టీ కౌన్సిల్ రేటును తగ్గించడంతో భవిష్యత్తులో వసూళ్లు మరింత తగ్గే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఏప్రిల్‌లో రూ.1.03 లక్షల కోట్లు వసూలైన జీఎస్టీ.. మేలో రూ.94,016 కోట్లు, జూన్‌లో రూ.95,610 కోట్లు, జూలైలో రూ.96,483 కోట్లు, ఆగస్టులో రూ.93,960 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.94,442 కోట్లు, అక్టోబర్‌లో రూ.1,00,710 కోట్లు, నవంబర్‌లో రూ.97,637 కోట్లు వసూలయ్యాయి. అలాగే ఆగస్టు-సెప్టెంబర్ నెలలకుగాను పరిహారం కింద రాష్ర్టాలకు చెల్లించాల్సిన దాంట్లో రూ.11,922 కోట్ల నిధులను మంజూరు చేసింది కేంద్ర ప్రభుత్వం. ఇదిలావుంటే 2017 జూలై నుంచి 2018 సెప్టెంబర్ మధ్య జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయనివారి కోసం లేట్ ఫీజును ప్రభుత్వం రద్దు చేసింది. మరోవైపు నూతన వార్షిక జీఎస్టీ రిటర్న్ ఫారాలనూ కేంద్రం నోటిఫై చేసింది.

ఎల్ఐసీ చైర్మన్‌గా హేమంత్ భార్గవ



న్యూఢిల్లీ, జనవరి 1: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హేమంత్ భార్గవ తాత్కాలిక అధ్యక్షుడుగా నియమితులయ్యారు. సోమవారం పదవీవిరమణ చేసిన వీకే శర్మ స్థానంలో ఆయనను నియమించింది ప్రభుత్వం. నూతన చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కోసం ఇప్పటికే కేంద్రం వేట ప్రారంభించింది. ఫిబ్రవరి 2017లో భార్గవ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయనతోపాటు మరో ఇద్దరు ఎండీలుగా ఉన్నారు.

సీసీఐ కార్యదర్శిగా పీకే సింగ్



న్యూఢిల్లీ, జనవరి 1: కాంపిటేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కార్యదర్శిగా ప్రమోద్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. అంతకుముందు ఆయన సీసీఐకి సలహాదారుడిగా విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు నెలల క్రితం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ సీసీఐ నిర్ణయం తీసుకున్నది. ఈ పదవిలో ఆయన ఐదేండ్లపాటు ఉండనున్నారు. 2003లో ప్రారంభమైన సీసీఐ..వ్యాపారరంగంలో మోసపూరిత చర్యలు తీసుకోకుండా గట్టి చర్యలనే తీసుకుంటున్నది.

డిజిన్వెస్ట్‌మెంట్ రికార్డు

- 2018లో జోరుగా పీఎస్‌యూల్లో వాటాల విక్రయం
- రూ.77,417 కోట్ల నిధులను సమీకరించిన సర్కారు



న్యూఢిల్లీ, జనవరి 1: గతేడాది ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం ద్వారా మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో నిధులను సొంతం చేసుకున్నది కేంద్ర ప్రభుత్వం. 2018లో పీఎస్‌యూ వాటాల ఉపసంహరణలో భాగంగా రూ.77,417 కోట్ల నిధులను సమీకరించింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ప్రైవేటీకరణ దిశగా బలమైన అడుగులు వేస్తుండటం, ఆయా సంస్థల రెవిన్యూ లక్ష్యాలను చేధించడంలో భాగంగా విలీనబాట పడుతుండటం తెలిసిందే. పైగా ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలుండటంతో సంక్షేమ పథకాల అమలు, ప్రజాకర్షక రాయితీలు, ప్రకటనలు అనివార్యమవుతున్నది. ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగ సంస్థల్లోని తమ వాటాలను అమ్మకానికి పెడుతూ ఖజానాను నింపుకుంటున్నది కేంద్రం. కాగా, హెచ్‌పీసీఎల్‌ను ఓఎన్‌జీసీ చేజిక్కించుకోవడంతోపాటు సీపీఎస్ఈ ఈటీఎఫ్, భారత్-22 ఈటీఎఫ్, కోల్ ఇండియా వాటా అమ్మకం, మరో 6 సంస్థలను స్టాక్ మార్కెట్లలోకి ఐపీవోల ద్వారా పంపడం వంటి వాటితో మొత్తం రూ.77,417 కోట్లను కేంద్రం అందుకున్నది. ఇక ఈ ఏడాది ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించాలని కూడా చూస్తున్నారు. ఎయిర్ ఇండియాలో కేంద్రానికి 74 శాతం వాటా ఉన్న విషయం తెలిసిందే. కొత్త ప్రణాళికలో భాగంగా ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ లిమిటెడ్, ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్‌లతోపాటు సంస్థకు చెందిన భూములు, భవనాల అమ్మకం ద్వారా రూ.29,000 కోట్ల నిధులను పొందవచ్చని అంచనా. ఒకవేళ ఎయిర్ ఇండియాను మరిన్ని పెట్టుబడులతో కాపాడాలనుకున్నా.. దాని అనుబంధ సంస్థలు, వాటి ఆస్తులను విక్రయించినా రూ.9,000 కోట్లు రావచ్చని భావిస్తున్నారు. ఇక హెలికాప్టర్ సర్వీస్ ప్రొవైడర్ పవన్ హన్స్ వాటా విక్రయం ద్వారా కూడా నిధులు రానుండగా, మార్చిలో ఈ ప్రక్రియ ముగిసే అవకాశాలున్నాయి. ఈ మార్చి 31తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.80,000 కోట్ల నిధులను సమీకరించాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.

హెచ్‌పీసీఎల్ డీల్‌తో జోష్

హెచ్‌పీసీఎల్‌లోని మొత్తం 51.11 శాతం ప్రభుత్వ వాటాను ఓఎన్‌జీసీ కొనడం వల్ల ఖజానాకు రూ.36,915 కోట్ల ఆదాయం రాగా, ఆర్ఐటీఈఎస్, ఐఆర్‌సీవోఎన్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, భారత్ డైనమిక్స్, మిశ్రధాతు నిగమ్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ ఐపీవోల ద్వారా కూడా ఆదాయం పెరిగింది. కోల్ ఇండియా వాటా అమ్మకంతో రూ.5,218 కోట్లు, ఎన్ఎండీసీ వాటా విక్రయంతో రూ.1,200 కోట్లు సమకూరాయి. సీపీఎస్ఈ ఈటీఎఫ్‌ల నుంచి రూ.17,000 కోట్లు, భారత్-22 ఈటీఎఫ్‌ల నుంచి రూ.8,325 కోట్లు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరం (2017-18) ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా రూ.72,500 కోట్ల నిధులను సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, హెచ్‌పీసీఎల్-ఓఎన్‌జీసీ డీల్‌తో లక్ష కోట్ల మార్కును దాటేయడం గమనార్హం.

ఈ ఏడాది 10 సీపీఎస్ఈల్లో..

ఓఎన్‌జీసీ, ఐవోసీ, ఆయిల్ ఇండియా, ఎన్ఎల్‌సీ, బీహెచ్ఈఎల్, నాల్కో తదితర 10 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో వాటాల విక్రయం ద్వారా దాదాపు రూ.12,000 కోట్ల నిధులను సమీకరించనున్నది కేంద్రం. సీపీఎస్ఈ విలీనం, కొనుగోళ్లపైనా ఈ ఏడాది మోదీ సర్కారు ప్రత్యేక దృష్టి పెట్టనుండగా, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ)లో ప్రభుత్వ వాటాను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) ద్వారా కొనుగోలు చేయిస్తే రూ.15,000 కోట్ల నిధులు రావచ్చని కేంద్రం భావిస్తున్నది. అలాగే ఎస్‌జేవీఎన్‌లోని వాటాను ఎన్‌టీపీసీ కొంటే రూ.6,000 కోట్లు వస్తాయని అంచనా.

హైదరాబాద్‌లో మాంగల్య స్టోర్



హైదరాబాద్, జనవరి 1: ప్రముఖ బట్టల విక్రయ సంస్థ మాంగల్య స్టోర్ హైదరాబాద్ మార్కెట్లోకి ప్రవేశించబోతున్నది. ఈ నెల 3న హైదరాబాద్‌లోని మదీనగూడ వద్ద ఏర్పాటు చేసిన స్టోర్‌ను తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వాహణ అధ్యక్షుడు కే తారక రామారావు, సినీ నటి కాజల్ అగర్వాల్‌లు సంయుక్తంగా ప్రారంభించనున్నారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంపెనీ చైర్మన్ నమశివాయా మాట్లాడుతూ..రూ.10 కోట్ల పెట్టుబడితో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌తో 250 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా మార్చినాటికి హైదరాబాద్‌లో మరోస్టోర్‌ను ప్రారంభించనున్న సంస్థ..ఈ ఏడాది చివరినాటికి మరో నాలుగు స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకోసం ఎంతమేర పెట్టుబడులు పెట్టేదానిపై ఆయన స్పష్టతనివ్వలేదు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రెండు స్టోర్ల ద్వారా తొలి ఏడాదిలో రూ.50-60 కోట్ల ఆదాయం అంచనావేస్తున్నట్లు చెప్పారు. ఆరేండ్లక్రితం వరంగల్‌లో తన తొలి స్టోర్‌ను ఏర్పాటు చేసిన సంస్థ..ఆ తర్వాతి క్రమంలో కరీంగనగర్, సిద్దిపేటలలో స్టోర్లను నెలకొల్పింది. తద్వారా 1,500 మందికి ఉపాధి కల్పిస్తున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.150 కోట్లుగా నమోదైంది. హైదరాబాదీలకు నాణ్యమైన బట్టలను అందించాలనే ఉద్దేశంతో ఈ స్టోర్‌ను నెలకొల్పుతున్నట్లు ఆయన చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ నూతన ఆఫర్లు

హైదరాబాద్ (బేగంబజార్), జనవరి 1: కొత్త సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్.. తమ వినియోగదారులకు ప్రత్యేక వార్షిక ప్లాన్ ఆఫర్లను ప్రకటించింది. మంగళవారం అబిడ్స్‌లోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ వి సుందర్ మాట్లాడారు. నూతన సంవత్సరం సందర్భంగా వినియోగదారులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలను, ఆఫర్లను వివరించారు. వార్షిక రూ.1,699, వార్షిక ప్లస్ రూ.2,099 ప్లాన్‌లు వినియోగదారులకు ఎంతో సౌకర్యంగా ఉంటాయన్నారు. ఈ రెండు ప్లాన్ల కస్టమర్లు 365 రోజులు అన్ లిమిటెడ్ కాల్స్ పొందుతారన్నారు. లోకల్, ముంబై, ఢిల్లీలలో ఏదైనా నెట్‌వర్క్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. అంతేగాకుండా రూ.1,699 ఆఫర్‌లో రోజుకు 2 జీబీ డేటా, రూ.2,099 ప్లాన్‌లో రోజుకు 4 జీబీ డేటాతోపాటు ప్రతిరోజు 100 ఎస్ఎంఎస్‌లు, ఉచిత కాలర్ ట్యూన్ మార్పు అవకాశం కల్పించామన్నారు. అలాగే టాప్-అప్స్‌లో పది శాతం అదనపు ప్రయోజనాలు అందుతాయని చెప్పారు. రూ.186, 429, 485, 666, 999, 1,699, 2,099 ప్లాన్లలో 2.21 జీబీ అదనంగా అందిస్తున్నామన్నారు. ఇక ల్యాండ్ లైన్స్ న్యూ వాయిస్ ప్లాన్లలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వినియోగదారులకు బీఎస్ఎన్ఎల్ మరింత సేవలను అందించేందుకు నిరంతరం ముందుంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాగా, హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా కొనసాగుతున్న మెట్రో రైల్ కారిడార్‌లలోని 26 స్టేషన్లలో 2జీ, 3జీ బీఎస్ఎన్ఎల్ వైఫై సేవలను అందిస్తున్నామన్నారు. మరో 35 స్టేషన్లలో ఎల్అండ్‌టీ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

యూఎస్‌లో అరబిందో రక్తపోటు మాత్రల రీకాల్

న్యూఢిల్లీ, జనవరి 1: ప్రముఖ ఔషధ సంస్థ అరబిందో ఫార్మా..అమెరికా మార్కెట్లో ప్రవేశపెట్టిన రక్తపోటు, గుండెపోటు నియంత్రణ చికిత్స కోసం వినియోగించే 80 లాట్స్ ట్యాబ్లెట్లను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ట్యాబ్లెట్లతో క్యాన్సర్ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందన్న ఆరోపణలు రావడంతో వెనక్కి పిలిపించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. వీటిలో అమ్లోడిపైన్ వాల్సార్టెన్ ట్యాబ్లెట్ యూఎస్‌పీ, వాల్సార్టెన్ హెచ్‌సీటీజెడ్ ట్యాబ్లెట్స్ యూఎస్‌పీ, వాల్సార్టెన్ ట్యాబ్లెట్స్ యూఎస్‌పీలను వాడిన వారు ఇతర రోగాల బారిన పడుతున్నారని యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్గ్ అడ్మినిస్ట్రేషన్(యూఎస్ఎఫ్‌డీఏ) వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఇందుకు సంబంధించి నియంత్రణ మండలి నుంచి ఎలాంటి నివేదిక రాకపోయినప్పటికీ ముందస్తు చర్యల్లో భాగంగా వీటిని వెనక్కిపిలిపించినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది.

రుణ ఈటీఎఫ్‌లపై సీపీఎస్ఈల కన్ను

- నిధుల సమీకరణకు ఆసక్తి
- వచ్చే ఆర్థిక సంవత్సరం డజనుకుపైగా సంస్థలు క్యూ



న్యూఢిల్లీ, జనవరి 1: వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) రుణ ఈటీఎఫ్‌ల ద్వారా నిధుల సమీకరణకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)లు ఆసక్తి కనబరుస్తున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తొలిసారిగా ఈ డెట్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)ను పరిచయం చేస్తుండగా, తమ మూలధన వ్యయ అవసరాలకు ఈ నిధులను వినియోగించాలని సీపీఎస్ఈలు భావిస్తున్నాయి. కాగా, రుణ ఈటీఎఫ్ మార్గంలో భాగంగా బాండ్ల జారీ ద్వారా నిధుల సమీకరణకు 'ఏఏఏ', 'ఏఏ' రేటింగ్ సీపీఎస్ఈలకు మాత్రమే అవకాశం ఇవ్వనున్నది ఆర్థిక మంత్రిత్వ శాఖ. దీంతో 'ఏఏఏ', 'ఏఏ' రేటింగ్ ఉన్న 10-15 సీపీఎస్ఈలు వచ్చే ఆర్థిక సంవత్సరం నిధులను సమీకరించాలని ఉత్సాహంగా ఉన్నట్లు ఓ సంబంధిత అధికారి పీటీఐకి తెలిపారు. ఈ బాండ్లు రెండు, మూడు లేదా ఐదేండ్ల కాలపరిమితితో ఉంటాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ గతేడాది ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా రుణ ఈటీఎఫ్‌లను ప్రకటించిన విషయం తెలిసిందే. సీపీఎస్ఈ ఈటీఎఫ్, భారత్-22 ఈటీఎఫ్‌ల వంటి ఈక్విటీ ఈటీఎఫ్‌లు విజయవంతమైన నేపథ్యంలోనే ఈ రుణ ఈటీఎఫ్‌లను కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది.

బ్యాంకులకూ అవకాశం

ఇదిలావుంటే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లూ రుణ ఈటీఎఫ్‌ల ద్వారా నిధులను సమీకరించుకోవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రుణ ఈటీఎఫ్‌లు బ్యాంకుల నిధుల సమీకరణకు ఇతోధికంగా సాయపడగలవన్న భావనతోనే కేంద్రం ఈ అవకాశం ఇచ్చినట్లు తెలుస్తున్నది. మరోవైపు మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)తో సతమతమవుతున్న ప్రభుత్వ బ్యాంకింగ్ రంగానికి రుణ ఈటీఎఫ్‌ల్లో పాల్గొనే అవకాశం ఇవ్వడం మంచిదేనన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి.

ఎంఎస్ఎంఈలకు గొప్ప ఊరట

- ఆర్బీఐ నూతన సంవత్సరపు కానుక
- రూ.25 కోట్ల వరకు రుణాల ఏకకాల పునర్వ్యవస్థీకరణకు అనుమతి



ముంబై, జనవరి 1: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ)కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన సంవత్సర కానుకనిచ్చింది. పాత పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు, రుణ సంక్షోభంలో ఎంఎస్ఎంఈలు కొట్టుమిట్టాడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రూ.25 కోట్ల వరకు రుణాలున్న సంస్థలను సదరు రుణాల ఏకకాల పునర్వ్యవస్థీకరణకు ఆర్బీఐ అనుమతించింది. ఈ నిర్ణయంతో ఎంఎస్ఎంఈలకు గొప్ప ఊరట లభించినట్లైంది. గతేడాది నవంబర్ 19న జరిగిన ఆర్బీఐ కీలక బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఈ నెల 1 నాటికి రుణ విలువ ఏ రకంగానూ రూ.25 కోట్లకు మించకపోతే.. దాన్ని వచ్చే ఏడాది మార్చి 31దాకా పునర్వ్యవస్థీకరించుకోవచ్చని ఆర్బీఐ మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

పంతం నెగ్గించుకున్న కేంద్రం

ఆర్బీఐ-కేంద్రం మధ్య విభేదాలకు ఎంఎస్ఎంఈల రుణాల పునర్వ్యవస్థీకరణ కూడా ఓ కారణమే. బ్యాంకింగ్ రంగంలో, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) సమస్యతో సతమతమవుతున్న నేపథ్యంలో రుణాల పునర్వ్యవస్థీకరణకు అప్పటి ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ససేమిరా అన్నారు. కానీ వ్యవస్థలో ద్రవ్యకొరత ఉన్నందున పారిశ్రామిక రంగానికి, కనీసం ఎంఎస్ఎంఈలకైనా అండగా నిలువాలని మోదీ సర్కారు పట్టుబట్టింది. ఈ క్రమంలో పటేల్ రాజీనామా చేయడం, కొత్త గవర్నర్‌గా శక్తికాంత దాస్ రావడం జరుగగా, ప్రభుత్వం అనుకున్నట్లుగానే రుణాల పునర్వ్యవస్థీకరణ అవుతుండటంతో కేంద్రం పంతం నెగ్గించుకున్నట్లైంది. రుణ చెల్లింపుల్లో డిఫాల్ట్ అయిన సంస్థలకు లాభం చేకూరినట్లైంది.

'ఆటో'కు అచ్చిరాని డిసెంబర్



న్యూఢిల్లీ, జనవరి 1: ఆటోమొబైల్ సంస్థలకు డిసెంబర్ నెల నిరాశనే మిగిల్చింది. దేశ ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటంతో వాహన దిగ్గజాల్లో అత్యధిక సంస్థలకు విక్రయాల్లో ఎదురుదెబ్బలు తగిలాయి. అమ్మకాలను పెంచుకోవడానికి పలు సంస్థలు రాయితీలు ఇచ్చినప్పటికీ కొనుగోలుదారులు కన్నెత్తి కూడా చూడలేదు. మారుతి, హ్యుందాయ్, హోండా, టాటా మోటార్స్‌ల వృద్ధి సింగిల్ డిజిట్‌కే పరిమితమవగా, మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాలు పతనం చెందాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ అమ్మకాలు కేవలం 1.8 శాతం పెరిగి 1,21,479 లకు చేరుకున్నాయి. క్రితం ఏడాది ఇదే నెలలో సంస్థ 1,19,286 యూనిట్ల అమ్మకాలు జరిపింది. హ్యుందాయ్ మోటార్ లిమిటెడ్ దేశీయంగా 42,093 యూనిట్ల కార్లను విక్రయించింది. 2017 డిసెంబర్‌లో విక్రయించిన 40,158 యూనిట్లతో పోలిస్తే 4.6 శాతం వృద్ధి మాత్రమే కనబరిచింది. అలాగే హోండా కార్స్ అమ్మకాలు 4 శాతం పెరిగి 13,139లకు చేరుకున్నాయి. నిరుడు ఇదే నెలలో సంస్థ 12,642లను విక్రయించింది. మరో దేశీయ సంస్థ టాటా మోటార్స్‌కు కూడా నిరాశే ఎదురైంది. ఏడాది ప్రాతిపదికన గత నెలలో కంపెనీ విక్రయాలు కేవలం ఒక్క శాతమే పెరిగి 14,260లకు చేరుకున్నాయి. ఇంకోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా ప్యాసింజర్ వాహన విక్రయాలు 3 శాతం క్షీణించి 15,091లకు జారుకున్నాయి. ఈ సందర్భంగా మహీంద్రా ప్రెసిడెంట్(ఆటోమోటివ్) రాజన్ వాధేరా మాట్లాడుతూ.. నిధులు లభ్యత తగ్గిందని, కొనుగోలు సెంటిమెంట్ పడిపోయిందన్నారు. అలాగే కంపెనీ ట్రాక్టర్ల అమ్మకాలు 6 శాతం క్షీణించి 17,404లకు పరిమితమయ్యాయి. ఎస్కార్ట్ ట్రాక్టర్ల అమ్మకాలు 27.5 శాతం పెరిగి 4,598లకు చేరుకోవడం విశేషం. వీఈ కమర్షియల్ వాహన విక్రయాల్లో 2.4 శాతం వృద్ధి నమోదైంది. ఇక ద్విచక్ర వాహన విక్రయాల్లోనూ నిరాశే ఎదురైంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ సేల్స్ 14 శాతం తగ్గి 56,026గా ఉన్నాయి.



'ఎ గ్రీన్ గార్లాండ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : హరితహారం కార్యక్రమానికి సంఘీభావంగా రూపొందించిన 'ఎ గ్రీన్ గార్లాండ్' పుస్తకాన్ని గవర్నర్ నరసింహన్ ఆవిష్కరించారు. హరితహారంపై పలువురు రాసిన కవితల్లో 110 మంది కవితలతో రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఈ పుస్తకాన్ని ఆంగ్లంలో రూపొందించింది.దీనికి సంపాదకులుగా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ప్రొఫెసర్ దామోదర్ వ్యవహరించారు.ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ ఈ పుస్తకం సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా ఉందన్నారు. కొత్త సంవత్సరంలో ఇటువంటి పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందం కలిగించిందన్నారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో పుస్తకాన్ని వెలువరించినందుకు మామిడి హరికృష్ణను అభినందించారు.

పసుపు పంటలను పరిశీలించిన కడప రైతులు

ముప్కాల్: నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం రెంజర్లలో సాగుచేస్తున్న పసుపు పంటను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా నాగిరెడ్డిపల్లెకు చెందిన రైతులు బుసిరెడ్డి, సుబ్బారెడ్డి, నర్సారెడ్డిలతో కూడిన బృందం మంగళవారం పరిశీలించింది. పసుపు పంటలను పరిశీలించిన బృందం సాగు విధానాలు స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నది. ఇక్కడి రైతులు పసుపు సాగులో అవలంబిస్తున్న మెలకువలు, విధానాలు బాగున్నాయని కడప రైతులు అభినందించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా పసుపు సాగుకు పెట్టింది పేరు కావడంతో సందర్శనకు వచ్చినట్లు బృందం తెలిపింది. వారి వెంట రాంరెడ్డి, లింబాద్రి, రిక్కల దేవారెడ్డి, కుమ్మరి భూమేశ్ తదితరులు ఉన్నారు.



నిజామాబాద్ జిల్లా రెంజర్లలో పసుపు పంటను పరిశీలిస్తున్న కడప జిల్లా రైతులు

హోంమంత్రి మహమూద్ అలీకి పలువురి శుభాకాంక్షలు



హోంమంత్రి మహమూద్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మంగళవారం మంత్రుల నివాస సముదాయంలో హోం మంత్రి మహమూద్‌అలీని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్, అడిషనల్ సీపీలు షిఖాగోయల్, అనిల్ కుమార్‌తోపాటు పలువురు డీసీపీలు, పోలీస్ అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



హోంమంత్రి మహమూద్‌అలీకి పూలమొక్కను బహూకరిస్తున్న రాచకొండ సీపీ మహేశ్‌భగవత్ తదితరులు

జక్కన్నపేట వద్ద కొత్త రాతిచిత్రాలు


గుర్తించిన తెలంగాణ జాగృతి చరిత్ర బృందం ● మధ్యరాతి యుగానికి చెందినవిగా గుర్తింపు



నల్లగుట్టలోని ఓ బండపై ఎరుపు, పసుపు రంగులతో వేసిన రాతిచిత్రం



లిపిని తలపిస్తున్న రాతిచిత్రం



తెలంగాణ జాగృతి చరిత్ర బృంద సభ్యులు సభ్యులు హరగోపాల్, శంకర్‌రెడ్డి, చంటి, రాజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలంలోని జక్కన్నపేట గ్రామం నల్లగుట్టపై తెలంగాణ జాగృతి చరిత్ర బృందం కొత్త రాతిచిత్రాల తావును గుర్తించింది. నల్లగుట్టపై 18.08563963 ఉత్తర అంక్షాంశాలు, 78.25944545 తూర్పు రేఖాంశాల వద్ద ఉన్న ఈ చిత్రాలను మంగళవారం తెలంగాణ జాగృతి చరిత్ర బృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, బొగ్గుల శంకర్‌రెడ్డి, చంటి, రాజు గుర్తించారు. నల్లగుట్టపై నైరుతి మూలనఉన్న రాతిగుహలో త్రిభుజాకృతి రాతిబండలోపలి వైపు వేసిన రంగుల చిత్రాలు అరుదైనవిగా వారు పేర్కొన్నారు. అంతులేని గీతల ముగ్గుల వంటి డిజైన్లు, మధ్యలో ఎరుపు, పసుపు బొద్దు గీతలో చతురస్రాకారపు బిళ్లల డిజైన్ల రాతి చిత్రాలు చాలా అరుదైనవని తెలిపారు. ఇవి మధ్యరాతియుగానికి చెందినవనిగా భావిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడే మూడురకాల శైలులలో రాతిచిత్రాలు కనిపించాయని.. ఎరుపు రంగు సన్నని గీతలు, ఎరుపు రంగు బొద్దు గీతలు, ఎరుపు, పసుపు రంగుల బొద్దు గీతల అంతరాంతర డిజైన్లు, ఎద్దుల బొమ్మలు ఒకేచోట కనిపించినట్టు బృందం సభ్యులు తెలిపారు. ఎద్దు బొమ్మలు కొత్త రాతియుగానికి ప్రతీకలని, రాతి చిత్రాలున్న గుహ బయట రాతి పని ముట్లు నూరిన గుర్తులున్నాయన్నారు. మరోచోట లిపి వంటి ఎరుపు రంగు బొద్దు గీతలున్నాయని, ఈ గీతలు కొత్త రాతియుగం నాటివి కావచ్చని భావిస్తున్నామన్నారు. ఇలాంటి గీతలు వర్గల్ రాతి చిత్రాల్లోనూ కనిపించాయని బొగ్గుల శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. పాత రాతిచిత్రాలపై కొత్త చిత్రాలుండటంతో ఇవి వివిధ కాలాల్లో వేసినట్టు తెలుస్తున్నదని.. వాటి రేఖలు, రంగులను బట్టి మధ్య, కొత్తరాతియుగాలకు సంధానకాలానికి చెందినవై ఉండవచ్చని భావిస్తున్నట్టు తెలిపారు.



మంగళ వారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో నూతన సంవత్సర కేక్‌ను కట్‌చేస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో ప్రధాన కార్యదర్శి రాజేందర్ తదితరులు

త్వరలో గజ్వేల్‌కు రైలు!

- తుది దశకు చేరిన మనోహరాబాద్- గజ్వేల్ మార్గం పనులు
- మార్చి నెలాఖరులో ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు



హైదరాబాద్/గజ్వేల్, నమస్తే తెలంగాణ: మనోహరాబాద్- కొత్తపల్లి నూతన రైలు మార్గంలో మొదటి దశ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు 32 కిలోమీటర్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో గిరిపల్లి వరకు 25 కిలోమీటర్ల దూరం పట్టాలు పరిచే పనులు దాదాపు పూర్తయ్యాయి. గిరిపల్లి నుంచి గజ్వేల్ వరకు మిగిలిన ఏడు కిలోమీటర్ల మార్గంలో పట్టాలు పరిచి లింకింగ్ పనులు చురుగ్గాసాగుతున్నాయి. మనోహరాబాద్ నుంచి నాచారంగుట్ట వరకు 8 కిలోమీటర్ల మార్గంలో భవనాలు, స్టేషన్ల పనులు 50 శాతం పూర్తయ్యాయి. గజ్వేల్ రింగ్ రోడ్డు వద్ద ఎత్తైన వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తూప్రాన్ మండలంలోని రామాయపల్లి వద్ద హైవేపై బ్రిడ్జితోపాటు చిన్న చిన్న బ్రిడ్జిలు, రైల్వే స్టేషన్ల భవన నిర్మాణాలను మార్చివరకు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి 31నాటికి మనోహరాబాద్- గజ్వేల్ మధ్య ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో రైల్వేశాఖ కూడా మొదటి దశ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం కాచిగూడ, సికింద్రాబాద్ నుంచి మనోహరాబాద్ వరకు డెమో రైళ్లు నడుస్తున్నాయి. మనోహరాబాద్- గజ్వేల్ మార్గం పూర్తయ్యాక డెమో రైళ్లను గజ్వేల్ పట్టణంవరకు పొడిగించే అవకాశం ఉన్నదని అధికారవర్గాలు చెప్తున్నాయి. 2020లో సిద్దిపేట పట్టణంవరకు, 2021-22 మార్చినాటికి కొత్తపల్లివరకు రైలు మార్గాన్ని పూర్తిచేయాలనే లక్ష్యంతో పనులు సాగుతున్నాయి.

పురోగతిలో పనులు

మొదటి దశ నిర్మాణంలో భాగంగా కావాల్సిన భూమిని సేకరించి రైల్వేశాఖకు అప్పగించారు. కరకట్టల నిర్మాణం వంటి మట్టి పనులు, చిన్న చిన్న వంతెనల నిర్మాణ పనులను మార్చి 2019లోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు ముందుకుసాగుతున్నారు. మనోహరాబాద్- కొత్తపల్లి కొత్త రైలుమార్గంలో మొత్తం 160 వంతెనలు, ఏడు రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్వోబీలు), 49 రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీలు), 13 కొత్త రైల్వేస్టేషన్లు (క్రాసింగ్ స్టేషన్లు 8, హాల్ట్‌స్టేషన్లు 5) ఉన్నాయి. నాచారం, ఇరగవరం (హాల్ట్), గజ్వేల్, కొడకండ్ల (హాల్ట్), లకుడారం, దుద్దెడ, సిద్దిపేట, గుర్రాలగొంది (హాల్ట్), చిన్నలింగాపూర్, సిరిసిల్ల, వేములవాడ, బోయినపల్లి, వెదిర (హాల్ట్) తదితర కొత్త స్టేషన్లు ఉన్నాయి.

దశాబ్దాల కల త్వరలో సాకారం

సీఎం కేసీఆర్ కలల ప్రాజెక్టు హైదరాబాద్- కరీంనగర్ (మనోహరాబాద్- కొత్తపల్లి) రైల్వేలైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజల కల త్వరలో సాకారం కానున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణతోపాటు మూడోవంతు వ్యయాన్ని భరించనున్నది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖతో ఒప్పందం చేసుకోవడంతో పనుల్లో వేగం పెరిగింది. మెదక్ జిల్లాలోని మనోహరాబాద్, కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి మధ్య నిర్మాణమయ్యే ఈ కొత్త రైలు మార్గానికి ప్రధాని నరేంద్రమోదీ 2016 ఆగస్టులో శంకుస్థాపనచేశారు. ఈ ప్రాజెక్టు మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల మధ్య రూ.1,160 కోట్ల అంచనా వ్యయంతో దాదాపు 151.40 కిలోమీటర్ల పొడవున రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు రైల్వేశాఖ 2017-18లో రూ.350 కోట్లు, 2018-19 రైల్వే బడ్జెట్‌లో రూ.125 కోట్లు కేటాయించింది. ఈ కొత్త రైలు మార్గం రాష్ట్రంలోని గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ (దక్షిణ కాశీ) వంటి ప్రధాన పట్టణాల గుండా నిర్మాణమవుతున్నది.

నాలుగు దశల్లో పనులు

- మొదటి దశ: మనోహరాబాద్- గజ్వేల్ (32 కి.మీ.)
- రెండో దశ: గజ్వేల్ - దుద్దెడ (32.15 కి.మీ.)
- మూడో దశ: దుద్దెడ- సిరిసిల్ల (48.65 కి.మీ.)
- నాలుగో దశ: సిరిసిల్ల - కొత్తపల్లి (38.60 కి.మీ.)

గీతదాటితే చలాన్‌ల మోతే!

- రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాల కొరడా
- చలాన్ వసూళ్లలో 92 శాతం వృద్ధి
- నిబంధనలు పాటించడంలో వాహనదారుల్లో సానుకూల మార్పు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గీతదాటితే.. వాతే అంటున్నారు ట్రాఫిక్ విభాగం పోలీసులు. సిగ్నల్ జంప్ చేసినా.. హెల్మెట్ పెట్టుకోకపోయినా.. మద్యం తాగి వాహనం నడిపినా.. ఏ నిబంధన అతిక్రమించినా.. తప్పదు చలాన్‌ల మోత అంటున్నారు. రహదారి భద్రత నిబంధనలు సరిగా పాటించేలా.. వాహనదారుల్లో అవగాహన మరింత పెంచేలా.. ట్రాఫిక్ పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి పెడుతున్నారు. ఉల్లంఘించినవారిపై చలాన్‌ల కొరడా ఝులిపిస్తున్నారు. కొద్దిరోజుల కిందట రోడ్‌సేఫ్టీ అథారిటీ చైర్మన్ కృష్ణప్రసాద్ విడుదల చేసిన నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారుల నుంచి 2018 (నవంబర్ వరకు) మొత్తం రూ.235.59 కోట్లు జరిమానాగా వసూలు అయ్యాయి. ఏటా ఈ మొత్తం పెరుగుతున్నది. 2016లో రూ.124 కోట్లు వసూలు కాగా, 2017లో రూ.190 కోట్లకు చేరింది. 2016 నుంచి 2018 నవంబర్ వరకు చూస్తే జరిమానా చలాన్‌ల మొత్తం ఏకంగా 92 శాతం పెరిగింది. భద్రత నిబంధనలు పాటించవారిపై కేసుల నమోదులో 32 శాతం వరకు పెరుగుదల నమోదయింది. రాష్ట్రవ్యాప్తంగా 2016లో 71,07,173 కేసులు నమోదు చేయగా, 2018లో 93,92,343 కేసులు నమోదు చేశారు. అదే సమయంలో రోడ్డు ప్రమాదాలు సైతం 11 శాతం వరకు తగ్గాయి. మృతుల సంఖ్య 17 శాతం వరకు తగ్గింది. 2016లో రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య 7,219 ఉంటే 2018లో 5,985కు తగ్గింది. నిబంధనలు పాటించేలా పోలీసులు తీసుకుంటున్న చర్యలు వాహనదారుల్లో సానుకూల మార్పు తెస్తున్నాయనడానికి ఇది ఉదాహరణగా చెప్పొచ్చు. ఇప్పటి వరకు హైదరాబాద్‌తోపాటు మిగిలిన కమిషనరేట్ల పరిధిలో ఈచలాన్ విధానం అమలులో ఉండగా, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లకు విస్తరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

2016 నుంచి 2018 నవంబర్ వరకు నమోదైన కేసులు- ప్రమాదాల తీరు

ఏడాది	నమోదైన కేసులు	వసూలైన జరిమానా	ప్రమాదాలు	మృతులు
2016	71,07,173	రూ.124 కోట్లు	22,811	7,219
2017	84,83,509	రూ.190 కోట్లు	22,484	6,596
2018	93,92,343	రూ.235.59 కోట్లు	20,325	5,985

ప్రయాణ బీమాకు పెరుగుతున్న ఆదరణ

- 2020 నాటికి 28 వేల కోట్లకు
- రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రయాణ బీమా రంగంలో విశేష వృద్ధి కనిపిస్తున్నదని, 2020నాటికి ఈ రంగంలో వ్యాపారం రూ.28 వేల కోట్లకు చేరనున్నదని రిలయన్స్ జనరల్ ఇన్సురెన్స్ సీఈవో రాకేశ్ జైన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ దేశాల మధ్య ప్రయాణించేవారి సంఖ్య పెరుగుతుండటంతో ప్రయాణ బీమా చేసుకునేవారిసంఖ్య అధికమవుతున్నదని విశ్లేషించారు. పాస్‌పోర్ట్ కోల్పోవడం, విమానాలు జాప్యం కావడం లేదా మిస్‌కావడం, లగేజీ మిస్ కావడం, ఆకస్మిక ఆరోగ్య సమస్య వంటివి తరచూ ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఇబ్బందులను ఎదుర్కొనేందుకు ప్రయాణికులు బీమాను ఆశ్రయిస్తున్నారని వివరించారు. కంపెనీలకు అతీతంగా ప్రయాణ బీమాను ఎక్కువ మంది కోరుకుంటున్నారని, తద్వారా ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయని ఆయన వివరించారు.



కల్వర్టు కిందికి దూసుకుపోయిన బస్సు

- మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో ఘటన

నారాయణపేట రూరల్: అడ్డంగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కల్వర్టు కిందికి దూసుకుపోయిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట పట్టణ సమీపంలోని సింగారం చౌరస్తా వద్ద జరిగింది. నారాయణపేట డిపోకు చెందిన బస్సు మక్తల్‌కు వెళ్తుండగా.. సింగారం చౌరస్తా వద్ద అకస్మాత్తుగా ద్విచక్ర వాహనదారుడు అడ్డం వచ్చాడు. బైక్‌ను తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పి కల్వర్టు కిందికి దూసుకుపోయింది. బస్సులో 21 మంది ప్రయాణికులు ఉండగా.. సుధాకర్ అనే వ్యక్తి కాలుకు తీవ్ర గాయమైంది.

ట్రావెల్స్ బస్సు, ట్రాక్టర్ ఢీ

పర్వతగిరి: వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చౌటపెల్లి శివారులోని మూల మలుపు వద్ద మంగళవారం తెల్లవారు జామున ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొన్నాయి. వరంగల్ నుంచి పర్వతగిరి వైపు వస్తున్న ట్రావెల్ బస్సు, సోమారం నుంచి తీగరాజుపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో బస్సు ముందుభాగం దెబ్బతినగా, ట్రాక్టర్ నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో డ్రైవర్లకు ప్రమాదం తప్పి, స్వల్ప గాయాలతో బయటపడినట్లు ఎస్సై కరుణాకర్‌రావు తెలిపారు.



వరంగల్‌లో ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ట్రాక్టర్

అధునాతన హంగులతో డీపీవోలు

- శరవేగంగా జిల్లా పోలీస్ భవన నిర్మాణాలు
- నాలుగు నెలల్లో నాలుగు.. 2020 చివరికి అన్ని డీపీవోలు పూర్తి
- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ మల్లారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అత్యాధునిక హంగులతో జిల్లా పోలీస్ కార్యాలయాల (డీపీవో) భవన నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 కొత్త డీపీవోలు, రెండు కమిషనరేట్ల పనులు వచ్చే ఏడాది చివరినాటికి పూర్తిచేసే ప్రణాళికలతో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ముందుకెళ్తున్నది. ఇప్పటికే కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్‌లలో భవనాలు మూడో అంతస్థు వరకు పూర్తయ్యాయి. ఇంటీరియర్ పనులు మొదలయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జగిత్యాల, మెదక్ జిల్లాల పోలీస్ కార్యాలయాల పనులు ఇంకా తొలిదశలో ఉన్నాయి. సిద్దిపేట, రామగుండం పోలీస్ కమిషనరేట్ భవనాల పనులు కొనసాగుతున్నాయి, స్థలం అందుబాటునుబట్టి ఒక్కో డీపీవోను 15 నుంచి 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు నిర్మిస్తున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం, ఏఆర్ హెడ్‌క్వార్టర్లు, పరేడ్ గ్రౌండ్, బ్యారెక్స్ తదితరాలు ఒక్కచోటే వచ్చేలా ప్రణాళికాబద్ధంగా నిర్మాణ పనులు చేపట్టారు. ఎస్పీ, అడిషనల్ ఎస్పీ కార్యాలయాలతోపాటు జిల్లా పోలీస్ విభాగం నిర్వహణ అధికారుల చాంబర్లు, ట్రైనింగ్ క్లాసులు, డిజిటల్ ల్యాబులు, కాన్ఫరెన్స్ హాళ్లు, పరిపాలనా విభాగాలు ఒకేచోట నిర్మిస్తున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రూ.15 కోట్లు, రూ.10 కోట్లతో ఏఆర్ హెడ్‌క్వార్టర్లు, పరేడ్ గ్రౌండ్స్, బ్యారెక్స్ నిర్మాణాలు జరుగుతున్నాయి.



ఆసిఫాబాద్‌లో శరవేగంగా సాగుతున్న డీపీవో భవన నిర్మాణం

వచ్చే ఏడాది చివరికల్లా పూర్తిచేస్తాం



రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పోలీస్ కార్యాలయ భవన నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. పోలీసుల అవసరాలకు అనుగుణంగా అన్ని వసతులు కల్పిస్తున్నాం. నాలుగు నెలల్లో కొన్ని డీపీవోలు అందుబాటులోకి వస్తాయి. మొత్తం భవనాలు వచ్చే ఏడాది చివరికల్లా పూర్తిచేసే ప్రణాళిక పెట్టుకున్నాం. అనుకున్న సమయానికి భవనాలు పూర్తిచేస్తాం.

మల్లారెడ్డి, ఎండీ, తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్

టీఆర్‌ఎస్ నాయకుడి హత్య

- బోరు విషయంలో గొడవ.. మంబాపూర్‌లో దారుణం

పెద్దేముల్: పొలంలో బోరు వేసే విషయంలో నెలకొన్న వివాదం టీఆర్‌ఎస్ నాయకుడి హత్యకు దారితీసింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మంబాపూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ మల్కాజ్‌గిరిలోని గౌతమీనగర్‌లో నివాసం ఉండే టీఆర్‌ఎస్ నాయకుడు సీవీ ప్రసాద్‌రావు మంబాపూర్‌లో వ్యవసాయం చేస్తున్నాడు. అప్పుడప్పుడు వెళ్లి వస్తుంటాడు. మంగళవారం తన పొలం బోరు వేయించాడు. తమ బోరు బావికి దగ్గరగా బోరు ఎలా వేయిస్తున్నావంటూ పక్క పొలం రైతులు ప్రసాద్‌రావును నిలదీశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. పక్క పొలం రైతులు కర్రలతో దాడి చేయడంతో ప్రసాద్‌రావు(55) అక్కడికక్కడే మరణించాడు. తాండూర్ డీఎస్పీ రామచంద్రుడు, రూరల్ సీఐ ఉపేందర్, పెద్దేముల్ ఎస్సై సురేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రసాద్‌రావు మృతదేహం తల భాగం వద్ద ఒక పెద్ద మట్టి పెల్ల, హత్యకు ఉపయోగించిన కర్రను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణ మధ్య రైల్వే ఇంచార్జి జీఎంగా కుల్‌శ్రేష్ఠ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్షిణ మధ్య రైల్వే ఇంచార్జి జీఎంగా ఆర్‌కే కుల్‌శ్రేష్ఠ నియమితులయ్యారు. ఇప్పటి వరకు జీఎంగా ఉన్న వినోద్ కుమార్ యాదవ్ ఇండియన్ రైల్వేబోర్డు చైర్మన్‌గా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఇంచార్జి జీఎంగా కుల్‌శ్రేష్ఠ నియమితులయ్యారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గం

- అధ్యక్షుడిగా సీహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శిగా చావా రవి ఎన్నిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌యూటీఎఫ్ (తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సీహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శిగా చావా రవిని ఎన్నుకొన్నట్టు టీఎస్‌యూటీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త కార్యవర్గం రెండేండ్లపాటు (2019 నుంచి 2021) కొనసాగనున్నది. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది ఎంఏకే దత్తు వ్యవహరించారు. మొత్తం 21 మంది ఆఫీస్ బేరర్లు, ఆరుగురు సభ్యుల రాష్ట్ర ఆడిట్ కమిటీ, ఏడుగురు సభ్యుల వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక సంపాదకవర్గాన్ని ఎన్నుకొన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావా రవి హామీ ఇచ్చారు.

గోడ కూలి వ్యక్తి మృతి

రామచంద్రాపురం: గోడ కూలి వ్యక్తి మృతి చెందిన ఘటన జీహెచ్‌ఎంసీ పరిధిలోని భారతీనగర్ డివిజన్ బొంబాయి కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలానికి చెందిన మల్లేషం (30) ఆర్సీపురంలో ఉంటూ మేస్త్రీ పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి బొంబాయి కాలనీలోని ఓ ఇంటి వద్ద మల్లేషం డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేస్తుండగా పక్కనే ఉన్న ప్రహరీ గోడ కూలి అతనిపై పడడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రవికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హిందీ బిగ్‌బాస్ 12 విజేత ఎవరు?
సోషల్ మీడియాలో ప్రభావశీలురైన టీనేజర్లున్నారా?

యువలో..

2019 సంవత్సరం.. 5జీ నామ సంవత్సరంగా మారనున్నదా?

సంకేతలో..



నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 2 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



మన శిల్పాలకు గున్నార్ ఫిదా

మమ్మీ సినిమాలో ఒళ్లు గగుర్పాటుకు గురిచేసే ఏడారి ఇసుక కెరటాలు, ఇసుక తుపాన్లు మనసుని ఎంత కలవరానికి, కల్లోలానికి గురిచేస్తాయో ఐస్‌ల్యాండ్ దేశంలో కూడా మంచుతుపాన్లు అంతే గగుర్పాటుకు గురిచేస్తాయి. అటువంటి దేశం నుంచి అదీ కూడా తన ఫొటో, వీడియోగ్రఫీ ద్వారా అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతలు గడించడమేకాదు, లెక్కలేనన్ని అవార్డులు సొంతం చేసుకున్న ఒక చిత్రకారుడు రాష్ట్రంలో పర్యటించారు. రెండు రోజులపాటు వరంగల్ మహానగరాన్ని తన వీడియోలో బంధించారు. కాకతీయ శిలా తోరణాలను చూసి నివ్వెరపోయాడు. తన స్నేహితుడి ఇంటికి వచ్చిన ఆయన వరంగల్ నగరంలోని చారిత్రక కట్టడాలకు చిత్రికపట్టాడు. దృశ్యమానం చేశాడు. అతడే గున్నార్ స్టెనిన్.

అచ్చమైన మంచుదేశం.. మహా అయితే చదరపు కిలోమీటరుకు ఇద్దరికన్నా తక్కువ జనసాంద్రత ఉన్న దేశం.. 40 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ దేశ జనాభా కేవలం మూడున్నర లక్షలే. ఉత్తర అట్లాంటిక్‌లో ఆ చిన్న మంచుదేశానికి చెందిన ఫొటోగ్రాఫర్ గున్నార్ స్టెనిన్. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు తిరిగినా గున్నార్‌కు భారతీయ సంప్రదాయం, ఆచారాలు అంటే వల్లమాలిన ప్రేమ. ఎంత ప్రేమ అంటే తన బుద్ధిబలానికి నిదర్శనంగా వినాయకుడిని పెనవేసుకునేంత. ఒకవైపు విఘ్నేశ్వరుడు, మరోవైపు కెమెరా పచ్చబొట్టుగా పొడిపించుకుని తన మనసును ఆవిష్కరించుకున్నారు గున్నార్ స్టెనిన్. టాటూ వేయించుకోవడం అంటే ఏ మెన్స్‌బ్యూటీ పార్లర్‌లోనో వేయించుకోలేదట తను. కోయంబత్తూర్‌లో మూడు గంటలపాటు సంప్రదాయ పచ్చబొట్టు సూదులతో పొడిపించుకున్నాడట. సౌండ్ ఇంజినీరింగ్ చదివిన తాను వృత్తి, ప్రవృత్తిగా కెమెరాను ఎంచుకున్నారు. వీడియో, ఫొటో కెమెరా తిరిగేందుకు 'టైమ్ లార్డ్జ్ ట్రాలీ' తన ఇంజినీరింగ్ ప్రతిభతో సొంతంగా ఆవిష్కరించుకున్నారు. ఒక దృశ్యం పదివేల పదాలతో సమానం అంటారు. వేలాది ఫొటోలు తీసి వందలాది అవార్డులను సొంతం చేసుకున్న గున్నార్‌ది విభిన్న వృత్తి జీవితం.

భారతీయ సంప్రదాయం పట్ల మక్కువ

గున్నార్ స్టెనిన్‌కు భారతీయ సంప్రదాయాలు, ఆచారాలు, భక్తి అంటే మక్కువ. తమ దేశంలో వివాహాలు కేవలం కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉన్నా తమ తల్లిదండ్రులు మాత్రం ఇప్పటికీ కలిసే ఉన్నారని గర్వపడతాడు. తండ్రి ఎలక్ట్రికల్ ఇంజినీర్, తల్లి నర్స్. మూడేళ్ల క్రితమే తల్లి కాలం చేసింది. తనకు భార్య ఉండేది అని నవ్వుతూ చెప్పారాయన. తనది కాంట్రాక్చువల్ మ్యారేజ్ సిస్టమ్ అని, తనకో కూతురుందని చెప్పారు. నేను ప్రపంచంలో అనేక దేశాలు తిరిగాను. ఇక్కడి సంప్రదయాలు చాలా గొప్పవి. మా దగ్గర వివాహ బంధానికి పెద్దగా పట్టింపుల్లేవు. కానీ నేనిక్కడ ఫ్రెండ్ పిలుపుతో ఓ మ్యారేజ్ చూశాను. నేనింత వరకు ఇటువంటి సనాతన వివాహ సంప్రదాయాన్ని చూడలేదు. పెళ్లికి ముందు రోజు నుంచి పెళ్లి, అనంతరం బరాత్ దృశ్యాలు చూసి ఆశ్చర్యపడ్డాను. వివాహ సన్నివేశం ఒక గొప్ప రిచ్యువల్‌గా అనిపించింది అంటూ ఆయన విప్పారిన మోహారవిందంతో పేర్కొన్నారు.

అరోరా బోరియల్స్

ప్రపంచంలో విస్తృత జనాదరణ పొందిన ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ల్యాండ్‌స్కేపింగ్‌లో నిష్ణాతుడు గున్నార్ స్టెనిన్. స్కాండినేవీయన్ దేశాల (నార్వే, స్వీడన్, డెన్మార్క్) అంచున ఉత్తర ధృవానికి చేరువలో శీతాకాలంలో రోజూ ఆకాశంలో ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి. అటువంటి దృశ్యాలకు చిత్రికపట్టేందుకు, వీడియో తీసేందుకు గున్నార్ ఎంతో శ్రమ, వ్యయ ప్రయాసాలకోర్చాడట. ప్రపంచంలో మానసిక ఆహ్లాదం పొందే అత్యద్భుత ప్రదేశం అరోరా బోరియల్స్ అంటాడాయన. రంగురంగుల నక్షత్రాలు ఆకాశంలో పరచుకొని మంచుపర్వతాలపై ఆవిష్కృతమయ్యే ఆ దృశ్యాలు చూడాలి కానీ మాటల్లో చెప్పలేనన్నాడు. ఒకసారి తాను ఆరోరా బోరియల్స్‌ను కెమెరాలో బంధించేందుకు ఎనిమిది గంటలకు రూ. 12 లక్షలు ఖర్చుచేసి హెలిక్యాప్టర్‌కు ఐదు కెమెరాలు బిగించి చేసిన ప్రయత్నం అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందని, అదే తనకు అత్యంత సంతోషం కలిగించే విషయమని చెప్పాడు. అంతేకాదు 360 డిగ్రీల కోణంలో స్టూడియో నిర్మించానని చెప్పాడు.

అబ్బురపరిచిన శిల్ప సోయగం

మంచుకొండలతో సహవాసం చేసే తనకు వరంగల్ ఏకశిలా శిల్ప సంపద మంత్రముగ్ధున్ని చేసిందన్నారు గున్నార్. నాలుగేళ్ల క్రితం ఉదయ్‌కిరణ్ (హన్మకొండకు చెందిన యువటెక్నోక్రాట్, నగరంలోని ప్రముఖ ఆర్కిటెక్చర్ మహేంద్ర కుమార్ కొడుకు)తో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆయన కోసం వరంగల్ వచ్చిన గున్నార్ 'ఇక్కడ ప్రజలు చాలా ప్రేమగా ఉన్నారు. ఇక్కడి కుటుంబ వ్యవస్థ చాలా సనాతనమైంది. తమ దేశంలోని మొత్తం జనాభా కంటే నగరంలోని రోడ్ల మీదున్న జనమే ఎక్కువగా ఉన్నారని, రోడ్లమీద నదీ ప్రవాహంలా జనప్రవాహం ఉంద'ని మురిసిపోయారు. ఖిలా వరంగల్‌లో రాళ్లపై చెక్కిన శిల్పాలను చూసి తానెంతో ఆశ్చర్యానికి అమితమైన సంతోషానికి లోనయ్యాయని అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు తిరిగినా ఎక్కడా ఇంత గొప్ప వారసత్వ సంపద ఉన్నట్టు తాను చూడలేదన్నారు. మరోసారి తన కూతురితో వచ్చి వారం రోజులు వరంగల్‌లోనే గడిపి ఇక్కడి గురించి ప్రపంచానికి మరింత తెలిసేలా తనవంతు ప్రయత్నం చేస్తానని ఆయన ముగించారు.

నూర శ్రీనివాస్
(వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ)
📷 గొట్టె వెంకన్న

మేడ్ బై ఐస్‌ల్యాండ్ పేజ్

గున్నార్ ఫేస్‌బుక్ పేజీ 'మేడ్ బై ఐస్‌ల్యాండ్' ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందింది. ఐస్‌ల్యాండ్‌కు అందాలను ఫొటోలు, వీడియోలు తీసి ఈ సైట్‌లో పెట్టడం ద్వారా ఉపాధితోపాటు, తన దేశానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చేందుకు దోహదం చేస్తున్నారాయన. అత్యుత్తమ ఫొటోలు తీయాలంటే కేవలం సాంకేతికపరమైన అంశాల్లో నిపుణత మాత్రమే ఉంటే సరిపోదని, అంతకుమించిన ఓపిక కావాలన్నారు. వృత్తిపట్ల నిబద్ధత, ప్రేమ, గౌరవం ఉండాలన్నారు. ఏ వృత్తిలో అయినా గుర్తింపు ఉంటుంది. కాకపోతే ఓపిక, పట్టుదల, మారుతున్న సాంకేతిక అంశాల పట్ల నిరంతరం మనుగడ, ఎదుగుదల, పరిణతితో ఆచరించే సామర్థ్యాన్ని అలవరుచుకోవాలని సూచించారు గున్నార్.



'హార్స్ ఫైటింగ్'కు అవార్డు

ఐస్‌ల్యాండ్‌లో రెండు గుర్రాలు మూడు గంటలపాటు ఏకబిగిన పోట్లాడుకున్న ఫొటో గున్నార్ స్టెనిన్‌కు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టింది. కొత్త గుర్రం రాకను నిరసించిన స్థానిక గుర్రం కొత్తగా వచ్చిన గుర్రాన్ని చీల్చిచెండాడుతుంది. నేను కారులో వెళుతున్నా. ఒక రెండు గుర్రాలు ఒకదాన్నొకటి సహించకుండా పోటీపడి మరీ కొట్లాడుకుంటున్నాయి. ఆగి చూశాను. కారులోని నా కెమెరాతో క్లిక్ మనిపిస్తూనే ఉన్నా. అవి పోట్లాడుకునేప్పుడు వాటి యజమాని వచ్చి వాటి కొట్లాటను విరమింపజేయాలని చూసినా ఊరుకోలేదు. ఒక్కోదశలో ఒక గుర్రాన్ని మరోగుర్రం నోటితో పట్టుకొని కిందపడేసినా మళ్లీ మళ్లీ లేచి పోరాటం చేస్తూనే ఉన్నాయి. చివరికి మూడు గంటల అనంతరం ఒక గుర్రాన్ని మరో గుర్రం అమాంతం కాళ్లతో ఎత్తి పడేసింది. అప్పుడూ కానీ పోటీ విరమణ కాలేదు. ఆ ఫొటో కోసం మూడు గంటలపాటు వేచి చూడాల్సి వచ్చింది. నా ఫొటో కోసం కాదు అవి పోట్లాడుకోవడం ఎప్పుడాపుతాయా అన్న ఉత్కంఠతో ఆ ఫొటో తీసిన అనుభూతినే కాదు, మూగజీవాల మధ్య, అదీ ఏకజాతి జంతువుల మధ్య ఇంతటి పోటీ ఎందుకూ అని బాధ పడ్డాను కూడా అని ఆయన అప్పటి తన జ్ఞాపకాన్ని పంచుకున్నాడు.

భర్తల జ్ఞాపకార్థకంగా!



ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తూ ఇద్దరూ ప్రాణాలు పోగొట్టుకున్నారు. వారికి జ్ఞాపకార్థంగా తమ భార్యలు అదే పర్వతాన్ని అధిరోహించాలని నిర్ణయించుకున్నారు. ఎవరా మహిళలు?

ప్రపంచంలోని ఎత్తయిన ఎవరెస్ట్ పర్వతం కాట్మండులో ఉన్నది. ఈ పర్వతాన్ని అధిరోహించడానికి చాలా మంది ప్రయత్నించి విఫలమయ్యారు. కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోయారు. వారు కన్న కల కలగానే ఉండిపోతుంది. ఆ విధంగా ప్రాణాలు కోల్పోయిన వారిలో ఇద్దరి భార్యలు వారికి జ్ఞాపకార్థకంగా అదే పర్వతాన్ని అధిరోహించి వారి కలను నెరవేర్చాలనుకున్నారు. ఒకరు 42 యేండ్ల పుర్దికి షెర్పా, మరొకరు 36 యేండ్ల నిమా డోమ షెర్పా. 2013లో పుర్దికి భర్త 8,850 మీ. ఎత్తులో తన విదేశీ ఖాతాదారులకు తాడుని అందిస్తూ కిందపడి మరణిస్తాడు. నిమా భర్త 2014లో షెర్పాస్ బేస్ క్యాంప్ వద్ద చనిపోయాడు. పుర్దికి, నిమా ఇద్దరూ వారి భర్తలు అనుకున్నది నెరవేర్చాలనుకున్నారు. భర్తని పోగొట్టుకొని పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని వారి ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఇద్దరూ శిక్షణ తీసుకున్నారు. మొదట రెండు చిన్న శిఖరాలను అధిరోహించారు. పుర్దికి ఇద్దరు పిల్లలు. భర్త చనిపోయాక ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నది. నా భర్త చనిపోయినా ఎప్పుడూ నా వెంటే ఉంటాడు. అనుకున్నది తప్పకుండా నెరవేర్చాలనుకున్నది. కన్నబిడ్డలు, తోబుట్టువులను వదిలి ముందుకు నడిచారు. చైనా-నేపాల్ బార్డర్‌ని అధిరోహించడానికి అన్ని విధాలా సిద్ధమయ్యారు. వీరిద్దరూ ఎందరో మహిళలకి ఆదర్శంగా నిలిచారు.

కనువిందుగా!


సాధారణంగా స్త్రీల కళ్లు అందంగా ఉంటాయి. కనురెప్పలపై గల జుట్టు రాలిపోవడం వల్ల అందాన్ని కోల్పోతుంటారు. ఈ కొన్ని చిట్కాలు పాటిస్తే కనురెప్పలు అందంగా కనిపిస్తాయని చెబుతున్నారు బ్యూటీషియన్లు.



- కొంతమందికి కనురెప్పలు పలుచగా ఉంటాయి. వాటిని తరచూ ట్రిమ్ చేసుకుంటూ ఉండాలి. అలా చేస్తే కనురెప్పలు ప్రేరేపితమై ఒత్తుగా పెరుగుతాయి. కొన్ని రోజులకి కనురెప్పలు మెండుగా పెరుగుతాయి.
- రక్తప్రసరణ సరిగా లేకపోవడం వల్ల కూడా కనురెప్పలు రాలిపోవడం జరుగుతుంది. అప్పుడప్పుడు కళ్లను మూసి వేళ్లతో సున్నితంగా కంటిపై మర్దన చేసుకోవాలి. ఇలా చేస్తే కంటి రక్తప్రసరణ పెరిగి కనురెప్పలు పెరుగుతాయి.
- కంటి అలసట, ఒత్తిడి కారణంగా కూడా కనురెప్పలు రాలిపోతుంటాయి. నిద్రపోయే ముందు ఆలివ్ నూనె, ఆముదంలో దూది ముంచి కంటిపై మర్దన చేయాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే ఒత్తిడి తగ్గి, కనురెప్పలు పెరుగుతాయి.
- ఆలివ్‌నూనెలో నిమ్మతొక్కలను వారంపాటు ఉంచాలి. ఈ మిశ్రమాన్ని కనురెప్పలకు రాసుకోవాలి. 15 నిమిషాల తరువాత శుభ్రపరుచుకోవాలి. తరచూ ఇలా చేస్తే కనురెప్పలు పెరుగుతాయి.
- గ్రీన్ టీలో దూదిని ముంచి కనురెప్పల మీద పెట్టుకోవాలి. 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. తరచూ ఇలా చేస్తే కంటికి ఉపశమనం లభిస్తుంది.

సిరిముగ్గు

16 చుక్కలు 6 వరుసలు
6 వచ్చేవరకు



ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10, హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com



ఆర్. వసంత
సీతారాంబాగ్,
హైదరాబాద్

ఇంటి తలుపులు ఆకర్షణీయంగా!

కొత్తగా ఇల్లు కట్టించేవారు తమ తలుపులకు ఏయే రంగులు వాడాలో తెగ ఆలోచిస్తుంటారు. రంగులకు బదులుగా డిజైన్లను ఏర్పాటు చేస్తే అవి మరింతగా ఆకట్టుకుంటాయి. దీనికి చేయాల్సిందేంటంటే..

- మార్కెట్లో దొరికే తలుపులనే వాడాల్సిన పనిలేదు. వివిధ రకాల డిజైన్లను మీరు రూపొందించుకోవచ్చు. తలుపుల మీద పేర్లనే కాదు, మీకు నచ్చిన బొమ్మలను కూడా డిజైన్ చేయించుకోవచ్చు.
- ఇంటి సింహ ద్వారానికున్న తలుపుకు మీ పేరును చెక్కించవచ్చు. లేదంటే నేమ్ ప్లేట్ చేయించి దాన్ని తలుపులోనే ఇమిడేటట్లు చూసుకోండి. ఇలా అమర్చుకుంటే చూడడానికి ఆకర్షణీయంగా ఉంటుంది.
- పూజగది, వంటగది, పిల్లల గది అంటూ వేరుగా కట్టిస్తున్నారు. ఒక్కోగదికి వాటికి తగిన తలుపులని ఎంచుకుంటే బాగుంటుంది. అంటే.. వంటగదికి కూరగాయల బొమ్మలుండే విధంగా, పూజగదికి దేవుని ప్రతిమ, పిల్లల గదికి కార్టూన్లు కలిగిన బొమ్మలను చెక్కించండి. ఇంటికి తలుపులే అందాన్ని తీసుకువస్తాయి.
- ఇంటి నిర్మాణం చేపట్టేటప్పుడు వాడే కొయ్య ఒకే రకానికి చెందిన దాన్నే ఎంచుకోవాలి. వీటితో పాటు గ్లాస్ కాంబినేషన్ ఉంటే ఇంటికి మరింత అందం చేకూరుతుందంటున్నారు ఇంటీరియర్ డిజైనర్స్.
- తలుపుల నుంచి అప్పుడప్పుడు కిర్రుమనే శబ్దం వినిపిస్తుంటుంది. అలాంటప్పుడు తలుపు కింద శ్యాండ్ పేపర పెడితే సరిపోతుంది. లేదంటే మడతబందులో తరచూ కొబ్బరి నూనె వేస్తుంటే శబ్దాలు వినిపించవు. పెట్రోలియం జెల్లీ వాడినా ప్రయోజనం ఉంటుంది.



వంట చిట్కాలు



- కాకరకాయలు పండకుండా ఎక్కువరోజులు ఉండాలంటే చిన్న ముక్కలుగా కట్‌చేసి నిల్వ చేసుకోవాలి.
- రేకు డబ్బాలను కిరోసిన్‌తో కడిగి ఆ తర్వాత సబ్బుతో కడిగితే తుప్పు తేలికగా వదులుతుంది.
- కూరలో ఉప్పు ఎక్కువయితే ఆలూ ముక్కలు వేసి కొంచెం నీరు పోయాలి.
- వంట చేసేటప్పుడు చేతికి మరకలు అంటుకుంటే ఆలూ ముక్కలతో రుద్దుకొని కడుక్కోవాలి.
- కూరగాయలు వాడిపోతే నిమ్మరసం నీటిలో కొద్దిసేపు ఉంచితే తాజాగా మారతాయి.

నమస్తే తెలంగాణ
యువ
[హైదరాబాద్]
బుధవారం 2 జనవరి 2019

పలు రకాల సోషల్‌మీడియా వేదికలు..
వేలమంది అభిమానులు..
లక్షల రూపాయల విలువ చేసే బ్రాండ్లకు ఒప్పందాలు..
ఇవన్నీ ఎవరో సెలబ్రిటీలు చేస్తున్నవి కాదు..
సాధారణ స్థాయి నుంచి ఎదిగిన అసామాన్యులు..

ఇన్‌స్టగ్రామ్, స్నాప్‌చాట్, యూట్యూబ్ , టిక్‌టాక్, ఫేస్‌బుక్, షేర్‌చాట్ వంటి సామాజిక మాధ్యమ వేదికల ద్వారా తమ ప్రతిభను చాటుకొని ప్రభావశీలురుగా అవతారం ఎత్తారు. ఫ్యాషన్ నుంచి మొదలు ఫిట్‌నెస్, అందం, ట్రావెల్ ఇలా అన్ని రంగాల బ్రాండ్లకు బ్రాండింగ్ చేసే ఎత్తుకు ఎదిగారు. వాళ్ల వయసుకు వాళ్లకున్న అభిమానుల సంఖ్యకు సంబంధం లేదు. వాళ్లు చేస్తున్న పనులకు వాళ్లు ప్రభావం చూపుతున్న అంశాలకు అనుబంధం అంతకన్నా ఉండదు. చదువుకుంటూ పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన సమయంలో సోషల్ మీడియాలో వీడియోలు, ఫొటోలు పెట్టి సెలబ్రిటీలయ్యారు. పోస్టు పెడితే చాలు మస్తు లైకులు సంపాదించే స్థాయికి వచ్చారు. భారతదేశంలోని సోషల్ మీడియాలో అత్యంత ప్రభావశీలురైన పలువురు యువతీ యువకుల పరిచయమే ఈ వారం ప్రత్యేక కథనం..



వీళ్లు పోస్టు పెడితే..
లైకులే.. లైకులు

మనం చేసే పనిలో కొత్తదనం ఉంటే ఆదరిస్తారు. ఆశీర్వదిస్తారు. రాజ్వీ కూడా అంతే. సరదాగా ప్రారంభించి అనుకోకుండానే పాపులారిటీ సంపాదించింది. ఇరవై యేండ్ల రాజ్వీ గాంధీ.. సెలబ్రిటీ కాదు. స్టార్ కూతురు అంతకన్నా కాదు. ముంబైకి చెందిన సాధారణ అమ్మాయి. కానీ ఇన్‌స్టగ్రామ్‌లో ఆరు లక్షల ఇరవై వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. టిక్‌టాక్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో వీడియో పెట్టగానే కొన్ని గంటల్లోనే లక్షల వ్యూస్ సాధించగలదు. పాపులారిటీ సంపాదించి సెలబ్రిటీ అవ్వడమే కాదు. ఏదైనా అంశంపై ప్రభావం చూపే స్థాయికి ఎదిగింది.





సౌమ్య గుప్త పంతొమ్మిదేళ్లకే ఇన్‌స్టగ్రామ్ స్టార్ అయింది. ఆమె సోషల్‌మీడియాలో అడుగుపెట్టినప్పుడు ఆమె స్నేహితులు, చుట్టాలు మాత్రమే ఉన్నారు. ఫ్యాషన్ రంగంలో ప్రేరణ కలిగించే విధంగా తన అభిరుచులను, ప్రతిభను జోడించి చిత్రాలను తీసి వారానికి ఒకటి, ఏదైనా ప్రత్యేక పండుగలకు ఫొటోలు పోస్ట్ చేసేది. ఆమె పోస్టులు నచ్చి లక్షలమంది ఫాలోవర్స్ అయ్యారు. ఆమెను సెలబ్‌ని చేశారు. ఇటీవల 21వ పుట్టిన రోజు జరుపుకొన్న సౌమ్య పలు అంతర్జాతీయ బ్రాండ్లకు అంబాసిడర్‌గా ఉన్నది. కెల్విన్ క్లైవిన్, లారాయెల్, లాక్మే, వన్ ప్లస్ వంటి 50 సంస్థలకు ప్రచారం చేస్తున్నది. కంప్యూటర్ సైన్స్ చదువుతున్న ఈమె నెలకు సుమారు రెండు లక్షలు సంపాదిస్తున్నది.ఉన్నత చదువులు అయ్యాక యూట్యూబ్ చానల్ పెట్టాలనుకుంటున్నది. దుస్తుల వ్యాపారాన్ని ప్రారంభించి ఫ్యాషన్ రంగంలో రాణించాలనుకుంటున్నది.

పేరు సంపాదించడం చాలా కష్టం.. సంపాదించిన పేరును కాపాడుకోవడం మాత్రం అంతకన్నా కష్టం. ముంబైకి చెందిన యోగితా గుప్త కామర్స్ చదువుతున్నది. ఇన్‌స్టగ్రామ్‌లో 3.65 లక్షల ఫాలోవర్స్‌ను సంపాదించుకున్నది. ఇతర ప్రభావశీలురతో పోల్చుకుంటే ఇప్పటివరకు 83 పోస్టులు మాత్రమే పెట్టింది. కానీ వేల లైకులు వచ్చాయి. భిన్నమైన ప్రదేశాలు తిరుగుతూ విభిన్నమైన చిత్రాలు తీసి పోస్ట్ చేస్తుంది. మూస ధోరణిలో కాకుండా కొత్తగా చిత్రాలను తీయడం మొదలుపెట్టింది.



ఢిల్లీకి చెందిన పదిహేడేళ్ల పియూష్ చౌదరి కూడా సోషల్‌మీడియా ఫేమ్ సంపాదించాడు. సృజనాత్మక పోస్టులు పెట్టి వేల మంది అభిమానులను సంపాదించాడు. ఇప్పుడు పియూష్ మార్కెటింగ్ చేయడానికి బ్రాండింగ్ చేయడానికి నెలకు మూడు వేల రూపాయలు తీసుకుంటాడు.



సూరత్‌కు చెందిన భార్గవ్ ఖేనికి 75 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. పంతొమ్మిదేళ్లు ఉన్నప్పుడు చదువు మానేసాడు. పాపులారిటీ కోసం కాకుండా స్నేహితుల్లో ప్రత్యేకంగా ఉండాలని ప్రయత్నించాడు. తన చిత్రాలను ఫొటో ఎడిటింగ్ యాప్ ద్వారా ఆకట్టుకునే విధంగా ఎడిట్ చేయడం బాగా తెలుసు. పలు యాప్‌లలో చిత్రాలను ఎడిట్ చేసి పోస్ట్ చేయడంతో అందరినీ ఆకర్షించగలిగాడు. దీంతో లోకల్ సంస్థలు అతణ్ని సంప్రదించడం మొదలుపెట్టాయి. అప్పుడు ఉన్నత విద్యను ఆపేసి సోషల్‌మీడియా మీద దృష్టి సారించాడు. ఇప్పుడు ఒక్క ఫొటో ఎడిట్ చేస్తే సుమారు 500 రూపాయాలు తీసుకుంటాడు.



వీళ్లంతా తమ బ్రాండ్, ఫాలోవర్స్ కాపాడుకోవడానికి పోస్టులు పెట్టుకుంటారు. డబ్బు సంపాదించడానికి బ్రాండ్లను ప్రమోట్ చేస్తున్నారు. పాపులారిటీ తగ్గకుండా రెండింటినీ బ్యాలెన్స్ చేస్తున్నారు. టీనేజీ స్టార్స్‌గా పేరుగాంచి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంత చిన్న వయసులో ఇన్ని అద్భుతాలు చేసిన వీళ్ల నుంచి మనం మరిన్ని అత్యద్భుతాలను ఆశించడంలో తప్పు లేదు.

బిగ్‌బాస్ 12ను గెలిచింది..



డిసెంబర్ 30 న అంతా న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమవుతుంటే.. హిందీ బిగ్‌బాస్ అభిమానులు మాత్రం గ్రాండ్ ఫైనల్ ఎపిసోడ్‌తో ఎంజాయ్ చేశారు. బిగ్‌బాస్ సీజన్ 12 విజేతగా దీపికా కక్కర్‌ను ప్రకటించారు. కలర్స్ చానల్‌లో వచ్చే హిందీ బిగ్‌బాస్ 12 విజేతగా ఎవరు నిలుస్తారా? అన్న సందేహం చివరి నిమిషం వరకు గుట్టుగా ఉన్నది. హోస్ట్ సల్మాన్ ఖాన్ విజేత పేరు ప్రకటించాడు. ఆమె గురించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలివి..

- దీపికా గెలుపొందినందుకు గానూ ముప్పై లక్షల నగదు బహుమతి అందుకున్నది. రన్నరప్‌గా క్రికెటర్ శ్రీశాంత్ నిలిచాడు.
- దీపికాతో పాటు బిగ్‌బాస్ ఇంటి సభ్యులు ఫైనల్ వరకు వచ్చిన వాళ్లు 105 రోజులు ఇంట్లోనే ఉన్నారు.
- కలర్స్ చానల్లో ప్రసారమయ్యే 'ససురాల్ సిమర్ కా' సీరియల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది అభిమానుల్ని సంపాదించింది.
- ఇన్‌స్టాగ్రామ్‌లో కోటిమంది ఫాలోవర్స్‌ను సంపాదించిన సెలబ్రిటీగా రికార్డు సృష్టించింది. సోషల్‌మీడియాలో ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోస్టులు పెడుతూ యాక్టీవ్‌గా ఉంటుంది.
- దీపికా ఆహారప్రియురాలు. తిండి ఎంత ఇష్టమో ఆమె ఇన్‌స్టగ్రామ్ పోస్టులు చూస్తే తెలిసిపోతుంది.
- బిగ్‌హౌస్‌లో ప్రవేశించినప్పటి నుంచి దీపికా సందర్భాన్ని బట్టి స్పందిస్తూ వచ్చింది. తన స్వభావాన్ని మార్చుకోకుండా పరిస్థితులను బట్టి నడుచుకున్నది.
- దీపికా గెలిచిందన్న విషయం తెలిశాక భర్త షోయబ్ ఆమె దగ్గరికి వెళ్లి ఎత్తుకొని ఊరేగించాడు.
- 2010లో నీర్ భరే తేరే నైనా దేవి సీరియల్‌తో తెరంగ్రేటం చేసి అతి తక్కువ కాలంలోనే మంచి పేరు సంపాదించింది.
- నటనారంగంలోకి రాకముందు కొంతకాలం జెట్ ఎయిర్‌వేస్‌లో ఎయిర్ హోస్టెస్‌గా పనిచేసింది.
- జలక్ దిక్ లాజా అనే రియాలిటీ షోలో కూడా పాల్గొన్నది.
- తోటి ఉద్యోగి రౌనక్ సామ్సన్‌ని పెళ్లాడి కొంత కాలానికి విడాకులు ఇచ్చేసింది. సహ నటుడు షోయబ్‌తో చనువుగా ఉంటుందని భర్త గొడవ పడి విడాకులు ఇచ్చాడు.
- నాచ్ బలియే అనే డ్యాన్స్ ప్రోగ్రామ్‌లో షోయబ్, దీపికా కలిసి పాల్గొన్నారు. అదే షోలో షోయబ్ లవ్ ప్రపోజ్ చేశాడు. దానికి ఆమె ఎస్ అన్నది.
- దీపికా షోయబ్‌ను పెళ్లాడినప్పుడు రకరకాల వార్తలు చక్కర్లు కొట్టాయి.
- దీపికా తండ్రి ఆర్మీ ఆఫీసర్. ఆర్మీ ఉండే ప్రాంతాల్లో పెరిగింది. దేశభక్తి కూడా ఎక్కువే.
- జేపీ దత్తా పల్టన్ సినిమాలో నటించి బాలీవుడ్ వెండితెరకు పరిచయం అయింది.



పెద్ద ఆఫీసరు.. పెద్ద మనసు

ఉద్యోగ బాధ్యతలు అతనికి అసలు సమస్య ఎక్కడ ఉందో తెలియజెప్పింది. ఐఏఎస్ హోదాలో సబ్‌డివిజన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయన క్షేత్రస్థాయిలో కనిపించిన సమస్యలను చూసి చలించాడు. తనిఖీలలో కనిపించిన పాఠశాలలు ఆయనకు ఆలోచింపజేశాయి. తర్వాత అతను ఇంకేం చేశాడో చూడండి..



మేఘాలయలోని గారోహిల్స్ జిల్లా దండెగిరి సబ్‌డివిజన్ ఆఫీసర్ స్వాప్నిల్ తాంబె.. 2015 సంవత్సరం అసోం కేడర్ బ్యాచ్.. గిరాహిల్స్‌లోని దండెగిరిలో ఎస్‌డీఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అతను ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయాలనుకున్నాడు. వాటి దీన పరిస్థితిని చూసి రూపు మార్చేయాలనుకున్నాడు. తన పరిధిలోని స్కూళ్లకు కళ తేవాలని కంకణం కట్టుకున్నాడు. పాఠశాలల బాగుకోసం తన జీతాన్ని విరాళంగా ఇచ్చి, మరింత ఫండ్‌తో కొత్త కళ తెచ్చి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాడు. అందుకోసం ప్రతి రోజు ఉదయాన్నే అందుబాటులో ఉన్న పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసేవాడు. ఈ క్రమంలో అతనికి దయనీయ పరిస్థితులు కనపించాయి. కొన్ని లోయర్ ప్రయిమరీ స్కూల్స్ రెండు, మూడు రూమ్‌లతో ఇరుకుగా ఉండేవి. 30 నుంచి 40 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉండేవారు. గోడలన్నీ శిథిలావస్థలో చేరిన పాఠశాలలో విద్యార్థులంతా ఒకే రూంలో ఇబ్బందులు పడేవారు. అయితే ఈ విద్యా విధానంలో మార్పులు తేవాలనుకున్నాడు. వెంటనే ఆ జిల్లా డిప్యూటి కమిషనర్ ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ స్టార్'ను మొదలుపెట్టాడు. ఆ పేరుతో అందుబాటులో ఉన్న వనరులతో పాఠశాలలను అభివృద్ధి చేయొచ్చని ప్రచారం చేశాడు. మొదట తన పరిధిలోని అంగన్‌వాడీని ఎంచుకున్నాడు. దాన్ని అభివృద్ధి చేయాలని తన రెండు నెలల సాలరీ లక్షన్నర రూపాయలను దానికి కేటాయించాడు. దీంతో పాటు మిలాప్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా క్రౌడ్ ఫండింగ్‌కు శ్రీకారం చుట్టాడు. వచ్చిన విరాళాలతో శిథిలావస్థలో ఉన్న పాఠశాలను పునరుద్ధరించాడు. విద్యార్థులను పాఠశాలలకు రప్పించడానికి అవగాహన కార్యక్రమాలు, చుట్టూ గోడలను నిర్మించి వాటికి కళాత్మకమైన చిత్రాలు వేయించి ఆహ్లాదకరమైన వాతావరణం కలిగించాడు. అలా విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాడు. ఈ ఐఏఎస్ అఫీసర్ ప్రయత్నాన్ని చూసిన ఉన్నతాధికారులు కూడా స్పందించారు. మరింత ఫండింగ్‌తో పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాడు. వీటితో పాటు గ్రామాల్లోనూ మౌలిక వనరుల కల్పనకు స్వాప్నిల్ కృషి చేస్తున్నాడు.

స్మార్ట్‌గా చూస్తున్నారు!



ఆ వీడియోలు చూడడంలో యువత ముందున్నారట. 3 జీ, 4జీలు వచ్చాక స్మార్ట్‌గా చూసేస్తున్నారట. ఓ సంస్థ జరిపిన అధ్యయనంలో ఇంకేం తెలిసిందంటే..

పదమూడేళ్లకే పోర్న్ వీడియోలు చూస్తూ దొరికిపోయాడు హైదరాబాద్‌కు చెందిన ఓ కుర్రాడు. పోలీసులకు దొరికి కటకటాల పాలయ్యాడు. స్మార్ట్ ఫోన్ వచ్చాక వయసుతో పని లేకుండా పోయింది. ప్రభుత్వాలు, టెలికాం సంస్థలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఎన్ని చర్యలు చేపట్టినా లాభం లేకుండా పోయింది. స్మార్ట్ ఫోన్ వచ్చాక, జియోలాంటి సంస్థలు డేటా రేట్లు భారీగా తగ్గడంతో పోర్న్ వీడియోలు చూసే యువత సంఖ్య బాగా పెరిగింది. ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన పోర్న్‌హబ్ సంస్థ చేపట్టిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. రోజులో ఎక్కువ శాతం హాట్ వెబ్‌సైట్స్ బ్రౌజ్ చేస్తున్నట్టు, యువత దానికి బానిస లవుతున్నట్టు ఈ అధ్యయనం ద్వారా తెలిసింది. పోర్న్‌హబ్ సంస్థ ఆరో వార్షిక నివేదికను ఇటీవల విడుదల చేసింది. పోర్న్‌హబ్‌ను ఈ సంవత్సరంలో ఎక్కువగా చూసిన దేశాల్లో మన దేశం కూడా ఉండడం విశేషం. అమెరికా మొదటి స్థానం, బ్రిటన్ రెండో స్థానం, ఇండియా మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా 3,350 కోట్ల క్లిక్స్ ఈ సైట్‌కి వచ్చాయి. గతేడాదితో పోలిస్తే ఆరు రెట్లు పెరిగింది. ముఖ్యంగా 95శాతం మంది మొబైల్ ఫోన్లలోనే చూస్తున్నారు. ముఖ్యంగా భారతీయుల్లో 18 నుంచి 24 సంవత్సరాల లోపు వారే ఉన్నారు. మొత్తంగా చూసుకుంటే 44 శాతం మంది ఈ వయసు వారున్నారు. టెక్నాలజీ అభివృద్ధి చెందడం ఏంటోగానీ యువత మాత్రం పాడవుతున్నదంటున్నారు కొందరు పెద్దలు. సరదాగా మొదలై మానసిక సమస్యల వరకు వెళ్తున్నాయని, మైండ్‌ని కంట్రోల్ చేసుకోకుంటే నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.

సుడోకు

డైలీ సుడోకు 24 సమాధానం

1	6	3	9	2	4	8	7	5
8	9	4	5	3	7	1	2	6
7	2	5	6	8	1	3	9	4
2	8	1	7	6	5	9	4	3
3	4	7	1	9	2	5	6	8
9	5	6	8	4	3	2	1	7
4	3	8	2	7	9	6	5	1
6	1	9	4	5	8	7	3	2
5	7	2	3	1	6	4	8	9

డైలీ సుడోకు -25

	5		3			4		
1	3	4			8	6		
				2				
7			8		3	9	2	
					6		5	
9	1	2						8
				4		5	8	
			9			7		
	4		7					

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



రకుల్ ప్రీత్
@Rakulpreet

ట్విట్టర్‌లో మూడు మిలియన్ల మంది ఫాలోవర్స్ అయ్యారు. నా మీద ఇంత ప్రేమ చూపిస్తున్న మీ అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు.

రకుల్‌ని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 3,009,493

కామన్‌మ్యాన్ వాయిస్

రోడ్డు మీద ఇంద్రశేఖర్ రావు అనే వ్యక్తి బైక్ డ్రైవింగ్ చేస్తూ వెళ్తుంటాడు. ఇంతలో వెనుక నుంచి 40 యేండ్ల నుంచి బైక్ డ్రైవ్ చేస్తున్న ఇంద్రబాబు పెద్దగా హారన్ కొట్టుకుంటూ బైక్‌తో ఓవర్ స్పీడ్‌గా డ్రైవ్ చేస్తూ మెలికలు తిప్పుకొంటూ వెళ్తున్నాడు. వాడిని ఆపి 'తప్పు బ్రదర్ అలా వెళ్లకూడదని' నెమ్మదిగా చెబుతారా..? 'ఏరా పోరంబోకా? రోడ్ల మీద వెళ్లేది బేవార్స్ వెధవా.. ఈ రోడ్డు నీ బాబుగాడిది అనుకున్నావా' అని తిడతారా? పక్కన వెళ్తున్న వాహనదారుల లో సెన్స్ లేనివాళ్లకు ఇంద్రశేఖర్ తిట్లు మాత్రమే కనబడతాయి. కామన్‌సెన్స్ ఉన్న వాహనదారులకి ఇంద్రబాబు ఓవర్ డ్రైవింగ్ కనబడుతుంది. నాకు సెన్స్, కామన్‌సెన్స్ రెండూ ఉన్నాయి. అందుకే నేను ఇంద్రశేఖర్‌ని సపోర్ట్ చేస్తున్నా.
–Bezawada Sai

మహిళా బిల్లు మహిళలకు అవసరం. ట్రిపుల్ తలాక్ బిల్లు బీజేపీకి అవసరం.
–Nasreen Khan

వైరల్ వీడియో



కొందరు రికార్డుల బ్రేక్ సృష్టించి వాటిని బ్రేక్ చేయడానికే ఇండస్ట్రీకి వచ్చారా అనిపిస్తుంది. కాకపోతే ఏంటి మరి అజిత్ చేస్తున్న విశ్వాసం సినిమా ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలై హల్‌చల్ చేస్తున్నది.

Viswasam – Official Trailer | Ajith Kumar, Nayanthara | Sathya Jyothi Films
Total views : **15,935,370+**
Published on Dec 30, 2018

నమస్తే తెలంగాణ
సంకేత
[హైదరాబాద్]
బుధవారం 2 జనవరి 2019
టెక్నాలెడ్జ్ 2.0

హువాయ్ మేట్ 20ప్రో

నయామాల్



మొబైల్ కొన్న ఆర్నెల్ల తర్వాత అదే బ్రాండ్ నుంచి మరిన్ని కొత్త ఫీచర్లతో కొత్త మొబైల్ మార్కెట్లోకి విడుదలవుతుంది. ఉన్న ఫోన్ వాడలేక, కొత్త ఫోన్ కొనలేక మనసు చంపుకొని కాలం వెల్లదీస్తుంటాం. అయితే.. హువాయ్ కంపెనీ ఓ సరికొత్త మోడల్‌తో మార్కెట్లోకి ఓ మొబైల్‌ను విడుదల చేసింది. ఒక్కసారి ఆ మొబైల్ కొంటే ఐదేండ్ల వరకు ఫోన్ మార్చాల్సిన పని లేదంటూ హువాయ్ కంపెనీ ప్రచారం చేస్తున్నది. ఆ కొత్త మొబైల్ గురించి తెలుసుకుందామా!

ఆండ్రాయిడ్	: 9.0
డిస్‌ప్లే	: 6:39 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్	: 3120x1440
ర్యామ్	: 6/8 జీబీ
ఇంటర్నల్ మెమొరీ	: 128/ 256 జీబీ
రియర్ కెమెరా	: 40, 20, 8 మెగాపిక్సెల్స్ (మూడు కెమెరాలు)
సెల్ఫీ కెమెరా	: 24 మెగాపిక్సెల్స్
లాక్ సిస్టమ్	: త్రీడీ ఫేషియల్ రికగ్నైజేషన్
బ్యాటరీ సామర్థ్యం	: 4200 ఎంఏహెచ్ బ్యాటరీ
సిమ్	: డ్యుయల్ సిమ్
ప్రాసెసర్	: హువాయ్ కైరిన్ 980 ప్రాసెసర్
అందుబాటులో ఉన్న రంగులు	: బ్లాక్, గ్రేడియంట్ ట్విలైట్, ఎమరాల్డ్ గ్రీన్
ధర	: రూ. 69,990

మీ పాస్‌వర్డ్ బలంగా ఉందా?

ఇంతకీ మీ పాస్‌వర్డ్‌లు బలమైనవేనా? అసలు చెత్త పాస్‌వర్డ్‌లు ఎలా ఉంటాయి? సులభంగా హ్యాక్ చేయగల పాస్‌వర్డ్‌లు సేకరించి ప్రతీ ఏడాది 'ఫ్లాష్‌డేటా' అనే సంస్థ వంద చెత్త పాస్‌వర్డ్‌లను ఏడాది చివర్లో ప్రకటిస్తుంది. ఈ ఏడాది కూడా ఆ జాబితా విడుదల చేసింది. ఆ జాబితాలో అమెరికా అధ్యక్షుడైనా ట్రంప్ పేరును ఉద్దేశించిన పాస్‌వర్డ్ 23వ చెత్త పాస్‌వర్డ్ స్థానంలోఉంది. ఎప్పట్లాగే 123456 అనే పాస్‌వర్డ్ ప్రపంచ పరమ చెత్త పాస్‌వర్డ్‌గా మొదటిస్థానంలో నిలిచింది. ఎవరూ మన పాస్‌వర్డ్ దొంగిలించకుండా ఉండాలంటే ఈ సూచనలు పాటించండి.



ఇవే ఆ చెత్త పాస్‌వర్డ్‌లు

123456, password, 123456789, 12345678, 12345, 111111, 1234567, sunshine, qwerty, iloveyou, princess, admin, welcome, 666666, abc123, football, 123123, monkey, 654321, !@#$%^amp;*, charle, aa123456, donald, password1, qwerty123

- పాస్‌వర్డ్ ఆరు నుంచి ఎనిమిది క్యారెక్టర్లు ఉండేలా చూసుకోండి.
- ఎంచుకునే పాస్‌వర్డ్‌లో లోయర్‌కేస్, అప్పర్ కేస్ లెటర్లు, స్పెషల్ క్యారెక్టర్లు, సింబల్స్ ఉండటం సేఫ్.
- పుట్టినరోజులు, మొబైల్ నంబర్, వాహనం నంబర్ ఎట్టి పరిస్థితుల్లోనూ పాస్‌వర్డ్‌గా పెట్టుకోవద్దు.
- ఇంతకీ మీరు పెట్టుకున్న పాస్‌వర్డ్ స్ట్రాంగా ఉందా? మీ పాస్‌వర్డ్‌ని హ్యాక్ చేయడానికి ఎంత సమయం పడుతుందో తెలుసుకోవాలనుందా? అయితే ఈ కింది లింక్ క్లిక్ చేయండి. https://bit.ly/24oYk4k



5G నామ సంవత్సరం!

3జీ కూడా బోర్ కొట్టేసింది. ప్రస్తుతం 4జీ నేటి తరాన్ని అలరిస్తున్నది. పూర్తిగా 4జీ నెట్‌వర్క్‌ను ఆస్వాదించకముందే ఇదిగో.. వచ్చేస్తుంది.. అదిగో వచ్చేస్తుంది.. అంటూ ఊరించిన 5జీ మరి కొద్దిరోజుల్లో మీ ముందుకు, మీ అరచేతిలోకి రానుంది. ప్రపంచ దిగ్గజ మొబైల్ సంస్థలు ఈ కొత్త సంవత్సరంలో మీకోసం కొత్త మొబైల్స్‌ను 5జీ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసి మీకోసం సిద్ధంచేశాయి. 2019 పూర్తయ్యేలోపు ప్రతి ఒక్కరి చేతిలో 5జీ మొబైల్ ఉండాల్సిందే అంటున్నాయి ఆయా కంపెనీలు. త్వరలో రానున్న ఆ 5జీ మొబైల్స్ ఫీచర్లేంటో, ఏయే కంపెనీలు మనకోసం 5జీ ఫోన్లు విడుదల చేస్తున్నాయో ఓ లుక్కేద్దామా!



సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్10

సౌత్ కొరియాకు చెందిన సామ్‌సంగ్ కంపెనీ ఎప్పటికప్పుడు అధునాతన టెక్నాలజీ, ఆకట్టుకునే ఫీచర్లతో తన కస్టమర్లను అలరిస్తున్నది. ఇప్పుడు 5జీ నెట్‌వర్క్‌తో సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్10 పేరుతో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఈ మొబైల్‌లో 4కే క్వాలిటీ సినిమాలను స్ట్రీమ్ చేసుకోవచ్చు. 4కే టీవీకి సైతం కనెక్ట్ చేసుకోవచ్చు. 855 స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్ ఈ మొబైల్‌కి అమర్చారు. ఇది మొదటి మల్టీ గిగాబైట్ 5జీ హ్యాండ్‌సెట్. ఈ ఏడాది ఫిబ్రవరిలో స్పెయిన్‌లోని బార్సిలోనాలో జరుగనున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఈ మొబైల్ లాంచ్ చేయనున్నారు. 12ఎంపీ, 13 ఎంపీ, 16 ఎంపీ ట్రిపుల్ లెన్స్ టెక్నాలజీతో ఈ మొబైల్ కెమెరాలు రూపొందించారు. సెల్ఫీ కోసం డ్యుయల్ లెన్స్ కెమెరా అమర్చారు. బ్యాటరీ సామర్థ్యం 3000 ఎంఏహెచ్.

హువాయ్ పి 30 (మేట్30)

హువాయ్ పి 20 పేరుతో ఇప్పటికే మొబైల్ ప్రియులను కట్టిపడేసింది మొబైల్ సంస్థ. ఇప్పుడు 5జీ నెట్‌వర్క్‌తో పీ30 (మేట్30) అనే మోడల్‌ని ప్రవేశపెడుతూ మరోసారి సంచలనం సృష్టించడానికి సిద్ధమైంది. ఆండ్రాయిడ్ పీ తో ఈ 5జీ మొబైల్‌ను రూపొందించారు. కిరిన్ 980 ప్రాసెసర్, త్రీడీ ఫ్రంట్ కెమెరా సిస్టమ్‌తో ఈ మొబైల్‌ను మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. మేట్ 20 మొబైల్‌తో కెమెరా రూపకల్పనలో మంచి పేరు తెచ్చుకున్న హువాయ్ ఈ మొబైల్‌లో మరింత అధునాతన టెక్నాలజీతో పీ 30 (మేట్30) మొబైల్ కెమెరాలను రూపొందించింది.



ప్రవీణ్‌కుమార్ సుంకరి

5జీ ప్రత్యేకతలివే..

- 3జీ, 4జీ లతో పోలిస్తే 5జీ మరింత వేగంగా పనిచేస్తుంది. సిగ్నల్స్ లేని ప్రదేశంలో కూడా అత్యంత వేగంగా ఇంటర్నెట్‌ను వాడుకోవచ్చు.
- కిలోమీటర్ పరిధిలో ఒకేసారి మిలియన్ మంది నెట్‌వర్క్‌ను వాడుకునేంత కెపాసిటీ 5జీ నెట్‌వర్క్‌కి ఉంది.
- 4జీ నెట్‌వర్క్‌తో పోలిస్తే 5జీ 20 రెట్లు వేగంగా పనిచేస్తుంది.
- హెచ్‌డీ క్వాలిటీలో పూర్తి నిడివి సినిమాను కేవలం ఒకే ఒక్క సెకనులో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- వీఆర్, ఏఆర్ లాంటి టెక్నాలజీ సేవలు ఎక్కువగా ఉపయోగించే వారు 5జీ నెట్‌వర్క్‌తో ఎలాంటి అంతరాయం లేకుండా ఎంజాయ్ చేయొచ్చు.
- 3జీ సెకనుకు 384 కేబీపీఎస్ స్పీడుతో ఇంటర్నెట్ అందిస్తే, 4జీ 100 ఎంబీపీఎస్ స్పీడుతో ఇంటర్నెట్‌ను అందించింది.
- అదే.. 5జీ సెకనుకు 10 జీబీల స్పీడుతో ఇంటర్నెట్ సేవల్ని వినియోగదారులకు అందించనుంది.



- 800 మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్స్, 300 కంపెనీలు కలిసి వీలైనంత త్వరగా 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాయి.
- ఈ ఏడాది మార్కెట్లోకి రానున్న మొబైల్స్‌లో 5జీ ట్రయల్స్ నిర్వహిస్తారు. ఆ ఫలితాలను బట్టి 5జీ నెట్‌వర్క్ మరింత అభివృద్ధి చేసి అందుబాటులోకి తెస్తారు.
- ఈ ఏడాదంతా ట్రయల్స్, చెక్ ఇన్స్ పూర్తి చేసి 2020 కల్లా ప్రపంచవ్యాప్తంగా పూర్తిగా అందుబాటులోకి తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- 5జీ టెక్నాలజీ వాడకంలో చైనా, జపాన్, సౌత్ కొరియా దేశాలు ఇప్పటికే ముందున్నాయి. మనదేశంలో వాడే 4జీ టెక్నాలజీ కంటే హైలెవల్ 4జీని ఆ దేశాలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి.



సోనీ ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్4

యాపిల్ ఫోన్ తర్వాత చూడడానికి అంతే స్మార్ట్‌గా కనిపించే మొబైల్స్ సోనీ కంపెనీవి. స్టైలిష్ లుక్‌తో ఒకప్పుడు మొబైల్ ప్రపంచంలో రారాజుగా నిలిచింది సోనీ మొబైల్. కొన్ని కారణాల వల్ల వెనుకబడ్డా ఆ తర్వాత కోలుకొని పోటీ ప్రపంచంలో నిలబడింది. ఇప్పుడు 5జీ టెక్నాలజీతో దూసుకురానుంది. సోనీ ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్4 పేరుతో 5జీ టెక్నాలజీతో మార్కెట్లో 5జీ ఫోన్ల సరసన పోటీలో నిలువనుంది సోనీ. ముందువైపు రెండు, వెనుకవైపు రెండు కెమెరాలతో మొబైల్ ప్రేమికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. సౌండ్ క్లారిటీలో మరోసారి తనకెవరూ సాటిలేరంటూ హై రెజల్యూషన్ సౌండ్ టెక్నాలజీతో ఎక్స్‌జెడ్4 మొబైల్‌ను రూపొందించింది.

వన్‌ప్లస్ 7, వన్‌ప్లస్ 7టి



యాపిల్ సంస్థకు సైతం పోటీ ఇచ్చి వన్‌ప్లస్ 6, వన్‌ప్లస్ 6టి మొబైల్‌తో మార్కెట్లో నిలదొక్కుకున్న వన్‌ప్లస్ ఇప్పుడు 5జీ మొబైల్‌ని తీసుకొస్తున్నది. 850 చిప్‌సెట్‌తో క్వాల్‌కమ్ స్నాప్‌డ్రాగన్‌తో ఈ మొబైల్‌ను డిజైన్ చేశారు. 16 మెగాపిక్సెల్స్ కెమెరాలతో రియర్ కెమెరా, 20 మెగాపిక్సెల్స్‌తో సెల్ఫీ కెమెరాలను రూపొందించారు. ఆరున్నర అంగుళాల అతిపెద్ద డిస్‌ప్లేతో ఈ మొబైల్ ఆకట్టుకోనున్నది.

ఐఫోన్ ఎక్స్(2019)

లాస్ట్ బట్ నాట్ లీస్ట్.. మార్కెట్లోకి ఎన్ని ఫోన్లొచ్చినా.. నాకు నేనే సాటి.. నాకు నేనే పోటీ అనే టైపు మొబైల్ ఐఫోన్. తొలి నుంచి ఇప్పటి వరకు ఏ మాత్రం క్రేజ్ తగ్గని మొబైల్ బ్రాండ్ ఏదైనా ఉన్నదా అంటే అది యాపిల్ మాత్రమే. యాపిల్ విడుదల చేసే ఐఫోన్ల కోసం యాపిల్ మొబైల్ ప్రేమికులు, టెక్నాలజీ పండితులు కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తారు. అంత క్రేజ్ ఐఫోన్ అంటే. ఈ కొత్త సంవత్సరం గిఫ్టుగా ఐ ఫోన్ సైతం 5జీ టెక్నాలజీతో ఐఫోన్ ఎక్స్(2019) పేరుతో మార్కెట్లో బరిలో నిలువనుంది. 512జీబీ స్టోరేజీ సదుపాయంతో, డ్యుయల్ సిమ్ 5జీ హ్యాండ్‌సెట్‌ని పోటీలో నిలిపింది. వీటితో పాటు ఎంఐ, హానర్, ఒప్పో, హువాయ్ కంపెనీలు కూడా 5జీ నెట్‌వర్క్ మొబైల్స్‌ను రూపొందించి మార్కెట్లోకి అందుబాటులోకి తేనున్నాయి. లెట్స్ ఎంజాయ్!



డ్రైవర్ లేని బైకులొచ్చాయ్!

డ్రైవర్ అవసరం లేని కార్లు రోడ్ల మీద తిరుగుతున్న వీడియోలు చూసి ఆశ్చర్యపోయాం. కానీ ఇప్పుడు డ్రైవర్ అవసరం లేని బైకులు కూడా వచ్చేశాయంటే నమ్ముతారా? నమ్మాల్సిందే.. ఎందుకంటే బీఎండబ్ల్యూ డ్రైవర్ అవసరం లేని కొత్త తరం బైకులను రిలీజ్ చేసింది.



రిమోట్ సెన్సార్‌తో పనిచేసే ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బైకులు వాటంతటవే ఎక్కడికైనా వెళ్లిపోగలవు. ఎదురుగా ఏదైనా వాహనం ఉన్నప్పుడు హారన్ కొట్టడం, బ్రేక్ వేయడం, ఆగినప్పుడు స్టాండ్ వేయడం వంటి పనులు కూడా స్వయంగా చేసుకుంటుంది. బైకు వెనుకభాగంలో రోబో మిషన్లు అమర్చారు. మనుషులు నడుపుతున్న వాహనం నుంచి ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంటే ముందే పసిగట్టి హెచ్చరిస్తుంది. రక్షిస్తుంది కూడా. బీఎండబ్ల్యూ ఆర్1200 జీఎస్ పేరుతో ఈ బైక్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. గ్రాడ్యుయేట్ ఇంజినీర్ స్టీఫన్ హాన్స్ ఈ బైక్‌ను రూపొందించాడు. రానున్న రోజుల్లో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతూ మరెన్నో అద్భుతాలు సృష్టించగలదు అన్నదానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

గురుకులంలో ఇంటర్ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతిభ కళాశాలల్లో 2019-20కిగాను ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది.



- ప్రతిభ కళాశాలల్లో ప్రవేశాలు
- **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీతోపాటు ఐఐటీ/ ఎన్ఐటీ, నీట్ ఉచిత శిక్షణలు కూడా ఇస్తారు.
- **కళాశాల వారీగా వివరాలు:** టీటీడబ్ల్యూఆర్ ఐఐటీ స్టడీ సెంటర్-రాజేంద్రనగర్ (బాలురు), టీటీడబ్ల్యూఆర్ సీఓఈ వరంగల్ (బాలికలు), కురవి (బాలికలు), ఎస్ఓఈ-ఖమ్మం (బాలురు), టీటీడబ్ల్యూఆర్ సీఓఈ-వనపర్తి (బాలికలు), ఎల్లారెడ్డిపేట (బాలికలు), కురవి (బాలికలు), కల్వకుర్తి (బాలికలు), దేవరకొండ (బాలికలు), బాలానగర్ (బాలురు), దమ్మపేట (బాలురు) , మిర్యాలగూడ (బాలురు), నార్నూర్ (బాలురు), గాంధారి (బాలురు), కరీంనగర్ (బాలురు)
- ప్రతి కళాశాలల్లో ఎంపీసీ-40, బైపీసీ-40 సీట్లు, రాజేంద్రనగర్ సెంటర్లో ఎంపీసీ-50, బైపీసీ-40 సీట్లు, ఖమ్మంలో ఎంపీసీ-45, బైపీసీ-45 సీట్ల చొప్పున మొత్తం 1220 సీట్లు ఉన్నాయి.
- టీటీడబ్ల్యూఆర్ ఆధ్వర్యంలో పీవీటీజీ (సీఓఈ పీవీటీజీ-బాలురు)-మొయినాబాద్, సీఓఈ పీవీటీజీ-హయత్‌నగర్) కళాశాలలు కూడా నడుస్తున్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఉన్నాయి. ప్రతి గ్రూప్‌కి 40 చొప్పున మొత్తం 320 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** తెలంగాణ రాష్ట్రానికి చెందిన గిరిజన బాలబాలికలు, 2019 మార్చిలో పదోతరగతి పరీక్షలు హాజరవుతున్న విద్యార్థులు.
- **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా. స్క్రీనింగ్ టెస్ట్ (లెవల్1, లెవల్2)ను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది.
- ప్రవేశపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 160 మార్కులకు ఉంటుంది. ఎంపీసీ గ్రూప్‌వారికి ఇంగ్లిష్-40, మ్యాథ్స్-40, ఫిజిక్స్-40, కెమిస్ట్రీ-40, బైపీసీ వారికి ఇంగ్లిష్-40, బయాలజీ-40, ఫిజిక్స్-40, కెమిస్ట్రీ-40 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 21
- **ప్రవేశ పరీక్ష (లెవల్1):** ఫిబ్రవరి 10
- **ప్రవేశ పరీక్ష (లెవల్2):** మార్చి 10
- **వెబ్‌సైట్:** http://tgtwgurukulam.telangana.gov.in

స్పైసెస్ బోర్డ్‌లో ట్రెయినీలు

కొచ్చిన్‌లోని స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఖాళీగా ఉన్న ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **పోస్టు పేరు:** ట్రెయినీలు
- **మొత్తం ఖాళీలు:** 5 (ట్రెయినీ అనలిస్ట్ (మైక్రోబయాలజీ)-2, శాంపిల్ రిసిప్ట్ డెస్క్ ట్రెయినీ-3)
- **అర్హత:** సైన్స్/ఆర్ట్స్, కామర్స్‌లో డిగ్రీ, ఎమ్మెస్సీ (మైక్రోబయాలజీ/ ఫుడ్ మైక్రోబయాలజీ, అప్లయిడ్ మైక్రోబయాలజీ)లో ఉత్తీర్ణత.
- **స్టయిఫండ్:** రూ.17,000/- (ట్రెయినీ అనలిస్ట్‌లకు రూ. 18,000/-)
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** 2019 జనవరి 14
- **వెబ్‌సైట్:** www.indianspices.com

బీఎస్ఎఫ్‌లో స్పోర్ట్స్ కోటాలో

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) వివిధ ప్రాంతాల్లో స్పోర్ట్స్ కోటా విభాగంలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- **పోస్టు:** కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ)/ పురుషులు
- **మొత్తం ఖాళీల సంఖ్య -63**
- **విభాగాల వారీగా ఖాళీలు:** ఆర్చరీ-2, అక్వాటిక్-5, అథ్లెటిక్స్-6, బాస్కెట్‌బాల్-3, బాక్సింగ్-3, ఫుట్‌బాల్-3, జిమ్నాటిక్స్-2, హ్యాండీబాల్-2, హాకీ-2, జూడో-2, కబడ్డీ-4, ఖోఖో-3, తైక్వాండో-4, వుషూ-8, వాలీబాల్-4, వాటర్‌స్పోర్ట్స్ -2, వెయిట్‌లిఫ్టింగ్-4, రెజ్లింగ్-4
- **అర్హత:** పదోతరగతిలో ఉత్తీర్ణత. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర అంతర యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొని ఏదైనా పతకాన్ని సాధించి ఉండాలి.
- **వయస్సు:** 2018 ఆగస్టు 1 నాటికి 18 నుంచి 23 ఏండ్ల మధ్య ఉండాలి .
- **పే స్కేల్:** రూ. 21,700/-
- **ఎంపిక:** పీఎస్‌టీ, స్పోర్ట్స్ ట్రయిల్స్ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తులను పంపించాలి.
- **వెబ్‌సైట్:** http://bsf.nic.in

ప్రాజెక్టు సైంటిస్టులు

చెన్నైలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ పరిధిలో పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ (ఎన్ఐఈ)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- మొత్తం పోస్టులు-26
- **విభాగాల వారీగా ఖాళీలు:** ప్రాజెక్టు సైంటిస్ట్ సీ-1, ప్రాజెక్టు సైంటిస్ట్ బీ-4, ప్రాజెక్టు సీనియర్ నర్స్-2, ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ (పబ్లిక్ హెల్త్ నర్సింగ్)-1, ప్రాజెక్టు టెక్నీషియన్ (గ్రేడ్-3)-2, ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్-2, ప్రాజెక్టు టెక్నీషియన్-1, ప్రాజెక్టు స్టాఫ్ నర్స్-1, సీనియర్ ప్రాజెక్టు రిసెర్చ్ ఫెలో-1, ప్రాజెక్టు టెక్నికల్ ఆఫీసర్-2, ప్రాజెక్టు అప్పర్ డివిజన్ క్లర్క్-1, ప్రాజెక్టు సెక్షన్ ఆఫీసర్-1, ప్రాజెక్టు అడ్మిన్ కమ్ అకౌంట్స్ అసిస్టెంట్-1, ప్రాజెక్టు డాటా ఎంట్రీ ఆపరేటర్-2, ప్రాజెక్టు ఫీల్డ్ అటెండెంట్(ఎంటీఎస్)-1, ప్రాజెక్టు మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ల్యాబ్)-3
- **అర్హత:** సంస్థ నిబంధనల ప్రకారం.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 9-11, 18-29 వరకు
- **వెబ్‌సైట్:** www.nie.gov.in

ఎంఎస్ఎంఈలో

హైదరాబాద్‌లోని ఎంఎస్ఎంఈ-టూల్ రూమ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టుల వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

MSME
MICRO, SMALL & MEDIUM ENTERPRISES


ఫ్యాకల్టీలు

- **విభాగాలు:** క్యాడ్/కామ్/సీఎంఈ, వీఎల్ఎస్ఐ, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, టూల్ డిజైన్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్,
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో/బ్రాంచీలో ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ/ఎంసీఏ, ఎంఏ, ఎమ్మెస్సీ (మ్యాథమెటిక్స్), బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత. సంబంధిత టీచింగ్ రంగంలో అనుభవం ఉండాలి.

ఆఫీస్ అసిస్టెంట్

- **అర్హత:** బీకాం/బీఎస్సీతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** 2019 జనవరి 5
- **వెబ్‌సైట్:** www.citdindia.org

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
బుధవారం 2 జనవరి 2019


'వినయ విధేయ రామ' చిత్రంలో కియారా అద్వానీ, రామ్‌చరణ్


నాగచైతన్య

బాలీవుడ్ రీమేక్‌లో?

మలయాళ హిట్ చిత్రం 'ప్రేమమ్' తర్వాత మరో రీమేక్ చిత్రం చేయడానికి రెడీ అయ్యాడు నాగచైతన్య. ప్రస్తుతం శివ నిర్వాణ రూపొందిస్తున్న 'మజిలీ' చిత్రంలో నటిస్తున్నారు నాగచైతన్య. చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ సినిమా సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా తరువాత ఈ రీమేక్ చిత్రంలో నటించనున్నట్లు తెలిసింది. ఆయుష్మాన్ ఖురానా, కృతిసనన్, రాజ్‌కుమార్ రావు కీలక పాత్రల్లో నటించిన బాలీవుడ్ చిత్రం 'బారెల్లీకి బర్ఫీ' తెలుగు రీమేక్‌లో నాగచైతన్య నటించబోతున్నాడు. 2017 ఆగస్టులో విడుదలైన ఈ చిత్రం అక్కడ మంచి విజయాన్ని సాధించింది. కాగా ఈ చిత్ర తెలుగు రీమేక్ హక్కుల్ని కోన ఫిలిమ్ కార్పొరేషన్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సొంతం చేసుకున్నాయి. ఈ కథ నాగచైతన్యకు సరిపోతుందని, అతనితో రీమేక్ చేయాలనే ఆలోచనలో చిత్ర వర్గాలు వున్నాయాయని, ఇందులో నటించడానికి నాగచైతన్య కూడా సుముఖంగా వున్నట్లు సమాచారం.


శంకర్

హృతిక్‌తో సైంటిఫిక్ థ్రిల్లర్?

విలక్షణ కథాంశాల్ని ఎంచుకుంటూ సినీ ప్రేమికులకు నవ్యానుభూతిని అందివ్వాలని తపిస్తుంటారు ప్రముఖ తమిళ దర్శకుడు శంకర్. ఇటీవలే '2.ఓ' చిత్రంతో ప్రేక్షకులముందుకొచ్చిన ఆయన తాజాగా మరో సైంటిఫిక్ థ్రిల్లర్ సినిమాకు సన్నద్ధమవుతున్నట్లుగా తెలుస్తున్నది. ఇందులో బాలీవుడ్ అగ్ర హీరో హృతిక్‌రోషన్ నటించనున్నట్లు సమాచారం. 'రోబో' '2.ఓ' చిత్రాల విజయం ఇచ్చిన స్ఫూర్తితో శంకర్ వైవిధ్యమైన ఇతివృత్తంతో ఈ సైంటిఫిక్ థ్రిల్లర్‌కు రూపకల్పన చేశారని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ తయారీలో శంకర్ నిమగ్నమై ఉన్నారని అంటున్నారు. భారీ నిర్మాణ వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ సినిమాను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం శంకర్ 'భారతీయుడు-2' పూర్వ నిర్మాణ పనులతో బిజీగా ఉన్నారు. కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించనున్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌మీదకు రానుంది. ఈ సినిమా పూర్తయిన వెంటనే హృతిక్‌రోషన్‌తో చేయబోయే సైంటిఫిక్ థ్రిల్లర్ చిత్రం ప్రారంభమవుతుందని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది.

దేశ రక్షకుడు..


సూర్య

సూర్య కథానాయకుడిగా కె.వి. ఆనంద్ దర్శకత్వంలో ఓ తమిళ చిత్రం తెరకెక్కుతున్నది. పొలిటికల్ యాక్షన్ ఇతివృత్తంతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు 'కప్పాన్' అనే పేరును ఖరారు చేశారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో సూర్య ఎన్‌ఎస్‌జీ కమాండోగా కనిపిస్తున్నారు. దేశ రక్షణ కోసం పోరాడే నిజాయితీపరుడైన అధికారిగా ఆయన పాత్ర భిన్న పార్శ్వాలతో ఛాలెంజింగ్‌గా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. మోహన్‌లాల్, ఆర్య, సయేషా సైగల్ ఈ సినిమాలో కీలక పాత్రలను పోషిస్తున్నారు. 'అయాన్', 'మాట్రాన్' తర్వాత సూర్య, దర్శకుడు కె.వి. ఆనంద్ కలయికలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. డెబ్భై శాతం చిత్రీకరణ పూర్తయినట్లు సమాచారం.


రాజశేఖర్

కల్కి అవతారం!

డా॥రాజశేఖర్ కొంత విరామం తరువాత నటించిన చిత్రం 'పీఎస్‌వి గరుడవేగ'. సరికొత్త నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని రాజశేఖర్ కొత్త తరహా చిత్రాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'కల్కి'. ప్రశాంత్ వర్మ దర్శకుడు. అదాశర్మ, నందితాశ్వేత కథానాయికలు. సి.కల్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను మంగళవారం చిత్ర బృందం విడుదల చేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'యాంగ్రీయంగ్‌మెన్ రాజశేఖర్‌ను కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. 1983 నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం' అన్నారు. నాజర్, అశుతోష్‌రాణా, రాహుల్ రామకృష్ణ, చరణ్‌దీప్ తదితరులు నటిస్తున్నారు.

రాజకీయాల్లోకి ప్రకాష్‌రాజ్

- స్వతంత్ర్యంగా బరిలోకి దిగుతానని ప్రకటన



భారతీయ జనతా పార్టీపై వ్యతిరేక గళాన్ని వినిపించడంతో పాటు సమకాలీన రాజకీయ అంశాలపై తనదైన శైలిలో విమర్శల్ని సంధిస్తూ గతకొంతకాలంగా రాజకీయ తెరపై చురుగ్గా కనిపిస్తున్నారు ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్. తాజాగా తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నట్లు ప్రకటించారాయన. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రాజ్ ట్విట్టర్‌లో చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తున్నది. 'అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. మరింత బాధ్యతతో కూడుకున్న కొత్త ఆరంభమిది. మీ అందరి మద్దతుతో వచ్చే పార్లమెంట్ ఎలక్షన్లలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్నాను. ఏ నియోజక వర్గంలో పోటీ చేస్తాననే విషయాన్ని త్వరలో వెల్లడిస్తాను. ఈసారి ప్రజా ప్రభుత్వమే..' అంటూ సిటిజన్స్‌వాయిస్, జస్ట్ ఆస్కింగ్ ఇన్ పార్లమెంట్ టూ అనే హాష్‌ట్యాగ్‌లను జతచేశారు. ప్రకాష్‌రాజ్ వ్యాఖ్యలు దక్షిణాది రాష్ట్రాల్లో సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. స్వరాష్ట్రం కర్ణాటక నుంచి ఆయన లోక్‌సభకు పోటీ చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రకాష్‌రాజ్ గత కొన్నేళ్లుగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్ని చేపడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేశంపేట మండలంలోని కొండారెడ్డిపల్లి అనే గ్రామాన్ని ప్రకాష్‌రాజ్ దత్తత తీసుకొని పలు అభివృద్ధి కార్యక్రమాల్ని చేశారు. డిసెంబర్‌లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు సంపూర్ణంగా మద్దతు పలికారు ప్రకాష్‌రాజ్.


రకుల్‌ప్రీత్‌సింగ్

ఇంతకంటే ఏం అడగను?

'2018 ఎన్నో మధురానుభూతులను మిగిల్చింది. అద్భుతమైన వ్యక్తులతో పనిచేశాను. వినూత్న ఇతివృత్తాల్లో భాగమయ్యే అవకాశం దొరికింది. కొత్త ప్రదేశాల్ని చూడగలిగాను. మంచి స్నేహితులు దొరికారు. ఇంతకంటే ఎక్కువ ఏం అడగను' అని చెప్పింది రకుల్‌ప్రీత్‌సింగ్. తొమ్మిదేళ్ల సినీ ప్రయాణంలో ఏడాదికి ఐదారు సినిమాలు చేస్తూ వచ్చిన ఈ సొగసరి 2018లో తన జోరును తగ్గించింది. హిందీ చిత్రం 'అయ్యారీ' మినహా రకుల్‌ప్రీత్ నటించిన సినిమాలేవి విడుదలకాలేదు. తాను నటించిన సినిమాలు విడుదలకాకపోయినా వృత్తిపరంగా గత ఏడాది ఎంతో సంతృప్తిని మిగిల్చిందని చెప్పింది రకుల్‌ప్రీత్‌సింగ్. ఆమె మాట్లాడుతూ 'పరాజయాల కారణంగా గత ఏడాది సినిమాలకు దూరమయ్యానన్నది అవాస్తవం. విజయం ఒక్కరిపై ఆధారపడి ఉండదు. సమిష్టి కృషి వల్లే అది సాధ్యమవుతుంది. చేయబోయే సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందా?లేదా? అన్నది ముందుగా ఎవరూ ఊహించలేరు. కొన్ని సినిమాలు విజయవంతమవ్వగానే కథానాయికల్ని గోల్డెన్‌గర్ల్ అంటారు. ఒక్క పరాజయం ఎదురవ్వగానే ఐరన్‌లెగ్ అనే ముద్రవేస్తారు. అలాంటి మాటలు విని బోర్ కొట్టింది. సృజనకు పరిమితులు విధించుకోవడం నాకు ఇష్టం ఉండదు. తెలుగుకే పరిమితం కాకుండా భిన్న భాషల్లో సినిమాలు చేయాలనే ఆలోచనతోనే గత ఏడాది తమిళం, హిందీ భాషలపై దృష్టిసారించాను. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా 2018లో సాధించిన పరిణితి పట్ల సంతృప్తిగా ఉన్నాను. గత ఏడాది నా సినీ ప్రయాణం ఆనందంగా సాగింది. భవిష్యత్తు మరింత గొప్పగా ఉంటుందనే నమ్మకంతో ఉన్నాను. ఈ ఏడాది సాధించబోయే విజయాల కోసం ఉత్సుకతగా ఎదురుచూస్తున్నాను' అని తెలిపింది.


'మహ' చిత్రంలో హన్సిక

కిల్లర్ హన్సిక

హన్సిక కథానాయికగా అరంగేట్రం చేసి దాదాపు పదిహేనేళ్లు అవుతోంది. సుదీర్ఘ ప్రయాణంలో గ్లామర్ పాత్రల్లోనే ఎక్కువగా కనిపించింది ఈ సొగసరి. గత కొంతకాలంగా తమిళ, తెలుగు భాషల్లో హన్సిక నటించిన సినిమాలు పరాజయాలుగా నిలుస్తుండటంతో మూస కథాంశాలకు దూరంగా ఉంటున్న ఆమె ప్రయోగాలకు ప్రాధాన్యతనిస్తున్నది. తాజా తమిళ చిత్రం 'మహా' లో ప్రతినాయిక పాత్రలో కనిపించబోతున్నది. రకరకాల మారు వేషాలతో అందరిని మోసం చేసే కిల్లర్‌గా హన్సిక పాత్ర ఈ సినిమాలో వినూత్నంగా సాగుతుందని చిత్ర బృందం చెబుతున్నది. ఆమె కెరీర్‌లో యాభయ్యవ సినిమా ఇది. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జమీల్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణను జరుపుకుంటున్నది. తెలుగులో హన్సిక 'ఎన్టీఆర్' బయోపిక్‌లో అతిథి పాత్రతో పాటు సందీప్‌కిషన్‌తో మరో సినిమా చేస్తున్నది.

రవిబాబు 'ఆవిరి'




వినూత్నమైన చిత్రాలతో ఆకట్టుకునే దర్శకుడు, నటుడు రవిబాబు తాజాగా కొత్త చిత్రానికి శ్రీకారం చుడుతున్నారు. ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించనున్న ఈ చిత్రానికి 'ఆవిరి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం మంగళవారం విడుదల చేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది ఆఫ్ బీట్ సినిమా. పోస్టర్ చూసిన వాళ్లంతా కొత్తగా వుందని చెబుతున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని తెలియజేస్తాను' అని తెలిపారు.


శైలజ, సమీర్‌ఖాన్

కెఎస్ 100 రహస్యం

సమీర్‌ఖాన్, శైలజ జంటగా నటిస్తున్న చిత్రం 'కెఎస్ 100'. షేర్ దర్శకుడు. వెంకట్‌రెడ్డి నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాత మాట్లాడుతూ 'టైటిల్‌కు తగినట్లుగానే వైవిధ్యమైన కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిది. కెఎస్ 100 పేరు వెనకున్న రహస్యమేమిటన్నది ఉత్కంఠభరితంగా ఉంటుంది. హారర్, సస్పెన్స్, థ్రిల్లర్, రొమాన్స్ హంగుల సమ్మిళితంగా ఉంటుంది. యువతరంతో పాటు మహిళా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. గోవా, హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని హిరంబుల్‌లో ప్రధాన ఘట్టాలను చిత్రీకరించాం. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. అక్షిత, అషి, శ్రద్ధా, నందిని, కల్పన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నవనీత్ చారి, కెమెరా: వంశీ.

చెడ్డీ గ్యాంగ్‌తో పోరాటం


స్నేహాకపూర్

అమర్, ప్రదీప్ వర్మ, ఉదయ్, అభి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'చెడ్డీ గ్యాంగ్'. రాజ్ ప్రొడక్షన్స్ ఇంటర్నేషనల్ పతాకంపై విక్కీరాజ్ నిర్మిస్తున్నారు. కనగాల రమేష్ చౌదరి దర్శకుడు. శ్రీనివాస రెడ్డి కీలక పాత్రధారి. ఈ నెలలో విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'కేరళలోని అడవుల్లో చిక్కుకుపోయిన పది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అక్కడ నుంచి ఏ విధంగా బయటపడ్డారు? వారికి ఆ ఆడవిలో ఎలాంటి అనూహ్య పరిణామాలు ఎదురయ్యాయి?అన్నది ఉత్కంఠను పంచుతుంది. సస్పెన్స్ అంశాలతో ఆద్యంతం థ్రిల్‌ను కలిగిస్తుంది. కేరళలోని ఏర్నాకుళం, ఇరిట్టి అడవులతో పాటు హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. బాలీవుడ్ నటి స్నేహాకపూర్‌పై చిత్రీకరించిన ప్రత్యేక గీతం అలరిస్తుంది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసి సంక్రాంతికి సినిమాను విడుదలచేస్తాం' అని చెప్పారు.